# విజయ రహస్యం

ధర్మక్షేత్ర



# విజయ రహస్యం

మీరు జీవితంలో ఏదైనా సాధించ దలుచుకున్నారా? జీవితం అశాంతితో, అపజయాలతో కూడుకొని ఉందా? జీవితం దిక్కుతోచకుందా?

జీవితం చదరంగంలాంటి ఒక ఆట. మీకు తెలిసో తెలియకుండానో 'కాలం' అనే నిరంకుశుడైన ప్రత్యర్థితో ఆడుతున్నారు. మీరు తప్పు ఎత్తు వేసినా లేక అసలు ఏ ఎత్తూ వేయకపోయినా మీ పావులన్నీ తొలగించబడతాయి. ఆట ముగిసిపోతుంది.

జీవితాన్ని గెలిచే, ఆస్వాదించే రహస్యం ఈ పుస్తకంలో ఉంది.
అది తెలుసుకోవాలంటే వెంటనే ఈ పుస్తకాన్ని చదవండి.


ధర్మక్షేత్ర

3-122, రాజీవ్‌గాంధి రోడ్డు, గిరింపేట,
చిత్తూరు (ఆం.ప్ర.) 517 002.
siva.dharmakshetra@gmail.com
Phone : 88974 59173
www. dharmakshetra.info



# కృతజ్ఞతలు మరియు నమస్సులు



1. గాంధీ ఆత్మకథ (నవ జీవన్ ట్రస్ట్)
2. గాంధీ మహామనిషి – ఏక్‌నాథ్ ఈశ్వరన్, బ్లూ మౌంటెన్ సెంటర్ ఆఫ్ మెడిటేషన్ వ్యవస్థాపకులు. కాపీరైట్ 1997, 2011 నీలగిరి ప్రెస్‌వారి అనుమతి తీసుకోబడింది. పి.ఓ. బాక్స్ 256, తోమాలెస్, కాలిఫోర్నియా 94971 U.S.A. www.easwaran.org
3. థింక్ అండ్ గ్రో రిచ్ – నెపోలియన్ హిల్
4. భగవద్గీత – ఏక్‌నాథ్ ఈశ్వరన్ అనువాదం, బ్లూ మౌంటెన్ సెంటర్ ఆఫ్ మెడిటేషన్ వ్యవస్థాపకులు. కాపీరైట్ 1985, 2007 నీలగిరి ప్రెస్‌వారి అనుమతి తీసుకోబడింది. పి.ఓ. బాక్స్ 256, తోమాలెస్, కాలిఫోర్నియా 94971 U.S.A. www.easwaran.org
5. గాంధీ జీవితం – కృష్ణ కృపలానీ
6. గాంధీయన్ హోలిస్టిక్ ఎకనామిక్స్ – శశి ప్రభ శర్మ
7. ద ఆల్కెమిస్ట్ – పౌలో కోలో
8. గీతామకరందము – శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు
9. పుస్తకంలోని బొమ్మలను రచించి ఇచ్చినవారికి
10. ఈ గ్రంథ రచనకు స్ఫూర్తినిచ్చి ప్రచురణకు సహకరించిన వారందరికి.

# మిత్ర సందేశం

ఇది ఒక అమూల్యమైన, అద్భుతమైన, అపురూపమైన రచన అని నా అభిప్రాయం. ఇట్లాంటి పుస్తకాలు మనకు తరచూ లభించవు. ఎంతో అనుభవాన్ని, బహుగ్రంధ పరిశీలనా ప్రావీణ్యాన్ని, మానవమనస్తత్వ విజ్ఞానాన్ని, మానవ ప్రగతికి సంబంధించిన పరిణామ దశలను, సామాజిక శాస్త్రాన్ని, ప్రపంచ చరిత్రను, విజేతల పనితనాన్ని బాగా అధ్యయనం చేసి ఈ పుస్తకాన్ని రూపొందించినారు. ప్రతి ఒక్కరు ఇందలి విషయాలను చదవి తప్పక స్ఫూర్తి పొందుతారు.

అభినందనలతో...


**ప్రొఫెసర్ పుదూరు విశ్వనాథ అరుణాచలం**

వ్యవస్థాపక వైస్ చాన్సలర్, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

విశ్రాంత అధ్యక్షులు, ఇండియన్ మేథమేటికల్ సొసైటీ,

విశ్రాంత ప్రిన్సిపాల్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

చార్టర్ ప్రెసిడెంట్, రోటరీ క్లబ్, గ్రేటర్ తిరుపతి.

# విషయసూచిక


**ఉపోద్ఘాతం ........................................................ 01**

**ఒకటవ భాగం : భౌతిక విజయం**

1. జీవితం ఒక యుద్ధరంగం.................................... 03
2. ఆలోచనే బీజం.................................... 08
3. సంకల్ప బలం.................................... 12
4. విశ్వాసం కొండల్ని కూడా కదిలించగలదు.................................... 15
5. జ్ఞానయోగం : విజ్ఞానాన్ని సరియైన రీతిలో ఉపయోగించడం........ 20
6. జ్ఞానం కన్నా బలీయమైనది ఊహాశక్తి.................................... 27
7. ప్రణాళికల ద్వారా కార్యాచరణను రూపొందించడం.................... 31
8. విశ్వహృదయం, 1 + 1 = > 2.................................... 35
9. నాయకత్వం, సహచరులను లక్ష్యంవైపు నడిపించడం................ 40
10. ఉపచేతన మనస్సు, మానవహృదయానికి విశ్వహృదయానికి మధ్య వారధి.................................... 44
11. విశ్వాసం కలిగించే నిర్భయత్వం.................................... 50
12. కృషితో నాస్తి దుర్భిక్షం.................................... 56

**రెండవ భాగం : ఆధ్యాత్మిక విజయం.................................... 60**

13. సృష్టి పరిణామ క్రమం.................................... 64
14. మాయ, భగవంతుని దివ్య లీల.................................... 70
15. ధ్యాన యోగం.................................... 79
16. భక్తి యోగం (ప్రేమ మార్గం).................................... 85
17. కర్మ యోగం.................................... 90
18. మృత్యువు నుండి అమరత్వానికి పయనం !.................................... 96

**సారాంశం.................................... 104**

**ఉపసంహారం.................................... 109**

**నిత్యజీవితంలో ధర్మాచరణ.................................... 112**

**హృదయపూర్వక విన్నపం ! .................................... 114**

# ఉపోద్ఘాతం

మీరు జీవితంలో ఏమి కోరుకుంటున్నారు ? ఉద్యోగమా, ధనమా, జ్ఞానమా, అధికారమా, పేరు ప్రతిష్టలా లేక ఆనందమా?

ధనవంతులైనప్పటికి, బీదవారైనప్పటికి మన అందరికి ఒక ఆస్తి సమానంగా పంచబడింది – అదే సమయం. ప్రతి ఒక్కరికి రోజులో 24 గంటలు మాత్రమే ఉంటాయి. అయితే కొంత మంది తాము కోరుకున్న వాటినన్నిటినీ స్వల్ప ప్రయత్నంతో సాధిస్తుండగా మరి కొంత మంది అత్యధిక వ్యయ ప్రయాసలతో వాటిని సాధించవలసి వస్తుంది. ఇంకెంతో మంది పరాజితులుగానే మిగిలిపోవలసి వస్తుంది. ఎందుకిలా జరుగుతుంది?

ఏదైనా సాధించాలంటే కావలసిన శక్తి సామర్థ్యాలన్నీ మెదడులో వున్నాయి. అయితే తమ మెదడును తగిన రీతిగా ఉపయోగించుకోవటం కొద్ది మందికే సాధ్యపడుతున్నది. మెదడు యొక్క శక్తి సామర్థ్యాలు తెలుసుకుంటే దాని శక్తి అద్భుతం అనిపిస్తుంది.

ఎన్నో తరాలుగా ఎందరో గురువులు, రచయితలు మొదలైనవారు ఒక గొప్ప జ్ఞాన భాండారాన్ని సమీకరించారు. ఆ జ్ఞానాన్ని ఈ పుస్తకంలో విరివిగా ఉపయోగించుకోవటం జరిగింది. కానీ ఈ పుస్తకం యొక్క ధ్యేయం ఏ మతాన్నీ, జాతినీ మొదలైన వాటిని విమర్శించటం గానీ, సమర్థించటం గానీ కాదు. ఈ పుస్తకం యొక్క ముఖ్య ఉద్దేశ్యం పాఠకుడు జీవితంలో విజయం పొందటానికి తోడ్పడటమే. పుస్తకం సరళంగా ఉండటం కోసం 'మానవుడు', 'అతడు' వంటి పదాలు ఉపయోగింపబడినప్పటికి ఈ పుస్తకం స్త్రీ, పురుషులిరువురినీ ఉద్దేశించి వ్రాయబడినది.

మన మెదడుపై తల్లిదండ్రుల, గురువుల మరియు సమాజ ప్రభావం ఎంతో ఉంటుంది. వాటి ద్వారా ఏర్పరచుకున్న అభిప్రాయాలు, నమ్మకాల ఆధారంగా మనం కొత్త సమాచారాన్ని అంగీకరించటం కానీ తిరస్కరించటంకానీ చేస్తాము. ఈ పుస్తకంలోని కొన్ని అంశాలు అసాధ్యంగానూ, అభూత కల్పనగానూ, పాత పద్ధతులు గానూ అనిపించినప్పటికి వాటిని తిరస్కరించవద్దు.

ఈ పుస్తకంలోని విషయాలు కాల పరీక్షకు నిబడిన సార్వజనీన సత్యాలు! విశాలహృదయం (ఓపెన్ మైండ్) తో వాటిని స్వీకరిస్తూ కఠినమైన విషయాలను మళ్ళీ మళ్ళీ అధ్యయనం చేయండి.

ఈ పుస్తకం క్రింది మూడు అంశాలపై ఆధారపడి ఉంది.

1. మహాత్మాగాంధీ ఆత్మకథ
2. థింక్ అండ్ గ్రో రిచ్ – నెపోలియన్ హిల్
3. భగవద్గీత

గాంధీజీ తన జీవితాన్ని భగవద్గీత సూత్రాలపై ఆధారపడిన ఒక ప్రయోగశాలగా మార్చుకున్నారు. అందువలన ఈ పుస్తకంలో కొంతవరకు భగవద్గీత సూత్రాలను ప్రస్తావించినప్పటికి ఇది మత గ్రంధం కాదు. అలాగే గాంధీజీ జీవిత చరిత్రలోని ఘట్టాలను సంపూర్ణంగా వివరించటం కూడా ఈ పుస్తకం పరిధిలో లేదు. మరింత లోతైన అధ్యయనం కోసం భగవద్గీతను, గాంధీజీ ఆత్మకథను www.dharmakshetra.info/resources/books లో చదవవచ్చును.

ఈ పుస్తకాన్ని జీవితశాస్త్రం (Science of Life) మరియు జీవనకళ (Art of Living) ల సమ్మేళనంగా వర్ణించవచ్చును. ఈ పుస్తకం యొక్క ధ్యేయం మీ కలలను నిజం చేసుకోవటమెలా, సమస్యలను పరిష్కరించుకోవటమెలా, జీవితాన్ని అర్థవంతం చేసుకోవటమెలా అన్నది వివరించటమే. ఈ పుస్తకం మీ జీవితం గురించే.

ఈ పుస్తకాన్ని కేవలం కాలక్షేపం కోసం చదివి ప్రక్కన పెట్టేయడం వలన ఫలితం ఉండదు. దీనిని నిత్యజీవితంలో మార్గదర్శిగా ఉపయోగిస్తేనే అత్యధిక ఫలితం ఉంటుంది. ఒకవేళ ఇందులోని విషయాలు విడివిడిగా బోధపడనప్పటికి మొత్తం పుస్తకాన్ని అధ్యయనం చేసినప్పుడు ఈ పుస్తకం యొక్క పూర్తి స్వరూపం మీకు అర్థమవుతుంది.

★ ★ ★

# అధ్యాయం - 1
# జీవితం ఒక యుద్ధరంగం



గాంధీజీ 1869 అక్టోబర్ 2న గుజరాతు రాష్ట్రంలోని పోర్‌బందర్ పట్టణంలో జన్మించారు. పాఠశాలలో చదువుకునే రోజుల్లో గాంధీజీ చురుకైన విద్యార్థి కాదు. రాత్రిళ్ళు ఇంటి బయట తిరగడానికి ఆయన భయపడేవారు. దొంగలు, భూతాలు, పాముల గురించి భయపడుతూ నిద్రకు కూడా దూరమయ్యేవారు.

తరువాతి రోజుల్లో న్యాయవాద విద్యను అభ్యసించినప్పటికీ ఒక న్యాయవాదిగా నిలదొక్కుకోవటానికి ఎన్నో ప్రయాసలు పడ్డారు. తన కక్షిదారులకు ఏ విధంగా ఉపయోగపడాలనేది ఆయన పుస్తకపు చదువు నేర్పలేదు. వాదించటానికి కేసులు లేనప్పటికి ప్రతి రోజు న్యాయస్థానానికి వెళ్ళి వ్యాజ్యాలను పరిశీలిస్తూ అనుభవం సంపాదించాలని చూసేవారు. కానీ ఆ ప్రయత్నంలో కూడా విఫలమై తరచూ న్యాయస్థానంలోనే నిద్రపోతూ ఉండేవారు.

ఆయన మొట్టమొదటి వ్యాజ్యం ఒక చిన్న వివాదానికి సంబంధించినది. దానికి సంబంధించి ఏం జరిగిందన్నది గాంధీజీ మాటల్లోనే క్రింద ఇవ్వబడినది.

**“ నేను వృద్ధురాలైన ఒక కక్షిదారు తరపున నిలబడి ప్రతివాది యొక్క సాక్షిని ప్రశ్నించాలి. లేచి నిలబడ్డాను. కానీ నా గుండె పాదాలలోకి కూరుకుని పోయినట్లయింది. నా తల తిరుగుతూ న్యాయస్థానం కూడా గుండ్రంగా తిరుగుతున్నట్లనిపించింది. నేను అడగదలచిన ఏ ప్రశ్నా గుర్తుకు రాలేదు. బహుశా న్యాయమూర్తి మరియు ఇతర న్యాయవాదులు నవ్వుకుని ఉండొచ్చు. కానీ నేను అదేమీ గమనించే పరిస్థితుల్లో లేను.**

**నేను కూర్చుండి పోయి ఆ వ్యాజ్యాన్ని, ఫీజును వేరొక న్యాయవాదికి వదులుకున్నాను. నా కక్షిదారు ఆ వ్యాజ్యం గెలిచిందా, లేదా అన్నది కూడా పట్టించుకోకుండా న్యాయస్థానం నుండి వడివడిగా బయటపడ్డాను. నా గురించి నేనే సిగ్గుపడి మళ్ళీ న్యాయస్థానంలో వాదించే ధైర్యం వచ్చేవరకు ఏ వ్యాజ్యమూ తీసుకోకూడదని నిశ్చయించుకున్నాను.”**

అటువంటి మరికొన్ని ప్రయత్నాల తరువాత గాంధీజీ పూర్తిగా క్రుంగి పోయారు. అటువంటి సమయంలోనే ఆయన జీవితం ఒక మలుపు తిరిగింది. పరిశీలకులు దాన్ని విధివ్రాత అనిగానీ యాధృచ్చికం అనిగానీ అనవచ్చు. ఎన్నో ఏళ్ళ తర్వాత తన జీవితానుభవంతో దానిని గురించి వ్యాఖ్యానిస్తూ గాంధీజీ “ఆ మలుపు కేవలం దైవకృప” అన్నారు.

దక్షిణాఫ్రికాలోని ఒక వ్యాపార సంస్థ నుండి ఒక ఉద్యోగాన్ని గాంధీజీ తన సోదరుని ద్వారా సంపాదించగలిగారు. అది తన చదువుకు, అర్హతలకు సరిపోని, అతి తక్కువ జీతమిచ్చే ఉద్యోగం. అంతకు మించి తన భార్యా బిడ్డలకు దూరంగా పరాయిదేశంలో ఉండవలసిన పరిస్థితి. కానీ తన సోదరుడికి కొంతడబ్బు పంపడంతోబాటు క్రొత్త అనుభవాలు సంపాదించవచ్చనే ఆలోచనతో గాంధీజీ ఈ అవకాశానికి అంగీకరించారు.

సుదీర్ఘమైన సముద్ర ప్రయాణం తర్వాత దక్షిణ ఆఫ్రికా లోని దర్బాన్ ఓడరేవులో దిగిన గాంధీజీ కోసం ఎన్నో సమస్యలు కాచుకొని ఉన్నాయి. తెల్లజాతి యురోపియన్లు (ముఖ్యంగా బ్రిటీష్ మరియు డచ్) దక్షిణ ఆఫ్రికాలో అల్పసంఖ్యాకులైనప్పటికీ అధికసంఖ్యాకులైన ఆఫ్రికా దేశీయులను,

భారతీయులను జంతువులకన్నా హీనంగా పరిగణించేవారు. భారతీయులను 18వ శతాబ్దంలో వలసదారుల తోటల్లో పనిచేయడానికి పిలిపించుకొన్నారు. ఒప్పందంలోని అంశాల ప్రకారం యూరోపియన్ వలసదారుల తోటలో ఐదు సంవత్సరాల పాటు పనిచేసిన తర్వాత భారతీయులకు తమకు ఇష్టమైన ఉద్యోగం కానీ వ్యాపారం కానీ చేసుకునే వీలు ఉండాలి. ఐతే యూరోపియన్లు ఆ ఒప్పందాలని ఉల్లంఘించి భారతీయ వలసదారులను బానిసలుగా మార్చివేసి 'కూలీ' అని 'సామీ' అని హీనంగా పిలిచేవారు.

గాంధీజీ దర్బాన్‌లో ఒక వారం గడిపిన తర్వాత ప్రిటోరియాకు బయలుదేరారు.

దక్షిణాఫ్రికాలోని యూరోపియన్‌లకు మాత్రమే రైలులో మొదటి తరగతి ప్రయాణం చేసే అర్హత ఉండేది. భారతీయులకు కేవలం మూడవ తరగతిలో మాత్రమే ప్రయాణించే అర్హత ఉండేది.

కానీ గాంధీజీ పనిచేసే సంస్థ ఆయన కొరకు మొదటి తరగతి టికెట్ కొని ఉంచింది. గాంధీజీ జీవితాన్ని మలుపు తిప్పిన ఆ సంఘటన గురించి ఆయన మాటల్లో క్రింద ఇవ్వబడింది.

**" రాత్రి 9 గంటలకు రైలు మారిట్జ్‌బర్గ్ చేరుకుంది. ఒక ప్రయాణికుడు రైలులోకి వచ్చి నన్ను పైకీ క్రిందకీ చూశాడు. నేను రంగు తక్కువ మనిషిగా ఉండటం అతనికి రుచించినట్లులేదు. అతను వెళ్ళి ఇద్దరు రైల్వే అధికారులతో తిరిగి వచ్చాడు.**

**ఇంతలో మరొక అధికారి వారికి తోడయి "నాతో రా! నువ్వు మూడవ తరగతికి వెళ్ళాలి" అన్నాడు.**

**" కానీ నా దగ్గర మొదటి తరగతి టికెట్ ఉంది" అన్నాను నేను.**

**"అదంతా అనవసరం, నువ్వు మూడవ తరగతిలో వెళ్ళవలసిందే" అన్నాడు మరియొక అధికారి.**

**"నాకు ఈ తరగతిలో ప్రయాణించటానికి టికెట్ ఉంది కాబట్టి నేను ఇందులోనే ప్రయాణిస్తాను" అని నా ధృఢ నిశ్చయాన్ని చెప్పాను.**

**"అలా కుదరదు! నువ్వు ఈ బోగీ నుండి దిగకపోతే నేను పోలీసులను**

**పిలవవలసి వస్తుంది".**

**"మీరు పోలీసులను పిలవవచ్చు. నేను మాత్రం దిగను".**

**పోలీసు అధికారి వచ్చాడు. నా చేయి పట్టుకుని బోగీ నుండి బయటకు లాగివేసి నా సామాన్లు కూడా ప్లాట్‌ఫారమ్ మీద పడేశాడు. నేను మూడవ తరగతికి వెళ్ళడానికి నిరాకరించాను. రైలు కదలిపోయింది.**

**అది చలికాలం. మారిట్జ్‌బర్గ్ కొండ ప్రాంతాలలో ఉన్నందున చలి మరీ ఎక్కువ. ఆ చలిలో చీకట్లో వణుకుతూ ఉండిపోయాను.**

**తదుపరి ఏం చేయాలన్నది ఆలోచించాను. నా హక్కుల కోసం పోరాడాలా లేక వెంటనే భారతదేశానికి తిరిగి వెళ్ళిపోవాలా? లేక ఈ అవమానాలన్నింటిని దిగమింగుతూ ఉద్యోగకాలం పూర్తయ్యాక వెళ్ళిపోవాలా? నా బాధ్యతను పూర్తి చేయకుండా తిరిగి వెళ్ళిపోవటం పిరికితనం. నేను ఈ రోజు ఎదుర్కొన్న సమస్య ఒక ప్రాణాంతక వ్యాధి యొక్క పై లక్షణం మాత్రమే. ఆ వ్యాధిని పూర్తిగా నిర్మూలించటానికి, అందుకవసరమైన ఎన్ని కష్ట నష్టాలను ఎదుర్కోవటానికయినా నేను సిద్ధపడాలి! "**

కానీ మరిన్ని అవమానాలు గాంధీజీ కోసం సిద్ధంగా ఉన్నాయి. మరునాటి సాయంత్రం ఆయన తన ప్రయాణాన్ని గుర్రపుబగ్గీ ద్వారా కొనసాగించారు. బ్రిటిష్ జాతీయుడైన కండక్టర్ బగ్గీ లోపల ప్రయాణీకులతోపాటు కూర్చోగా అతని స్థానమైన డ్రైవర్ ప్రక్క సీటులో గాంధీజీ కూర్చోవాల్సివచ్చింది. తన ప్రయాణాన్ని ఎలాగైనా కొనసాగించదలచుకున్న గాంధీజీ ఈ అవమానాన్నంతా సహిస్తూ కూర్చున్నారు.

కొంతసేపటి తర్వాత కండక్టరుకు సిగరెట్టు త్రాగాలనిపించడంతో అతడు బగ్గీ వెలుపలికి వచ్చి తాను డ్రైవర్ ప్రక్కన కూర్చుంటానని గాంధీజీని తన కాళ్ళ దగ్గర కూర్చోమని ఆజ్ఞాపించాడు. అందుకు ఆయన నిరాకరించారు. కండక్టర్ ఒళ్ళు తెలియని కోపంతో గాంధీజీని తిడుతూ, పిడిగుద్దులు గుద్దుతూ బగ్గీనుండి త్రోసివేయటానికి ప్రయత్నించాడు. అతని మీద తిరగబడకుండా ఉండటానికి గాంధీజీ తనను తాను అదుపు చేసుకొంటూ క్రిందకు పడిపోకుండా బగ్గీను పట్టుకొని ఉండిపోయారు.

బగ్గీలోని కొందరు సహృదయులైన ప్రయాణికులు కూడా గాంధీజీని సమర్థించడంతో కండక్టర్ వెనక్కి తగ్గాల్సి వచ్చింది. జీవితంలో ఎన్నో ఎదురు


దెబ్బలు తిన్న గాంధీజీ పారిపోవటం మాని వాటిని ఎదిరించి నిలవటం ప్రారంభించారు. వరుసగా వైఫల్యాలను, సమస్యలను ఎదుర్కొంటున్న ఆయన వాటికి పరిష్కారాలను బాహ్య ప్రపంచంలో వెతకటం మాని అంతర్ముఖులై ఆత్మశోధన ప్రారంభించారు.

మన జీవితాలలో కూడా మనం గొప్ప నాయకునిగా ఎదగాలనో, శాస్త్రవేత్తగానో, కళాకారునిగానో, వ్యాపారవేత్తగానో కావాలని కోరుకుంటాము. లేదా ఎన్నో సమస్యలు – పరీక్షలలో తప్పడం, నిరుద్యోగం, వ్యాపారంలోగాని, వైవాహిక జీవితంలో అపజయం వంటివి – ఎదుర్కొనవలసి రావచ్చు. వాటిని సరైన రీతిలో ఎదుర్కోలేక ఎందరో వ్యక్తులు హత్యలు, ఆత్మహత్యలు, లంచాలు వంటి తప్పుడు దారులను ఆశ్రయిస్తుంటారు.

జీవితం అనేది కష్టసుఖాలు, లాభనష్టాలన్నిటి కలయిక. మనం కేవలం గమ్యాన్ని మాత్రమే కాకుండా ప్రయాణమంతటినీ ఆస్వాదించాలి. రాబోయే అధ్యాయాల్లో మనం సమస్యలను ఏవిధంగా ఎదుర్కోవచ్చునేది, కోరుకున్న వాటిని ఏవిధంగా సాధించవచ్చునేది తెలుసుకోవచ్చు.

★ ★ ★

# అధ్యాయం - 2
# ఆలోచనే బీజం



గాంధీజీ కేవలం ఆలోచనాశీలి మాత్రమే కాదు, గొప్ప కార్యవాది కూడా. ప్రతి మనిషి ఆలోచించగలడు. కానీ ఆలోచనల యొక్క నిర్మాణాత్మక శక్తి గురించి తెలిసిన వారే వాటిని తగిన రీతిలో ఉపయోగించి తమ జీవితాలను ఫలవంతం చేసుకోగలరు. ఆ విధంగా సరియైన ఉద్యోగ, వ్యాపారాలను, సరియైన సామాజిక పరిస్థితులను, అనుకూలమైన జీవితాన్ని సాధించుకోవచ్చును. ఆలోచనలకు వాక్కులు గానూ, క్రియలుగానూ మారగల శక్తి ఉండటం వలన మనం వాటి మీద అదుపు సాధించవలసిన అవసరం ఎంతగానో ఉంది.

ఎన్నో ఏళ్ళ తర్వాత ఒక పాశ్చాత్య విలేఖరి గాంధీజీని ఆయన జీవితంలోని గొప్ప నిర్మాణాత్మక సంఘటన ఏమిటని అడిగినప్పుడు ఆయన ఈ విధంగా బదులిచ్చారు.

**" నా జీవితాన్ని మలుపు తిప్పిన సంఘటనలెన్నో ఉన్నప్పటికీ మారిట్జ్‌బర్గ్ రైలు స్టేషన్‌లో జరిగిన సంఘటన అతి ముఖ్యమైనది. ఆ రోజు నేను నా ప్రాణాల గురించే భయపడ్డాను. విశ్రాంతి గదిలో ఉన్న బ్రిటిష్ ప్రయాణీకుడితో మాట్లాడటానికి కూడా భయపడ్డాను. నా కర్తవ్యమేమిటని ఆలోచించసాగాను. భారత దేశానికి తిరిగివెళ్ళిపోవాలా? లేదా దక్షిణాఫ్రికాలోనే ఉండి ఈ జాత్యహంకారాన్ని ఎదుర్కోవాలా? నేను రెండవ నిర్ణయాన్నే ఎన్నుకొన్నాను. నా అహింసా పోరాటం ఆనాటినుండే ఆరంభమయింది."**

గాంధీజీ స్వతంత్ర భారతదేశాన్ని తన జీవితకాలంలోనే సాధించి జాతిపిత కూడా అయ్యారు. అయితే ఆ విజయం ఒక్క రోజులో సంభవించలేదు. తాను ఇతరులతో పాటు సమానుడుగా పరిగణించబడాలన్న దృఢమైన సంకల్పంతో మొదలైన ఆయన విజయ ప్రస్థానం దినదిన ప్రవర్థమానమయింది.

ట్రాన్స్‌వాల్‌లోని భారతీయుల పరిస్థితి నాటాల్ లోని భారతీయుల పరిస్థితి కన్నా దయనీయంగా ఉండేది. వారు ఒక్కొక్కరు మూడు పౌండ్ల పన్ను చెల్లించవలసివచ్చేది. హిందూ సంప్రదాయాల ప్రకారం జరిగిన వారి వివాహాలకు గుర్తింపు ఉండేది కాదు. వారికి ఆస్తి హక్కు, ఓటు హక్కు వంటివి ఉండేవి కావు. రాత్రి తొమ్మిది గంటల తరువాత ఇంటి బయట సంచరించాలంటే వారికి అనుమతి పత్రం కావలసివచ్చేది.

ఒకనాటి సాయంత్రం గాంధీజీ అనుమతి పత్రం వెంట తెచ్చుకొని వ్యాహాళి కెళుతుండగా ఒక పోలీసు ఆయనతో దురుసుగా ప్రవర్తించి రోడ్డు ప్రక్కకు త్రోసివేశాడు. ఇదంతా గమనించిన ఒక బ్రిటిష్ వ్యక్తి గాంధీజీకి సహాయం చేసి ఆ పోలీసుకు వ్యతిరేకంగా పై అధికారులకు ఫిర్యాదు చేస్తే తాను గాంధీజీ తరపు సాక్షిగా ఉంటానని ప్రోత్సహించాడు. గాంధీజీ అందుకు నిరాకరించి తాను ఆ పోలీసును క్షమించి వేశానని చెప్పారు. అయితే ఒక మనిషి తోటి మనిషిని అవమానపరచటం ద్వారా ఎలా తనకు తాను గొప్పగా భావించగలడన్నది ఆయనకు వింతగా ఉండేది.

గాంధీజీ మారిట్జ్‌బర్గ్‌లో రైలు నుండి త్రోసివేయబడ్డ తరువాత తాను సమస్యల నుండి పారిపోవటం వలన ఫలితం లేదని తాను వాటితో తలపడి పోరాడేవరకు అవి తనను పరీక్షిస్తుంటాయని గ్రహించారు. తాను ఎదుర్కొన్న సంఘటన 'జాత్యహంకారం' అనే భయంకరమైన వ్యాధియొక్క పైపై లక్షణం మాత్రమేనని ఆ వ్యాధిని సమూలంగా నిర్మూలించడానికి తాను ఎన్ని కష్ట నష్టాలను ఎదుర్కోవడానికైనా సిద్ధంగా ఉండాలని నిశ్చయించుకొన్నారు.

అయితే ఆయన ఎదురుగా రెండు అడ్డంకులు ఉన్నాయి. ఒకటి, ఆయనకెదురుగా ఉన్నది అతి బలమైన, రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యం. రెండవది, ఆయనతోటి ప్రజలు భాష, కులం, మతం మొదలైన భేదాభిప్రాయాల ద్వారా విడిపోయి పరస్పరం కలహించుకొంటున్నారు. ఆయన ఈ అడ్డంకులను ఏ విధంగా అధిగమించారన్నది తరువాతి అధ్యాయాలలో వివరించబడింది.

మానవులలో తార్కికమైన ఆలోచనలకన్న భావోద్వేగాలతో కూడిన ఆలోచనలు ఎక్కువ ప్రభావం కలిగి ఉంటాయి. కోరిక, ప్రేమ, విశ్వాసం వంటి భావోద్వేగాలతో కూడిన ఆలోచనలు ఆయస్కాంత శక్తిలాగా పని చేసి అటువంటి ఆలోచనలే కలిగిన వ్యక్తుల సాంగత్యాన్ని ఏర్పరుస్తాయి.

ఆ విధంగా ఆయస్కాంతీకరించబడిన ఆలోచనను ఒక విత్తనంతో పోల్చవచ్చును. విత్తనాన్ని సారవంతమైన భూమిలో నాటినప్పుడు అది మొలకెత్తి, పెరిగి అటువంటి ఆలోచనలనే పోలిన మరెన్నో పండ్లను, విత్తనాలను ఇస్తుంది.

విశ్వంలో కోట్లాది సెల్‌ఫోన్ తరంగాలు, టెలివిజన్ తరంగాలు ప్రసారమవుతున్నట్లు మనకు తెలుసు. అదే విధంగా ఈ విశ్వమంతా భయం, ద్వేషం, స్వార్థం వంటి నకారాత్మక (నెగటివ్) ఆలోచనా తరంగాలతోను, ప్రేమ, సంతోషం, శాంతి వంటి సకారాత్మక (పాజిటివ్) ఆలోచనా తరంగాలతోను నిండి ఉంది.

మానవుడు ఎటువంటి ఆలోచనలను ఎక్కువగా చేస్తుంటాడో మనస్సు అదే విధమైన ఆలోచనలను విశ్వం నుండి గ్రహించి మనస్సుపై బలమైన ప్రభావాన్ని చూపేటట్లు చేస్తుంది. ఉప చేతన మనస్సు (సబ్-కాన్షియస్ మైండ్) ఒక రసాయన పరిశోధనశాల వంటిది. దానికి నకారాత్మక లేదా సకారాత్మక ఆలోచనా తరంగాల మధ్య విచక్షణ చూపి ఎంచుకొనే సామర్థ్యం లేదు. సామర్థ్యం చేతన మనస్సు (కాన్షియస్ మైండ్)కు మాత్రమే ఉంది.

భయం ఎంతగా ఉపచేతన మనస్సును ప్రభావితం చేసి ఓడిపోయేటట్లు చేస్తుందో విశ్వాసం అంతగా మనస్సుకు ధైర్యాన్ని కలిగించి విజయాన్ని అందిస్తుంది. ఎటువంటి భావోద్వేగాలు లేని ఆలోచనల కన్నా కోరిక, విశ్వాసం, ప్రేమ వంటి భావోద్వేగాలతో కూడిన ఆలోచనలు మానవుని ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. ఈ భావోద్వేగాలు రాబోయే అధ్యాయాల్లో వివరింపబడతాయి.

★ ★ ★

# అధ్యాయం - 3
# సంకల్ప బలం



ప్రాచీన కాలం నుండి మానవులు పక్షులలాగా ఎగరాలని ఆశ పడేవారు. ఎగిరే యంత్రాన్ని కనుగొనాలని ఆర్విల్ మరియు విల్‌బర్ రైట్ సోదరులు ఎంతో శ్రమించారు. వారు కనుగొన్న విమానాలు ఈనాడు ప్రయాణీకులను దేశవిదేశాలకు చేరవేయటం చూస్తున్నాము.

ప్రతి ఇంటిలోను, ప్రతి కార్యాలయంలోనూ కంప్యూటర్ ఉండాలని బిల్‌గేట్స్ కోరుకున్నాడు. ఈనాడతడి కోరిక నెరవేరుతూ ఎంతోమంది జీవితాలను సుఖవంతం, సుసంపన్నం చేయడం చూస్తున్నాము.

విద్యా, వ్యాపార, కళా, రాజకీయ రంగాల వంటి వేటిలోనైనా విజయం సాధించాలంటే ఆ కోరికను ఒక ధృడమైన సంకల్పంగా మనస్సులో నిలుపుకొని అహర్నిశలు కృషి చేయాలి. మానవులు ధృడ సంకల్పంతో కృషి చేస్తే సాధ్యం కానిదేదీ లేదు.

మన కోరిక పరీక్షలలో ఉత్తీర్ణులై మంచి ఉద్యోగం సంపాదించాలనో, గొప్ప వ్యాపార సంస్థను స్థాపించాలనో, గొప్ప శాస్త్రవేత్త గానో లేక కళాకారుడిగా ఎదగాలనో కావచ్చును. లేదా మనం ఎదుర్కొంటున్న జీవిత సమస్యలు పరిష్కరించుకోవటం కావచ్చును. మన కోరిక ధర్మబద్ధమైనదిగా ఉండి అందరి సుఖసంతోషాల కోసమై ఉండాలి. అలాకాక కేవలం ఒక్కరి సంతోషం కోసం మిగిలిన వారి బాధలకు కారణమయ్యే కోరికలు తాత్కాలికంగా నెరవేరినా అవి దీర్ఘకాలంలో నష్టాన్ని కలిగిస్తాయి.

సంకల్పం విజయవంతం కావాలంటే క్రింద పేర్కొన్న విధానాన్ని పాటించాలి:

1. మన లక్ష్యమేమిటో స్పష్టంగా వ్రాసుకోవాలి.
2. లక్ష్య సాధనకు చెల్లించగల మూల్యాన్ని (ధనం రూపేణా లేదా సమయం రూపేణా) నిశ్చయించుకోవాలి.
3. లక్ష్య సాధనకు ఒక నిర్దిష్ట గడువు (ఉదా: ఆరు నెలలు లేదా డిశంబర్ 31) ను నిర్ధేశించుకోవాలి.
4. లక్ష్య సాధనకు ఒక ప్రణాళికను రూపొందించుకొని వెంటనే కార్యాచరణలోకి దిగాలి.
5. లక్ష్యాన్ని ప్రతిరోజు, ప్రతి క్షణమూ మననం చేసుకొంటుండాలి. ఆశావాదం కలిగిఉండి లక్ష్యసాధనలో విజయవంతులమవుతున్నట్లు ఊహించుకోవాలి.

ప్రపంచంలో విజేతలైన ఎందరో వ్యక్తులు అవలంభించిన విధానాల సారమిది.

హెన్రీ ఫోర్డ్ సామాన్య ప్రజలకు కూడా అందుబాటులో ఉండే కారును తయారు చేయాలని కోరుకొని అసెంబ్లీ లైన్ విధానం ద్వారా విజయం సాధించాడు. అబ్రహాం లింకన్ ఎన్నో వైఫల్యాల తరువాత అమెరికాకు అధ్యక్షుడై నల్ల జాతి బానిసల విముక్తికోసం సివిల్ వార్ (అంతర్యుద్ధాన్ని) ఎదుర్కొని విజయం సాధించాడు. ధీరుబాయి అంబాని పెట్రోల్ బంకులో చిన్న ఉద్యోగిగా జీవితాన్ని ప్రారంభించి ఎందరికో జీవనోపాధిని కల్పిస్తున్న వ్యాపార సామ్రాజాన్ని స్థాపించాడు.

కొందరు వ్యక్తులు తమ జీవితంలో విజయం సాధించేముందు ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రఖ్యాత ఆంగ్ల రచయితలు చార్లెస్ డికెన్స్, ఓ హెన్రీ వంటివారు తమ జీవితాలలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ఆ అనుభవాలతో రచనలు చేసి ప్రసిద్ధులయ్యారు.

హెలెన్ కెల్లర్ అంధత్వం, మూగ, చెవిటి అంగవైకల్యంతో జన్మించినప్పటికి గొప్ప రచయిత్రిగా, అధ్యాపకురాలిగా, రాజకీయ వేత్తగా ప్రసిద్ది చెందారు. బీతోవెన్ చెవిటి వాడైనప్పటికి ప్రపంచం మెచ్చిన సంగీతాన్ని అందించారు. జాన్ మిల్టన్ అంధుడైనప్పటికి 'ప్యారడైజ్ లాస్ట్' వంటి గొప్ప కావ్యాలు వ్రాసి ప్రపంచాన్ని మెప్పించారు.

అతి సాధారణ జీవితం గడిపిన ఎందరో వ్యక్తులు కూడా గొప్ప విజయాలను సాధించారు. ఒక మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చిన అబ్దుల్ కలాం గొప్ప శాస్త్రవేత్తగానూ, భారత రాష్ట్రపతిగాను ఎదిగారు. టీ దుకాణంలో పనిచేసిన నరేంద్ర మోది భారత ప్రధాన మంత్రి అయ్యారు.

హృదయం కోరుకొన్న ప్రగాఢమైన, ధర్మబద్ధమైన ప్రతి కోరికా తప్పక నెరవేరుతుందని గాంధీజీ చెప్పేవారు.

★ ★ ★

# అధ్యాయం - 4
# విశ్వాసం కొండల్ని కూడా కదిలించగలదు



ఈ అనంత విశ్వంలో పాలపుంతలు, నక్షత్రాలు, గ్రహాలు, ఉపగ్రహాలు తమ తమ కక్ష్యలలో కోట్లాది సంవత్సరాలుగా పరిభ్రమించడం ఏ శక్తి వలన సాధ్యపడుతున్నది? మన జనన మరణాలను ఏ శక్తి శాసిస్తున్నది?

ఈ జగత్తు యొక్క సృష్టి, స్థితి లయలకు కారణమైన అతీంద్రియ శక్తి ఒకటి ఉందని అనాదిగా మానవులు నమ్ముతున్నారు. ఈ శక్తిని విశ్వమంతా వ్యాపించి ఉన్న చేతనా శక్తి అని కానీ, లేదా సాధారణ భాషలో భగవంతుడు అని కానీ వ్యవహరించవచ్చు.

**"ఈ విశ్వమంతటిలోను ఒక అనిర్వచనీయమైన అతీంద్రియ శక్తి వ్యక్తమయిఉంది. నేను దానిని కళ్ళారా చూడలేకపోయినా దాని ఉనికి నాకు తెలుస్తూఉంది. పంచేంద్రియాలకు గ్రాహ్యంకాని ఆ శక్తిని శాస్త్రపరంగా నిరూపించడం అసాధ్యం. కానీ మన పరిమిత జ్ఞానంతో భగవంతుని ఉనికిని తర్కం ద్వారా నిరూపించవచ్చును.**

**గత సంవత్సరం నేను మైసూరులో పర్యటించినప్పుడు అక్కడి గ్రామీణులతో సంభాషించాను. వారిలో చాలా మంది మైసూరు రాజ్యాన్ని ఎవరు పరిపాలిస్తున్నారో తమకు తెలియదని బహుశా ఎవరో ఒక దేవుడు పరిపాలిస్తుండవచ్చని తెలిపారు. తమ పరిపాలకుని గురించి వారి జ్ఞానం అంత పరిమితమైనప్పుడు నా పరిపాలకుని గురించి నాకు కూడా ఎక్కువ తెలుసు అనుకోను. అయినప్పటికి మైసూరు గ్రామీణులలాగా నేను కూడా ఈ విశ్వమంతటా ఒక క్రమపద్ధతిలో కొనసాగుతున్నదని దానిని నడిపే ఒక ధర్మసూత్రం ఉన్నదని విశ్వసిస్తున్నాను. నా దృష్టిలో ఆ ధర్మసూత్రమే దైవం. ఆ ధర్మసూత్రానికి కట్టుబడి జీవితాన్ని గడపటమే మన బాధ్యత" – గాంధీజీ**

విశ్వాసమంటే ఎదురు ప్రశ్నించకూడనటువంటి మూఢనమ్మకం కాదు. గురువులు "మీరు ముందు మమ్ములను నమ్మి వింటే మీరు విన్నది తరువాత మీకే అర్థమవుతుంది" అని బోధిస్తారు.

గాంధీజీ జీవితంలో విశ్వాసం యొక్క శక్తిని ఒకసారి పరిశీలిస్తే ఆయనకు ఆయుధాలు, సైన్యం, కోటలు వంటివేమీ లేకపోయినా తన సమకాలీనులందరిలోను ఆయన గొప్ప శక్తిమంతులు. లక్షలాది మనుష్యులు ఒక్క హృదయంతో స్పందించి పనిచేసే విధంగా ఆయన వారిని ప్రభావితం చేశారు.

గాంధీజీ దృష్టిలో విశ్వాసం అనేది తర్క రహితమైనది ఎంత మాత్రమూ కాదు. నిజానికి ఎక్కడైతే తర్కం యొక్క పాత్ర అంతమై మనం ఇక ముందుకు కొనసాగలేమో అక్కడి నుండి విశ్వాసం యొక్క పాత్ర ప్రారంభమౌతుంది. "తర్కం మనను కొంతవరకే ముందుకు నడిపించగలదు. ఆ తరువాత నుండి దైవంపై విశ్వాసంతో ముందుకు సాగవలసిందే" అని గాంధీజీ చెప్పేవారు.

అత్యధిక శాతం ప్రజలు తమ ప్రయత్నాలన్నీ విఫలమైన తరువాత భగవంతుని ప్రార్థిస్తారు. వారి హృదయం భయం, అవిశ్వాసం మొదలైన నెగటివ్ భావోద్వేగాలతో కూడుకున్నందున అవే భగవంతుని చేరతాయి. లేదా వారు భగవంతుని కదిలించనటువంటి భావ రహితమైన పూజలు చేస్తారు.

మన ఆలోచనలకు బలం చేకూర్చే దివ్య ఔషధం విశ్వాసం. ప్రార్థనను విశ్వాసంతో మేళవించినప్పుడు అది దైవాన్ని చేరే మూలకంగా పనిచేస్తుంది. విజ్ఞాన శాస్త్రం వివరించలేని అన్ని అద్భుతాలకు, మిస్టరీలకు ఆధారం విశ్వాసం.

విశ్వాసాన్ని ఏవిధంగా పెంచుకోవాలి ? అనే ప్రశ్న మనకు కలగవచ్చును.

విశ్వాసం అంటే ప్రార్థన ద్వారా పెంపొందించుకో గల ఒక మానసిక స్థితి.

కాని భగవంతుడు మన ప్రార్థనలను మన్నించి కోరికలను నెరవేర్చటం జరుగుతుందా? తార్కికంగా ఆలోచించే వారికి అది హేతుబద్ధంగా అనిపించదు. అదే నిజమయితే భగవంతుడు ప్రార్థనలు చేసే వారి పట్ల పక్షపాతం చూపినట్లే. కాబట్టి ప్రార్థనకు వేరే లోతయిన అర్థం ఉండాలి.

గాంధీజీ ఒకసారి ఇలా తార్కికంగా ప్రశ్నించారు. "మనం ప్రార్థించడం దేనికి? భగవంతుడంటూ ఒకడుంటే మనకు ఏమి కావాలన్నది ఆయనకు తెలియదా? మనం ప్రార్థిస్తేనే ఆయన కరుణిస్తాడా? అలా అనుకోవటం హేతుబద్దంగా అనిపించడం లేదు. మన అందరిలోను ఉన్న భగవంతుడికి మనం ఏమి తెలియచేయాల్సింది లేదు. ప్రార్థన అనేది మన హృదయాన్ని పరిశోధించుకోవటం కోసం మరియు పరిశుద్ధం చేసుకోవటం కోసమే. ప్రార్థన అనేది మన పరిమితులను గుర్తు చేసి అణకువ నేర్పడానికే!"

భగవంతుడు సోమరిపోతుల కోరికలు తీర్చడని మనం అనుకోవాలి. ఎవరైతే తమ ప్రార్థనలకు స్వప్రయత్నం జోడిస్తారో, వారినే ప్రేమ స్వరూపుడైన భగవంతుడు కరుణించటం జరుగుతుంది. భగవంతుని విశ్వసించడం వలన మనకు కష్టాలను తట్టుకునే స్థైర్యం రావడంతోపాటు అహంకారం పెరిగి తప్పటడుగు వేయకుండా ఉపకరిస్తుంది.

ఒకానొక సహచరుడు గాంధీజీని ఇలా ప్రశ్నించాడు.  దైవప్రార్థన చెయ్యమని మీరు చెపుతూ ఉంటారు. అయితే ఏ దేవుని ప్రార్థించాలి? ఏ విధంగా ప్రార్థించాలి ?

గాంధీజీ ఇలా బదులిచ్చారు.

**"దేవుని ప్రార్థించడమంటే ఆయన మహిమను ప్రశంసించడమే. ఆయనకు అనంతమైన నామధేయాలు ఉన్నాయి. నిజానికి ఆయన నామ రూప రహితుడు. మన అభిరుచులమేరకు మనం ఏ పేరుతోనైనా భగవంతుని సంబోధించవచ్చును. భక్తులు ఆయనను రాముడనో, కృష్ణుడనో, అల్లా అనో లేక యెహోవా అనో వ్యవహరిస్తారు. అయితే అందరూ ఆరాధించేది ఒకే భగవంతుడినే! సర్వాంతర్యామి, సర్వజ్ఞుడు, సర్వ శక్తి సంపన్నుడు అయిన ఆయన మన పరిణతి**

మేరకు, అభిరుచుల మేరకు తదనుగుణంగా వ్యక్తమవుతూ ఉంటాడు.

ప్రార్థన లేదా ఆరాధన అనేది హృదయంతో చేసేదే కాని పెదవులతో చేసేది కాదు. అందువల్లనే మూగవారు, నిరక్షరాస్యులు కూడా భగవంతుని ప్రార్థించగలరు. ఎవరి హృదయాల్లో విషమూ, పెదవులపైన తేనె ఉంటుందో వారి ప్రార్థనలకు అర్థమే లేదు. ప్రార్థనకు హృదయశుద్ధి ఎంతో ముఖ్యం.రాముడు హనుమంతుడి పెదవులపైన మాత్రమే కాదు హృదయంలో కూడా ఉన్నాడు. ఆయన మహిమతోనే హనుమంతుడు పర్వతాన్ని మోయగలిగాడు, సముద్రాన్ని దాటగలిగాడు.

అదే విధంగా భగవంతునియందు అచంచల విశ్వాసంతోనే మనం జీవితంలోని ఆటుపోట్లను ఎదుర్కోగలం. అటువంటి విశ్వాసాన్ని కలిగినవాడు జీవితంలో పొందదగినది ఏదీ లేదు. ఒకవేళ అతడు భౌతికంగా కృశించినప్పటికి మానసికంగా, ఆధ్యాత్మికంగా ఎప్పుడూ సుఖ సంతోషాలతో ఓలలాడుతుంటాడు.

అంటరానివారుగా వెలివేయబడినవారిని తమ సోదరులుగా ఆదరించి సేవించే హిందువులే నిజంగా భగవంతుని ప్రార్థిస్తున్నట్లు. విదేశీ వస్త్రాలను బహిష్కరించి దేశవాళి చేనేత కార్మికులను ఆదుకునే హిందువులే నిజంగా ప్రార్థిస్తున్నట్లు."

భక్తియోగం అధ్యాయంలో వివరింపబడిన ప్రేమకు విశ్వాసానికి ఎంతో భావస్వారుప్యం ఉంది. కోరికను ప్రేమ, విశ్వాసం రెండింటితోను మేళవించినప్పుడు అది ఎంతో బలీయమైనదిగా మారి విజయాన్ని అందిస్తుంది.

## ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవటానికి కొన్ని మార్గాలు :

1. ఆత్మ విశ్వాసం లోపించిన వాళ్ళు అందరి దృష్టిలో పడకూడదనే ఉద్దేశ్యంతో సభలు, సమావేశాలు, తరగతి గదుల్లో వెనుక వరుసల్లో కూర్చుంటారు. అలా కాకుండా ముందుగా వెళ్ళి ముందు వరుసల్లో కూర్చోవటం అలవాటు చేసుకోవాలి.
2. సభలు, సమావేశాలకెళ్ళినప్పుడు కొత్తవాళ్ళతో మాట్లాడటం, కొందరితోనైనా పరిచయం పెంచుకోవటం చెయ్యాలి. విజిటింగ్ కార్డులను ఎప్పుడూ సిద్ధంగా ఉంచుకొని క్రొత్త పరిచయస్తులకివ్వాలి.

3. ఇతరులతో కరచాలనం చేసినప్పుడు చేతులు వదులుగా వదలడం కానీ, మరీ గట్టిగా బిగించటం కానీ చేయకూడదు. తగినంత బలాన్ని ఉపయోగించి చేతులు కలపాలి. ఎక్కువ మందితో ఒకేసారి అభివాదం చేయవలసివచ్చినప్పుడు సంప్రదాయ పద్ధతిలో చిరునవ్వుతో నమస్కారం చేయటం అలవరచుకోవాలి.
4. ఎదుట వ్యక్తి కళ్ళలోకి చూసి మాట్లాడటం అలవాటు చేసుకోవాలి. నేరుగా కళ్ళల్లోకి చూడలేకపోవటం తప్పు చేశానన్న భావననూ, ఎదుటి వారికన్నా తక్కువ స్థాయి వ్యక్తినన్న భావననూ వ్యక్తపరుస్తుంది.
5. తలవంచుకునో, భుజాలు కుదించి, కాళ్ళీడ్చుకుంటూనో నడవటం ఆత్మ విశ్వాసం లేకపోవటాన్ని తెలియజేస్తుంది. దానికి బదులుగా తలెత్తి, భుజాలు నిటారుగా ఉంచి వేగంగా నడవటం అలవాటు చేసుకోవాలి.
6. స్పష్టంగా, నిదానంగా ఎదుటి వారికి అర్థమయ్యేటట్లు మాట్లాడాలి. అజ్ఞానిలా కనిపిస్తానేమో అనే అనుమానంతో మౌనంగా ఉండే బదులు మాట్లాడుతున్న కొద్దీ ఆత్మ విశ్వాసం పెరుగుతుంది.
7. మనస్ఫూర్తిగా చిరునవ్వు నవ్వటం అలవాటు చేసుకోవాలి.

గత అధ్యాయంలో ఆలోచన సాకారం కావాలంటే అది కోరికగా భావోద్వేగం రూపంలో ఉండాలని తెలుసుకున్నాము. ఈ అధ్యాయంలో ముఖ్య విషయం ఏమిటంటే కోరికను విశ్వాసంతో జతపరచాలి. మీ కోరికలు నెరవేరుతాయని, లక్ష్యాలను సాధించగలరని మిమ్మల్ని మీరు విశ్వసించండి. భగవంతుని విశ్వసించండి.

★ ★ ★

## అధ్యాయం - 5

# జ్ఞానయోగం : విజ్ఞానాన్ని సరియైన రీతిలో ఉపయోగించడం



'స్వీయ లోపంబుల నెరగుటయే పెద్ద విద్య' అని పెద్దలమాట. విద్య యొక్క ముఖ్య ప్రయోజనం మనిషికి తన లోపాలను తెలియజేసి సమస్యలను ఎదుర్కొనే విధానాన్ని తెలియచేయాలి. పరీక్షలలో గాని, వృత్తి, ఉద్యోగ, వ్యాపార రంగాలలో గాని, విజయం సాధించాలంటే సమస్యలను పరిష్కరించగలగడం (Analytical Skills) భావవ్యక్తీకరణ (Communication Skills) ఈ రెండూ ఎంతో ముఖ్యం. ఈ విషయం అర్థం కాకనే పెద్ద చదువులు చదివిన వారెందరో జీవితంలో అభివృద్ధి చెందక కష్టపడుతున్నారు. విద్యార్థి దశలోనూ, అనంతరమూ జ్ఞానాన్ని సంపాదించటం ఎంత ముఖ్యమో దానిని సరైన విధంగా ఉపయోగించుకోవటం కూడా అంతే ముఖ్యం.

అనాది కాలం నుండి ఎందరో మానవులు చెట్లనుండి పండ్లు రాలి క్రింద పడటం చూస్తునే ఉన్నారు. కానీ న్యూటన్ మాత్రమే దానిని గురించి తార్కికంగా ఆలోచించి గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని కనుగొన్నాడు. అదే విధంగా మనం కూడా పెద్దదైన మఱ్ఱిచెట్టు చిన్న కాయలను, సన్నని తీగ జాతికి చెందిన గుమ్మడి పెద్ద కాయలను కాయటం చూస్తుంటాము. మఱ్ఱిచెట్టు నీడను ఆశ్రయించిన బాటసారులు మాత్రమే వాటికి చిన్న కాయలు ఉండటంలో భగవంతుని సృష్టిలీలను అర్థం చేసుకోగలరు.

నిప్పును గురించి కని, విని ఎరుగని మానవుడిని అజ్ఞాని అని చెప్పవచ్చును. నిప్పును ఎన్నడూ చూడనప్పటికీ దాని స్వాభావిక లక్షణాలగురించి అధ్యయనం చేసిన వాడు విజ్ఞాని (పండితుడు) అని చెప్పవచ్చును. నిప్పును పుట్టించి ఆర్పగలగటం, దానితో తన అవసరాలను తీర్చుకోగలవారిని జ్ఞానులు అని చెప్పవచ్చును. అదే విధంగా మనం వ్యాపార రంగంలో విజయం సాధించాలంటే వినియోగదారులకు ఎలా నాణ్యమైన సరకులను, సేవలను తక్కువ ధరకు అందించగలమన్నది తెలిసి ఉండాలి. కళా రంగంలో విజయం సాధించాలంటే ప్రేక్షకులను, శ్రోతలను రంజింప చేయగలగాలి.

గాంధీజీ స్వాతంత్ర్య ఉద్యమంలో అడుగిడే నాటికి మరెందరో నాయకులు స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే ఉన్నారు. కానీ ఆయన తన విధానాలతో ఒక క్రొత్త శైలిని ప్రవేశపెట్టారు. అప్పటివరకు రాజకీయాలు కేవలం ఉన్నత తరగతికే పరిమితమై మధ్య తరగతి, సాధారణ ప్రజానీకం వాటికి దూరంగా

ఉండేవారు. గాంధీజీ తన యూరోపియన్ దుస్తులను వదిలి సాధారణ భారతీయ వేషధారణలతో ప్రజలకు దగ్గరయ్యారు. వారికి అర్థం అయ్యే భాషలో సరళంగా మాట్లాడేవారు.

గాంధీజీ తాను చదివిన భగవద్గీత, మరింకెన్నో ఆధ్యాత్మిక గ్రంధాలలోని జ్ఞానాన్ని స్వాతంత్ర్య పోరాటానికి అన్వయించగలిగారు. భారతీయుల పతనానికి ముఖ్య కారణం వారు తమ ధర్మాన్ని అనుసరించక పోవటమే అని ఆయన గ్రహించగలిగారు.

'ధర్మం', 'కర్మ', 'జన్మ' – ఈ పదాలను, వాటి సంబంధాన్ని అర్థం చేసుకొంటే ఋషులు బోధించిన సనాతన ధర్మాన్ని చాలా వరకు అర్థం చేసుకున్నట్లే.

స్థూలంగా చెప్పాలంటే ధర్మానికి అర్థం 'ఒక పదార్థం యొక్క స్వభావం'. ఉదాహరణకు నిప్పు యొక్క ధర్మం వేడిని, వెలుగును ఇవ్వడం. చక్కెర యొక్క ధర్మం తీయగా వుండడం. మానవునికి జన్మతః వచ్చిన మానవత్వమే అతని ధర్మం.

సూక్ష్మంగా చెప్పాలంటే ఈ సృష్టిలోని పదార్థాలన్నిటి మధ్యగల విడదీయలేని సంబంధమే ధర్మం. దానికి కారణమేమిటంటే 'ధ్యానయోగం' అధ్యాయంలో వివరించినట్లు ఈ జగత్తు అంతా అవిభాజ్యమైన ఏక స్వరూపం. ఒక నీటి బుడగను ఒక వైపు నొక్కితే ఆ ఒత్తిడి అంతటా ఫలితం చూపించి బుడగ పేలిపోయినట్లే సంఘంలో ఒక చోట అధర్మం ప్రబలినప్పుడు అది మొత్తం సంఘాన్ని క్రుంగ దీస్తుంది. ఎప్పుడైతే ద్వేషం, స్వార్థం, కుటిలత్వం వంటి దుర్గుణాల ద్వారా మనిషిలోని మానవత్వం మరుగున పడుతుందో అప్పుడు ఆధర్మం ప్రబలి సంఘం పతనం అవుతుంది.

రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో జాత్యహంకారి అయిన అడాల్ఫ్ హిట్లర్ నాయకత్వంలో ఉన్నతాధికారులు, సైనికులు మతవివక్షతో నిర్దోషులు, నిరాయుధులైన అరవై లక్షల మంది యూదుపౌరులను దారుణంగా హింసించి హత్య చేశారు. యుద్ధం ముగిసిన తరువాత బంధించబడిన నాజీ సైనికుల యుద్ధ నేరాలపై న్యూరెంబర్గ్ నగరంలో విచారణ జరిగింది. నాజీ సైనికులు తమ పై అధికారుల ఆజ్ఞలను పాటించడమే తమ కర్తవ్యం కనుక తాము హత్య చేసినప్పటికి అది నేరం కాదని వాదించారు.

అయితే న్యాయమూర్తులు తమ తీర్పులో "ఒక సైనికుడి ప్రాధమిక కర్తవ్యం దేశపౌరులను రక్షించడమే, వారిని చంపమని ఉన్నతాధికారులు అజ్ఞాపించినప్పుడు సైనికుడు వాటిని పాటించకుండా పౌరులను కాపాడటానికి పోరాడాలి" అని తెలియ చేశారు. A soldier is supposed to fight for those, who cannot fight for themselves. పౌరులకు రక్షణ కల్పించడమే సైనికుని ధర్మం.

' క్రియతే అనేన ఇతి కర్మః ' అనే సూక్తి ప్రకారం చేయబడేది ఏదైనా కర్మయే. కర్మ సిద్ధాంతం ప్రకారం ప్రతి కార్యం లేదా సంఘటన మరియొక కార్యంలేదా సంఘటనకు ఫలితం మరియు కారణం కూడా అవుతుంది. సరళంగా చెప్పాలంటే ఈ రోజు గడచిన రోజుకు ఫలితమై, మరుసటి రోజుకు కారణమవుతుంది (Today is yesterday's effect and tomorrow's cause). ఉదాహరణకు ఒక వ్యక్తి ఈ రోజు నేరం చేశాడనుకుంటే అది నిన్నటి అజ్ఞానానికి ఫలితమై రేపటి శిక్షకు కారణమవుతుంది.

' ధర్మో రక్షతి రక్షితః' అనే సూక్తి ప్రకారం మనం ధర్మాన్ని కాపాడితే అది మనల్ని కాపాడుతుంది. కర్మ సిద్ధాంతంను ఒక విధి నియమంగా పరిగణించవచ్చును. మనం ధర్మాచరణతో జీవించే విధంగా నిర్ధేశించి, ఒక వేళ ధర్మం తప్పి ప్రవర్తిస్తే దానికి అనుగుణమైన ఫలితం పొందే విధంగా ఈ విధి నియమం పనిచేస్తుంది.

ఆ విధంగా చూసినపుడు ఈ జీవితాన్ని ఒక పాఠశాలగా పరిగణించవచ్చు. మనం జీవిత పాఠాలు నేర్చుకుంటూ, కాల పరీక్షలలో ఉత్తీర్ణులై జీవిత పరమార్థమైన మోక్షాన్ని పొందవచ్చును. లేదా కర్మ క్షయమయ్యే వరకు మళ్ళీ మళ్ళీ అదే తరగతిలో కూర్చోవలసి రావచ్చును. అదే పునర్జన్మకు ఆధారం. పుణ్యనదీ స్నానాల వల్లనో, జంతు బలులు, యజ్ఞయాగాది క్రతువుల వల్లనో చెడు కర్మల ఫలం నశించదు.

కొందరు సౌందర్యవంతులుగా, ఆరోగ్యవంతులుగా, ధనవంతులుగా, విద్యావంతులుగా, సంపన్న దేశాలలో పుట్టడానికి, మరి కొందరు కురూపులుగా, రోగగ్రస్తులుగా, బీదవారుగా, మందమతులుగా, అంతర్యుద్ధాలు ఆకలి చావులు సంభవించే దేశాలలో పుట్టడానికి కారణమేమిటి ? ఇలా అసమానతలతో సృష్టించే భగవంతుడు ధర్మమూర్తి, సమవర్తి అని చెప్పగలమా? కాబట్టి మనం చేసిన

మంచి కర్మల, చెడు కర్మల ఫలితాన్ని అనుభవించడానికి మళ్ళీ మళ్ళీ అందుకు తగిన పరిస్థితులలో జన్మిస్తామని భావించటం హేతుబద్ధంగా ఉంటుంది.


కర్మ క్రింద పేర్కొనబడిన మూడు విభాగాలుగా ఉంటుంది

1. సంచిత కర్మ : ఇది ఎన్నో జన్మలుగా పేరుకొనిపోయినప్పటికి ఇంకా పరిపక్వం కాని విభాగం.
2. ప్రారబ్ధ కర్మ : సంచిత కర్మలో పరిపక్వత చెంది ఈ జన్మలో ఫలాలను ఇవ్వటానికి సిద్ధంగా ఉన్న విభాగం.
3. ఆగామి (క్రియమాన లేదా వర్తమాన) కర్మ : ఇవి వర్తమాన కాలంలో మనం చేస్తున్న నూతన కర్మలు. ఇవి కాలక్రమంలో సంచిత కర్మలుగా మారి తదుపరి మనం అనుభవించవలసిన ప్రారబ్ధ కర్మలుగా మారతాయి.

మరో కోణం నుండి ఆలోచిస్తే మన జీవితంలో జరిగే వివిధ సంఘటనలు ఎందుకలా జరుగుతాయనే దానికి క్రింది మూడు వివరణలు ఇవ్వవచ్చును.

1. ప్రతి సంఘటన ఎటువంటి కారణమూ, హేతువూ లేకుండా కాకతాళీయంగానో లేక యాదృచ్చికంగా జరుగుతుంది.
2. మన కంటికి కనిపించకుండా ఆకాశంలో ఉండే ఒకానొక దేవుని ఇష్టాయిష్టాలబట్టి ప్రతి సంఘటన జరుగుతుంది.
3. ఈ విశ్వమూ, సృష్టి పరిణామక్రమమూ, మన జీవితంలో జరిగే సంఘటనలన్నీ తిరుగులేని, గతితప్పని ధర్మసూత్రాల ఆధారంగా జరుగుతాయి.

పై మూడు సిద్ధాంతాలను క్రింది జాతీయ పతాకం సహాయంతో వివరించవచ్చును.

| | |
|---|---|
|  | సత్యం లేదా ఒక చైతన్యశక్తి ఈ సృష్టిలోని పదార్థాలన్నీ తమ తమ ధర్మాలను పాటించేటట్లు తమ మధ్య సమతూకం (బ్యాలెన్స్) పాటించేటట్లు పరిపాలిస్తుంది. |
| | ధర్మచక్రం ఆధారంగా మన జీవితాలను గతకాలంలోని సంచితకర్మలు, వర్తమాన కాలంలో పరిపక్వమైన ప్రారబ్ధకర్మలు, భవిష్యత్తులో ప్రభావం చూపే ఆగామికర్మలు నిర్దేశిస్తాయి. |
| | కాకతాళీయంగా సంభవించే జీవితం (లేదా) భగవంతునిచే ముందే నిర్ణయించబడిన జీవితం (లేదా) భగవంతుని ప్రమేయం లేకుండా మన చిత్తానుసారం సాగించే జీవితం. |

కేవలం ఆకుపచ్చ రంగును మాత్రమే చూస్తే జీవితంలో అంతా కాకతాళీయంగా లేక దైవ ప్రమేయం లేకుండా అంతా స్వేచ్ఛా చిత్తం (Freewill) ప్రకారం జరుగుతుందని అనిపిస్తుంది. అటువంటి స్థితి ప్రకృతి సహజాతాల (నేచురల్ ఇన్స్టింక్ట్స్)ను అనుసరించే జీవరాశుల విషయంలో సరియైనది. కానీ యుక్తాయుక్త విచక్షణ కలిగిన మానవ జాతికి ఇది వర్తించదు.

ఆకుపచ్చ రంగుపైన ఉండే ధర్మచక్రాన్ని చూస్తే జీవితం గత కర్మల మరియు ప్రస్తుత కర్మల ఫలితం అని చెప్పవచ్చు. మనం ఎటువంటి కుటుంబంలో, పరిస్థితులలో జన్మిస్తామనేది, ఎటువంటి జీవితం గడుపుతున్నామనేది గత కర్మలపై ఆధారపడి విధి వ్రాతగా మారుతుంది. అయితే మన భవిష్యత్తు ఏ విధంగా ఉండాలో అందుకు తగిన కర్మలను వర్తమానంలో చేసే స్వేచ్ఛా చిత్తం మనకు ఉంది. గత కర్మలు, ప్రస్తుత కర్మలు ఎటువంటివనేది నిర్ణయించుకొని మంచి భవిష్యత్తును నిర్మించుకోవచ్చును. మన మనస్సుపై పూర్వ సంస్కారాల ప్రభావం ఎంత బలీయంగా ఉందనే దాన్ని బట్టి మన స్వేచ్ఛా చిత్తం మరియు ఎన్నుకునే కర్మలు ఆధారపడి ఉంటాయి. చెడు కర్మలను మాని మంచి కర్మలను చేస్తూ, వాటిని కూడా నిష్కామంగా ఆచరిస్తూ పునర్జన్మ లేకుండా చేసుకోగల అవకాశం స్వేచ్ఛా చిత్తం ద్వారా మనకు ఉంది. ధర్మాచరణకు, కర్మ ఫలం వలన వచ్చే జనన మరణ చక్రానికి ధర్మచక్రం చిహ్నం. ఈ దశలో మానవునికి తన జీవితానికి తానే విధాత అనిపిస్తుంది. అయితే అది కూడా పరిమిత జ్ఞానమే.

ధర్మ చక్రం పైన ఉండే కాషాయం రంగును చూస్తే ధర్మ సంస్థాపన కోసం, సృష్టి, స్థితి, లయల కోసం భగవంతుడు రచించే దివ్య ప్రణాళిక (divine plan) కు కానీ దైవలీల (divine play) కు గానీ లోబడి మన జీవితమూ, స్వేచ్ఛా చిత్తం ఉంటుందని తెలుస్తుంది.

మన జాతీయ గీతం అయిన 'జన గణ మన....' జనుల మనోనాయకుడు, భారత భాగ్యవిధాత అయిన చైతన్య శక్తికే జయ జయ ధ్వానాలు పలుకుతున్నది.

గాంధీజీ దక్షిణ ఆఫ్రికాకు వెళ్ళే అవకాశం దివ్య ప్రణాళికలో భాగంగానూ, జాతి వివక్షతకుగురై రైలు నుండి త్రోసి వేయబడటం భారతీయుల ప్రారబ్ధ కర్మ గానూ, దానికి ఆయన ప్రతిస్పందించి ఎదుర్కొన్న తీరు స్వేచ్ఛా చిత్తం గానూ పరిగణించవచ్చును.

అయితే భగవంతుని ప్రణాళికలు, లీలలు ఎలా ఉంటాయన్నది మనకు తెలియదు. కాబట్టి అంతా దైవేచ్ఛ అని పలాయన వాదం పఠించకుండా మంచి కర్మలు చేయవలసిందే.

కర్మ సిద్ధాంతం ఎంతో ముఖ్యమైనప్పటికీ ఎన్నో అపార్థాలకు కూడా కారణమయింది. ఇతరులు తమ కర్మానుసారం కష్టాలను అనుభవిస్తుంటే మనం వాటిని తొలగించకూడదని కొందరు వాదించవచ్చు. అయితే అలా భావించడం వలన మనం మనలోని ప్రేమ, దయ, నిస్వార్థం వంటి మంచి గుణాలను అణచివేసినట్లే. అదీగాక ఇతరుల కష్టాలను తొలగించడం వలన మనం గతంలో చేసిన చెడు కర్మల ప్రభావాన్ని క్షయింప చేసుకున్నట్లవుతుంది.

' అహింసా పరమో ధర్మః ' అన్న సూక్తి ప్రకారం తోటి ప్రాణుల పట్ల ప్రేమ (అహింస) అత్యున్నత ధర్మం. తోటి మానవులను అంటరాని వారుగా చూడటం కూడా హింసయే అని గాంధీజీ నమ్మారు. అందుకే అంటరానితనాన్ని మహా పాపంగా ప్రకటించి దాని నివారణకు కృషి చేశారు.

చరిత్ర మధ్య యుగాల నాటికి భారతదేశంలో అస్ప్రృశ్యతతోపాటు వర్ణవ్యవస్థ కూడా బలంగా పాతుకుపోయింది. వ్యక్తిగత మేధస్సు, శక్తి సామర్థ్యాలతో నిమిత్తం లేకుండా ఆచార్యులు, పరిపాలకులు, వర్తకులు మొదలైనవారు జన్మహక్కుగా ఉన్నత స్థానాలను అధిరోహించటంతో దేశం ఆధ్యాత్మికంగా, భౌతికంగా బలహీనమయింది. విదేశీ దురాక్రమణల నెదుర్కోలేక దేశం దాస్యం పాలయింది. దేశం తిరిగి స్వాతంత్ర్యం సంపాదించాలంటే ప్రజలు తమ విభేదాలను మరచి కలసికట్టుగా పోరాడాలని గాంధీజీ పిలుపునిచ్చారు.

కాబట్టి లక్ష్యాలను సాధించాలంటే అందుకు తగిన విషయ పరిజ్ఞానం అవసరం. ముందుగా మనం సాధించదలచుకున్నదేమిటి అందుకు ఏ విషయ పరిజ్ఞానం కావాలన్నది నిశ్చయించుకోవాలి. దానిని సంపాదించటానికి గల కొన్ని మార్గాలు క్రింద ఇవ్వబడ్డాయి.

1. చదువు ద్వారా, అనుభవం ద్వారా సంపాదించిన జ్ఞానం.
2. అంతర్జాలం (ఇంటర్‌నెట్), గ్రంథాలయాలలో లభ్యమయ్యే సమాచారం.
3. ఇతరుల సహచర్యం ద్వారా లభించే జ్ఞానం మరియు అనుభవం (విశ్వ హృదయం అధ్యాయంలో వివరించబడింది.)

# అధ్యాయం - 6
# జ్ఞానం కన్నా బలీయమైనది ఊహా శక్తి



జ్ఞానం మనకు తెలిసిన ప్రపంచానికే పరిమితమైనదైతే ఊహాశక్తి మనకు తెలియని, అర్థంకాని ప్రపంచానికి సంబంధించినది. అందువలన జ్ఞానం కన్నా ఊహాశక్తి మరింత బలమయినది.

ఊహాశక్తి అంటే ప్రస్తుతం మన కళ్ళముందులేని, భవిష్యత్తులో రూపుదిద్దుకునే వాటిని దర్శించగలగటం. ఉదాహరణకు బిల్‌గేట్స్ కంప్యూటర్‌లోని యం.యస్. వర్డ్, ఎక్సెల్ వంటివి ఎలా ఉండాలో ముందే ఊహించగలిగాడు. రచయితలు, కళాకారులు తమ ఊహ ఎలా రూపుదిద్దు కుంటుందో ముందే మనస్సులో దర్శించగలరు.

ఊహాశక్తిని పగటి కలలుగా పొరపడకూడదు. పగటి కలలు సమయాన్ని వృథా చేసే సోమరితనానికి చిహ్నంకాగా ఊహాశక్తి కార్యాచరణతో కూడుకున్న ఆలోచనలకు చిహ్నం. మానవుడు తాను ఊహించిన దేన్నైనా సాధించగలడు, నిర్మించగలడు.

ఊహాశక్తిని ఉపయోగించుకోవటం ద్వారా మానవులు ప్రకృతి వనరులను ఆధీనంలోకి తెచ్చుకుని నీటిలో, నింగిలో, భూమిపై ఉన్న జలచరాలు, పశుపక్ష్యాదులపై ఆధిక్యం సాధించారు. ఆదిమ మానవుడు కనుగొన్న చెకుముకి రాయి, బల్లెం, చక్రం వంటి సాధనాల నుండి నేటి టెలిఫోన్లు, ఇంటర్‌నెట్, ఏ.టి.యం. వంటివి మన జీవితాలకు ఎంతో సౌలభ్యాన్ని సుఖాన్ని చేకూరుస్తున్నాయి.

ఊహాశక్తి క్రింద పేర్కొన్న రెండు రకాలుగా ఉంటుంది:

1. కృత్రిమ ఊహాశక్తి : దీనిద్వారా పాత సిద్ధాంతాలను, పద్ధతులను తిరగ వ్రాసి, మెరుగు పెట్టి కొత్తవాటిగా రూపొందించవచ్చును. సామాన్యమానవులు, తమ చదువు, అనుభవం ద్వారా సంపాదించిన జ్ఞానం ఆధారంగా ఈ కృత్రిమ ఊహాశక్తిని ఎక్కువగా ఉపయోగిస్తారు.

2. సృజనాత్మక ఊహాశక్తి : గొప్ప నాయకులు, కవులు, కళాకారులు తమ అంతర్వాణి ప్రభోదంతో గొప్ప కార్యాలు సాధిస్తారు. దీనిని సామాన్య మానవులు అరుదుగానే ఉపయోగిస్తారు.

ఊహాశక్తి క్రింది వాటి ద్వారా వస్తుంది.

1. బాల్యం నుండి ఉప చేతన మనస్సులో పోగుపడ్డ విషయాలద్వారా
2. ఇతరుల నుండి ప్రపంచంలోకి వెలువడిన ఆలోచనలు, భావాల ద్వారా
3. అంతఃస్ఫురణ ద్వారా

వీటిలో మానవ మేధస్సు వివరించలేనిది అంతఃస్ఫురణ. ఉదాహరణకు ముడి చమురులో బెంజీన్ రసాయనం ఒక మూలకం. దాని పరమాణు నిర్మాణాన్ని వివరించటం శాస్త్రవేత్తలకు ఒక సవాలుగా ఉండేది. ఆగస్ట్ కెకులె అనే శాస్త్రవేత్త ఒక పాము తన తోకను తానే నోట కరచి ఉంచటం వంటి దృశ్యాన్ని అంతఃస్ఫురణ ద్వారా గ్రహించి ఆ విధంగా బెంజీన్ పరమాణు నిర్మాణాన్ని వివరించగలిగాడు.

గాంధీజీ కూడా తన జీవితంలో ఎన్నోసార్లు అంతఃస్ఫురణను పొందిన సంఘటనలున్నాయి. 1930 జనవరి నాటికి ఆయన తన స్వాతంత్ర్య పోరాట ప్రయత్నాలలో తదుపరి ఏం చేయాలన్నది తెలియక దిక్కుతోచక ఉన్నారు. ఫిబ్రవరి మధ్య నాటికి ఆయన అన్వేషణ ముగిసి ఒక అంతఃస్ఫురణ మదిలో మెరిసింది. తన పోరాటం జరపవలసింది ఉప్పు సత్యాగ్రహం ద్వారా!

ఉప్పును సముద్ర తీర ప్రాంతాలలో సులభంగా తయారుచేయవచ్చు. అంతేకాకుండా ఉప్పును సాధారణ ప్రజలు కూడా ఉపయోగిస్తారు. అటువంటి ఉప్పు తయారీపైన, అమ్మకం పైన ఉన్న పన్నును చెల్లించడాన్ని నిరాకరించడం ద్వారా బ్రిటీష్ ప్రభుత్వాన్ని ధిక్కరించవచ్చని గాంధీజీ తలచారు. ఆశ్రమం నుండి సముద్ర తీరం వరకు బారులు తీరిన సత్యాగ్రహ వాలంటీర్లు ఉప్పును తయారు చేయటాన్ని, అమ్మటాన్ని, దానికి పన్ను చెల్లించకుండానే ప్రజలు కొనుగోలు చేయటాన్ని గాంధీజీ ఊహించుకున్నారు. తనను, తన అనుచరులను బ్రిటిష్ ప్రభుత్వం నిర్బంధించటమో లేక హింసించటమో చేస్తే ఉప్పు సత్యాగ్రహం మరింత బలపడుతుందని తలచారు. గాంధీజీ ఊహించిన విధంగానే ఉప్పు సత్యాగ్రహం విజయవంతమైంది.

**" నేను భగవంతుని వాక్కులను వినగలననే విషయం కొత్తదీ కాదు, రహస్యమూ కాదు. అయితే ఈ విషయాన్ని నేను నా చేతల ద్వారా మాత్రమే ఋజువు చేయగలను. భగవంతుని ఒక వస్తువు లాగా అందరిముందూ ప్రదర్శించి**

**ఋజువు చేయటం అసంభవం. అయితే భగవంతుడు తన సేవకులకు ఎన్ని కష్టనష్టాలనైనా ఎదుర్కొనే శక్తిని ప్రసాదిస్తాడు. గడచిన ఐదు దశాబ్దాలుగా నేనటువంటి సేవకుడిగా ఆయనచేత నడిపించబడుతున్నాను. నా జీవితంలో ఎన్నో సార్లు పతనం కాకుండా నానుండి నన్ను ఆయన రక్షించారు. నేను ఎంతగా భగవంతుని శరణాగతి వేడుకొన్నానో నా జీవితం అంతగా అర్ధవంతం అయింది" – గాంధీజీ.**

గాంధీజీ ప్రయోగించిన సహాయ నిరాకరణ, విదేశీ వస్తు బహిష్కరణ, క్విట్ ఇండియా ఉద్యమం వంటివి కూడా అంతఃస్ఫురణల ద్వారా అందిన ప్రేరణలే. బ్రిటీష్ ప్రభుత్వం భారతదేశంలోని ప్రత్తివంటి ముడిసరుకులను ఇంగ్లాండుకు తరలించుకుపోయేది. ఇంగ్లాండులోని నూలు మిల్లులలో చౌకగా తయారయిన వస్త్రాలను భారతదేశంలో అధిక లాభాలకమ్మేది. భారతదేశంలోని పరిశ్రమలు తమకు అవసరమైన యంత్రాలను దిగుమతి చేసుకోకుండా అధిక సుంకాలు విధించటం, తగిన అనుమతుల నివ్వకపోవటం వంటి విధానాల ద్వారా దేశీయ పరిశ్రమలను దెబ్బతీసేది. ఈ దోపిడీకి విరుగుడు ఇంగ్లాండులో తయారయిన వస్త్రాలను బహిష్కరించటం, దేశీయంగా తయారు చేసుకున్న వస్త్రాలను ధరించటమే అని గాంధీజీ తలచి వాటిని అమలుపరచారు.

ఎటువంటి కార్యాచరణ లేదా ప్రణాళికలు లేకుండా సోమరితనంతో జీవితం గడిపితే ఊహాశక్తి మరియు అంతఃస్ఫురణలు కూడా మందగిస్తాయి. మన ఆలోచనలు, భావోద్వేగాలు గాఢంగా ఉంటేనే ఊహాశక్తి మరియు అంతఃస్ఫురణలు సమర్థవంతంగా పనిచేస్తాయి.

★ ★ ★

# అధ్యాయం - 7

# ప్రణాళికల ద్వారా కార్యాచరణను రూపొందించడం



గాంధీజీ చెప్పినట్లుగా భవిష్యత్తు అనేది వర్తమానంలో ఏమి చేస్తున్నామనే దానిమీద ఆధారపడుతుంది. లక్ష్య సాధనలో ప్రణాళికలు ఎంతగానో ఉపయోగపడతాయి. ప్రస్తుత పరిస్థితిని గమనించి దానిని ఒక వారంలో లేదా నెలలో లేదా సంవత్సరంలో ఎలా మెరుగుపరచగలమనేది ప్రణాళికల ద్వారా సాధ్యమవుతుంది.

ప్రణాళికల ద్వారా సమయం, ధనం, మానవశక్తి వంటి వనరులను అత్యధిక ఫలితాలనిచ్చే విధంగా ఉపయోగించుకోవచ్చు. అయితే ప్రణాళికలను తయారు చేయటం ఎంత ముఖ్యమో వాటిని అమలు చేయటం కూడా అంతే ముఖ్యం. క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో గాంధీజీ రూపొందించిన ప్రణాళిక ఒక ఉదాహరణగా ఇవ్వబడింది.

1. ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు, పనులు నిలిచి పోవాలి.
2. ప్రజలు పన్నులను, శిస్తులను చెల్లించకూడదు ఆస్తులను వదులుకోమని ఆజ్ఞలు వస్తే వాటిని ప్రతిఘటించాలి.
3. ఆజ్ఞలను అమలు చేయకుండా ప్రభుత్వోద్యోగులు తమ ఉద్యోగాలను వదులుకోవాలి.
4. సాహస వంతులైన విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను, కళాశాలలను బహిష్కరించి దేశం స్వాతంత్ర్యం సంపాదించేవరకు వాటిలో ప్రవేశించకూడదు.
5. హింసను నమ్మేవారు, ఇతర మతస్థులను ద్వేషించే వారు ఉద్యమానికి దూరంగా ఉండాలి.

ఇటువంటి మరెన్నో ప్రణాళికలతో గాంధీజీ ప్రజలకు మార్గనిర్దేశం చేశారు. మనం కూడా కోరికలను లేదా లక్ష్యాలను సాధించటానికి కొన్ని మార్గాలను, పథకాలను నిర్ధేశించుకుని వాటిని ప్రణాళికల రూపంలోకి తీసుకురావాలి. ఒకవేళ మొదటి ప్రణాళిక విజయవంతం కాకపోతే దానిలోని లోటు పాట్లను సవరించి మరొక ప్రణాళికను తయారుచేయాలి. ఆ విధంగా విజయం సాధించే వరకూ ప్రణాళికలను తయారుచేస్తూ వాటిని అమలు చేస్తూ కృషి చేయాలి.

తగిన ప్రణాళికలను ఎంచుకొని అమలు చేయటంలో నిర్ణయ శక్తి ఎంతో ప్రాముఖ్యత వహిస్తుంది. నిర్ణయమంటే వివిధ ప్రత్యామ్నాయాలలో ఒక ఉత్తమమైన దానిని ఎన్నుకోవటం. ప్రత్యామ్నాయాలను పరిశీలించేటప్పుడు క్రింది విషయాలను పరిశీలించాలి.

1. ఒక పనిచేయటం లేదా చేయకపోవటం వలన కలిగే పరిణామాలు.
2. దీర్ఘకాలిక ప్రభావం : ఏదైనా ఒక పని చేసినప్పుడు అది తాత్కాలిక ప్రయోజనం చేకూర్చినా దీర్ఘకాలంలో నష్టాలను చేకూర్చవచ్చు.
3. హృదయం చెప్పినట్లు వినటం.

గాంధీజీ సత్యాగ్రహం కోసం ఇచ్చిన పిలుపును దేశమంతా పాటిస్తున్నప్పుడు చౌరీ చారా అనే ఊరిలో ఆవేశపూరితులైన ఉద్యమకారులు రక్షక భట నిలయాన్ని తగుల పెట్టి కొందరు రక్షక భటుల మరణానికి కారకులయ్యారు. వెంటనే గాంధీజీ పోరాటాన్ని ఆపమని ఉద్యమకారులను ఆదేశించారు.

ఆ దశలో పోరాటాన్ని ఆపటం ఉద్యమానికి కీడు చేస్తుందని సహచరులు వారించినా గాంధీజీ దృఢ నిశ్చయులై ఉన్నారు. అహింసాయుత పోరాటంలో హింసకు ఎంత మాత్రం తావు లేదని ఆయన అభిప్రాయం. ఒకవేళ తాత్కాలికంగా ఉద్యమ విజయం కోసం హింసను అనుమతించినా అది దీర్ఘకాలంలో దుష్ఫలితాలను కలిగిస్తుంది కాబట్టి అటువంటి పోరాటాన్ని విరమించటమే ఉత్తమమని ఆయన అభిప్రాయపడ్డారు.

'దృఢ చిత్తుడైన ఒక్క వ్యక్తియే మెజారిటీ' అని గాంధీజీ అభిప్రాయం. కనుక ఒక నిర్ణయం తీసుకున్న తర్వాత దానికి కట్టుబడి ఉండటం ఎంతో అవసరం.

మనిషి అపజయం పొందటానికి గల కారణాలలో ఒకటి ఏమిటంటే సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోలేకపోవటం.

విజేతలలో గల ఒక ముఖ్య లక్షణమేమిటంటే నిర్ణయాన్ని వెంటనే తీసుకోవటం, ఒకవేళ నిర్ణయాన్ని మార్చుకోవలసివస్తే ఆ పనిని నిదానంగా చేయటం. పరాజితులు దానికి విరుద్ధంగా నిర్ణయాలు ఆలస్యంగా తీసుకోవటం, దానిని వెనువెంటనే, తరచు మార్చుకోవటం చేస్తారు.

సమర్థులైన, తెలివైన, పాజిటివ్ దృక్పథం ఉన్న వారిని మీ సహచరులుగా తీసుకుని వారిచ్చిన సమాచారాన్ని పరిగణనలోకి తీసుకున్నప్పటికి మీ హృదయం చెప్పినట్లు నిర్ణయం తీసుకొని అమలుచేయండి.

ఒక నిర్ణయాన్ని అమలు పరచటానికి ఎంత ధైర్యం కావలసి వస్తుందనే దాన్ని బట్టి ఆ నిర్ణయం ప్రాముఖ్యత ఉంటుంది. మానవ నాగరికతా వికాసానికి తోడ్పడిన ఎన్నో ముఖ్య నిర్ణయాలు మరణాన్ని కూడా లెక్కచేయకుండా తీసుకోబడ్డాయి. అపజయం పొందుతామనే భయంతో నిర్ణయం తీసుకోలేకపోవటమనే అవలక్షణం చిన్న వయస్సులోనే వ్రేళ్ళూనికొని పోతే తొలగించటం కష్ట సాధ్యమౌతుంది. అందువలన ఈ అవలక్షణాన్ని మొగ్గలోనే త్రుంచి వేయాలి.

★ ★ ★

# అధ్యాయం - 8
# విశ్వ హృదయం (1+1= >2)



గత అధ్యాయంలో ప్రణాళికల గురించి తెలుసుకున్నాము. కానీ ప్రణాళికలు కార్యరూపం దాల్చటానికి మానవ యత్నం, బలం అవసరం. గాంధీజీ తన బలాన్ని లక్షలాది మంది ప్రజలు ఒక్క హృదయంతో, శరీరంతో పనిచేసేటట్లు ప్రభావితం చేసి సంపాదించారు. మానవమాత్రులకు అసాధ్యమనుకున్న పనులను ఆయన చేసి చూపించారు.

దక్షిణాఫ్రికాలో రైలు ప్రయాణం నుండి దింపి వేయబడిన తర్వాత ఆయన ముందుగా చేసిన పనులలో ఒకటి తనకు తోడ్పడే మనుష్యులను కూడగట్టటం. తనకు పరిచయస్తులైన న్యాయవాదులు, మిత్రులు వంటి వారి ద్వారా నాటాల్ ఇండియన్ కాంగ్రెస్ సంస్థను స్థాపించారు. దాని ద్వారా అక్కడి భారతీయుల స్థితి గతులను తెలుసుకుంటూ వారి సమస్యలను పరిష్కరించేవారు.

గాంధీజీ దక్షిణాఫ్రికా వదలి భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత కూడా జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ భాయ్ పటేల్ వంటి ఎందరో స్వాతంత్ర్య సమర యోధులను కూడగట్టుకొని తన పోరాటాన్ని కొనసాగించారు.

'విశ్వ హృదయం' అంటే ఒక లక్ష్యం కోసం ఇద్దరు లేక అంతకన్నా ఎక్కువ మంది సమన్వయంతో చేసే ఒక సంఘటిత యత్నం. విశ్వ హృదయం సూత్రం ప్రకారం ఇద్దరు వ్యక్తులు సంఘటితమైనప్పుడు వారిద్దరి శక్తి మరిన్ని రెట్లు ఎక్కువ అవుతుంది. దీనినే సమ్మిళిత శక్తి (Synergy) గా వ్యవహరించవచ్చును.

విశ్వ హృదయం బృంద సమావేశాలను ఇంట్లోకాని, వ్యాపార కార్యాలయం లేదా ప్రశాంతంగా ఉండే మరే ఇతర ప్రదేశంలోనైనా జరుపుకోవచ్చు. సాధారణంగా వారానికి ఒక్కసారి సమావేశం జరుపుకోవటం ఉత్తమం. ఉత్సాహభరితమైన వాతావరణంలో సభ్యులు తన అనుభవాలను, అభిప్రాయాలను పంచుకోవటం, అభివృద్ధి నివేదికలు, ప్రణాళికల గురించి చర్చించుకోవటం వంటివి నిర్ణయించిన అజెండా ప్రకారం చేయాలి.

మానవుని మెదడు తన ఆలోచనలను, భావోద్వేగాలను, ఊహలను ఇతరుల మెదడుకు పంపడానికి ఒక ట్రాన్స్‌మీటర్ గానూ, ఇతరుల మెదడు నుండి వారి ఆలోచనలను, భావోద్వేగాలను, ఊహలను గ్రహించడానికి ఒక రిసీవర్‌గానూ పనిచేస్తుంది. ఈ సూత్రం ప్రకారం మన భావాలకు అనుగుణంగా ఉండేవారు

తమంతట తాముగా వచ్చి మనతో సాంగత్యం ఏర్పరచుకోవటం జరుగుతుంది.

విద్యుత్తు యొక్క శక్తిని నమ్మినా నమ్మకపోయినా అది తన ప్రభావాన్ని చూపిస్తుంది. అలాగే ఈ విశ్వంలోని ఎన్నో శక్తులు అగోచరమైనవి, అతీంద్రియమైనవి. మానవుడు తన పంచేంద్రియాల ద్వారా గ్రహించలేని, అర్థం చేసుకోలేని శక్తి ఉంది. ఈ శక్తిని అందుకోవాలంటే విశ్వహృదయం సహకారం అవసరం.

ప్రతి వ్యక్తి తనలోని దివ్యత్వాన్ని వెలికితీసి ఆదర్శసమాజం నెలకొనేలా చేయాలన్న ఆలోచన బీజరూపం దాల్చి ఈ పుస్తక రూపంలోను, సంఘ రూపంలోను మీ ముందుకు రావడం వెనుక కూడా విశ్వహృదయం బృందం కృషి వుంది.

విశ్వ హృదయం బృందాన్ని ఏర్పరచుకునేటప్పుడు దాని ద్వారా బృందంలోని వారందరికీ ప్రయోజనం ఉండేటట్లు చూసుకోవాలి. అయితే అది అన్ని సందర్భాల్లోనూ ఆర్థిక పరమైనదిగా ఉండనవసరం లేదు. బృంద సభ్యుల అభిప్రాయాలకు, సేవలకు తగిన గుర్తింపు, గౌరవం, ఆత్మ సంతృప్తి వంటివి లభించేటట్లు చూసుకోవాలి. ఎంత మందిని కూడగడుతున్నామనే దానికన్నా ఎంత మంది హృదయాలను చేరుతున్నామనేది ముఖ్యం.

వాస్తవిక ప్రపంచంలో ఇద్దరు వ్యక్తులు కలసికట్టుగా పది నిమిషాలు పని చేయటం కూడా చాలా కష్టం. అందుకు కారణాలేమిటంటే మనల్ని మనం గొప్పగా ఇతరులను అల్పులుగా ఊహించుకోవటం, సహచరుల సేవలకు, అభిప్రాయాలకు తగిన గుర్తింపును గౌరవాన్ని ఇవ్వకపోవటం వంటివి. ఇటువంటి కారణాలవలన బృంద సభ్యులందరి శక్తులను ఒక లక్ష్యంపై కేంద్రీకరించడం కష్ట సాధ్యమౌతుంది.

బృంద సభ్యులతో వ్యవహరించేటప్పుడు క్రింది సూచనలను దృష్టిలో ఉంచుకోవాలి.

1. ఇతరులు మనతో ఏ విధంగా వ్యవహరించాలని కోరుకుంటామో మనము ఇతరులతో అదే విధంగా వ్యవహరించాలి. దీనినే Golden Rule of Reciprocity అంటారు.

2. ప్రతి వ్యక్తీ తనను తాను ఎంతో ముఖ్యుడుగా భావించుకొంటాడు. కాబట్టి ఇతరుల సేవలను తగు విధంగా గుర్తించి గౌరవించాలి. హృదయపూర్వకంగా అభినందించాలి.

3. ఏదైనా విషయం గురించి సంభాషించేటప్పుడు మనం మాట్లాడేదాని కన్నా ఎదుటి వారు చెప్పేది వినడానికి ఎక్కువ ప్రాముఖ్యత నివ్వాలి.

4. ఎదుటి వారి సంభాషణ పూర్తి కాకుండా అనవసరంగా అడ్డురాకూడదు. వారు చెప్పినది పూర్తిగా విన్న తర్వాత ఏవైనా లోపాలుంటే సహేతుకంగా వివరించాలి. "మీరు చెప్పింది తప్పు" అని చెప్పేయకుండా వారి అభిప్రాయాలకు విలువనివ్వాలి.

5. సంభాషణలో "నేను అలా చేసాను", "నేను ఇలా చెప్పాను", అంటూ "నేను"కు ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వకుండా ఇతరుల కష్ట సుఖాలలో హృదయ పూర్వకమైన ఆసక్తిని చూపి వాటి గురించి విచారించాలి. వారికి ఆసక్తికరమైన విషయాల గురించి మాట్లాడాలి.

6. ఇతరులతో నేరుగా లేదా ఫోన్‌లో మాట్లాడేటప్పుడు కూడా చిరునవ్వును ప్రదర్శించటం ముఖ్యం.

7. ప్రతి వ్యక్తికీ తన పేరు ఎంతో ఇష్టమైనదిగా ఉంటుంది. కాబట్టి వీలయినంత వరకు సంభాషణలో ఎదుటి వారి పేరుతో, గౌరవ వాచకంతో సంభోదించటం అవసరం.

8. సాధారణంగా వ్యక్తులు మతం, రాజకీయాల వంటి వాటి గురించి బలమైన నమ్మకాలు, ఇష్టాలు కలిగి ఉంటారు. వాదనలు వాటిని మార్చకపోగా వ్యక్తుల మధ్య సంబంధాలను దెబ్బతీస్తాయి. కాబట్టి మతం, రాజకీయాల వంటి వాటి గురించి వాదనలకు దిగకూడదు.

9. మన అభిప్రాయాలలో గానీ, ప్రవర్తనలో కానీ లోపం ఉంటే హుందాగా ఒప్పుకుని వాటిని సరిచేసుకోవాలి.

10. ఏ విషయాన్నైనా, సమస్యనైనా, ఎదుటివారి దృక్పథంతో చూడటం నేర్చుకోవాలి. ఎదుటివారి బలహీనతలను, లోటుపాట్లను సానుభూతితో అర్థం చేసుకోవాలి.

11. సంభాషణలో అసభ్య పదాలు, యాస వంటివి లేకుండా జాగ్రత్త పడాలి. వీలయినన్ని ఎక్కువ పుస్తకాలు, పత్రికలు చదవటం ద్వారా పదకోశాన్ని, విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి. అయితే ఎదుటివారికి అర్థమయ్యేటట్లు సరళంగా మాట్లాడాలి.

12. అనుచరులలో, సహచరులలో ఏవైనా లోపాలుంటే వాటిని బహిరంగంగా వ్యక్తపరచకుండా అంతరంగికంగా చర్చించాలి.

13. ఇతరుల పరోక్షంలో వారి గురించి హేళనగా మాట్లాడటం, దుష్ప్రచారం, పితూరీలు వంటివి చేయకూడదు.

14. "ఇలా చేయండి", "అలా చేయకండి" వంటి ఆజ్ఞలు జారీ చేసే బదులు "ఇలా చేస్తే బాగుంటుంది" అని సూచనప్రాయంగా తెలియచేస్తే మంచిది.

15. కోపం, దుఃఖం వంటి కారణాల వలన మనస్సు బాగా లేనప్పుడు ఇతరులతో నేరుగా కానీ, ఫోన్, కంప్యూటర్ ద్వారా కానీ సంభాషించకుండా వ్యాహాళికి వెళ్ళటం, సంగీతం వినటం, దేవాలయ సందర్శనం వంటి వాటి ద్వారా ఉల్లాసాన్ని పొందాలి.

16. ఇతరులతో వ్యవహారాలు నడిపేటప్పుడు మనకూ, ఎదుటి వారికి ఇద్దరికీ ప్రయోజనం ఉంటేటట్లు చూసుకోవాలి. దీనినే ఉభయ తారకం (Win-Win సూత్రం) అంటారు.

17. ఇతరులతో సంబంధాలు తెగిపోయే పరిస్థితి వచ్చినప్పుడు వ్యక్తిగత దూషణలకు, పొట్లాటలకు దిగకుండా హుందాగా విడిపోవాలి.

18. మనతో కలిసి పనిచేయటం ఇతరులకు ఉత్సాహ భరితమూ, ఆనంద భరితమూ అయ్యేటట్లు చూసుకోవాలి.

★ ★ ★

# అధ్యాయం - 9

# నాయకత్వం, సహచరులను లక్ష్యంవైపు నడిపించడం



నాయకత్వం అంటే ఇతరులను ఒక లక్ష్యం కోసం పనిచేసేలా ప్రభావితం చేసి, సంఘటిత పరచి నడిపించటం ! స్థూలంగా చెప్పాలంటే ప్రపంచంలో రెండు రకాల ప్రజలున్నారు – నాయకులు మరియు అనుచరులు. మీరు కోరుకున్న రంగంలో నాయకులుగా ఉంటారా లేక అనుచరులుగానే మిగిలి పోతారా అనేది ఇప్పుడే నిర్ణయించుకోండి. ఆ నిర్ణయం మీ జీవితంలో పెనుమార్పుకు కారణం కాగలదు.

అనుచరుడిగా ఉండటం తలవంపేమీ కాదు. అలాగని ఎల్లప్పుటికీ అనుచరుడిగానే మిగిలి పోవటం మాత్రం గొప్ప విషయం కాదు. నిజానికి గొప్ప నాయకులెందరో తమ ఎదుగుదలను అనుచరులుగా మొదలు పెట్టినవారే. అయితే వారు తమ నాయకుల నుండి ఎన్నో విషయాలు, మెళకువలు నేర్చుకొని ఎదిగారు.

నాయకత్వం రెండు రకాలు :

1. ఇతరుల సమ్మతంతో, వారి సంక్షేమం కోసం పని చేసే నాయకత్వం.
2. ఇతరుల సమ్మతం లేకుండా నాయకుడి సంక్షేమం కోసం మాత్రమే పనిచేసే నాయకత్వం (నియంతృత్వం).

మానవులు నియంతృత్వాన్ని కొద్దికాలం మాత్రమే, విధిలేని పరిస్థితుల్లో భరిస్తారు. కానీ అటువంటి నియంతృత్వం కలకాలం కొనసాగడనటానికి ఎన్నో నిదర్శనాలు చరిత్రలో ఉన్నాయి. హిట్లర్, ముసోలినీ వంటి నియంతల పతనం అందుకు ఉదాహరణ.

ఇతరుల సమ్మతితో వారి సంక్షేమం కోసం పాటు పడే నాయకత్వం మాత్రమే కలకాలం నిలుస్తుంది. ఆ విధంగా పనిచేసే నాయకుడు రాజకీయ, వ్యాపార, శాస్త్ర సాంకేతిక రంగాల వంటి వాటిలో విజయం సాధిస్తాడు.

**నాయకుని విజయానికి దోహదం చేసే అంశాలు :**

**1. ధైర్యం :** కొందరు ధైర్యాన్ని తెగింపుగా అపార్థం చేసుకుంటారు. ధైర్యానికి నిజమైన అర్థం నాయకునికి తన యందు తనకు మరియు తాను ఎన్నుకున్న రంగం మీద విశ్వాసం ఉండటం. ఇవి రెండూ లేని నాయకుని వెంట నడవటానికి ఏ అనుచరుడు కూడా సిద్ధపడడు.

గాంధీజీ మాటల్లో చెప్పాలంటే "నా అంతరాత్మ చెబుతూ వుంటుంది. ఒక వేళ నువ్వు ఒంటరి వైనప్పటికి ఈ మొత్తం ప్రపంచాన్ని ఎదిరించి నిలవాలి. భయపడవద్దు, నీ హృదయాన్నే నమ్ముకో. నీవు నమ్మి నిలబడిన దాని కోసం భార్యా బిడ్డలు, బంధుమిత్రులందరిని వదులుకోవటానికి కూడా సిద్ధపడు"

**2. న్యాయ విచక్షణ :** ఇరు పక్షాల వాదనలు వినకుండా ఏక పక్ష నిర్ణయాలు తీసుకునే నాయకుడు చివరికి అందరికీ దూరమవుతాడు.

**3.** సత్వరమే తగు నిర్ణయాలు తీసుకోగల సమర్థత.

**4.** ప్రణాళికలను రచించటం.

**5. అణకువ కలిగి ఉండటం :** అవసరమైనప్పుడు తన అనుచరులు చేయవలసిన పనులు కూడా చేయటం, ఇతరుల నుండి సూచనలను, సద్విమర్శలను సహృదయంతో స్వీకరించడం.

**6. పరిపూర్ణ భాగస్వామ్యం :** నాయకుడు ప్రతి పనినీ నూటికి నూరు పాళ్ళు నిమగ్నమై తన మనస్సు పెట్టి చేస్తాడు. నాయకుడు తన అనుచరుల కన్నా ఎక్కువగా శ్రమించటానికి సిద్ధపడతాడు.

**7. విశ్వాసం :** ఇతరులకు విశ్వసనీయుడుగా ఉండని వ్యక్తి నాయకుడు కాలేడు.

**8.** తన అనుచరుల సమస్యలను, బలహీనతలను సానుభూతితో అర్థం చేసుకోవటం.

**9. బాధ్యత వహించటం :** నిజమైన నాయకుడు తన బాధ్యతల నుండి తప్పించుకోకుండా తన అనుచరుల లోటు పాట్లకు కూడా తానే బాధ్యత వహిస్తాడు. With great power comes great responsibility అని గుర్తుంచుకొంటాడు.

**10.** నిజమైన నాయకుడు తన అనుచరులకు సహకరించి వారి నుండి కూడా సహకారం పొందగలడు.

**నాయకుని అపజయానికి దోహదం చేసే అంశాలు :**

1. తాను ఇతరుల నుండి ఏ విధమైన ప్రవర్తన కోరుకుంటున్నాడో, ఆ విధంగా ఇతరుల పట్ల ప్రవర్తించకపోవటం.

2. అనుచరులు పోటీదారులవుతారని భయపడి వారికి తగిన శిక్షణను, పనులను ఇవ్వకపోవటం.

3. పేరు ప్రతిష్టలకై ఆరాటం : నిజమైన నాయకుడు తన అనుచరుల కృషికి తగిన గుర్తింపునిస్తాడు.
4. తన భావోద్వేగాలపై అదుపు లేక అనుచరులను దూషించే వాడు సరియైన నాయకుడు కాలేడు.
5. నిజమైన నాయకుడు పదవులు, హోదాల కోసం ప్రాకులాడకుండా అనుచరులకు అందుబాటులో ఉంటాడు.

సాధారణంగా వ్యక్తులు ఇతరులతో వ్యవహరించేటప్పుడు క్రింది మూడు విధాలైన తరహాలలో ఉండవచ్చును.

1. దూకుడు స్వభావం **(aggressive) :** ఈ తరహా వ్యక్తులు తమ నోటి మీద, ప్రవర్తన మీద అదుపు లేనివారై అతి త్వరలోనే అందరినీ శత్రువులుగా చేసుకొంటారు.
2. మెతక స్వభావం **(passive) :** ఈ తరహా వ్యక్తులు తమ అభిప్రాయాలను, నిర్ణయాలను ఇతరులకు చెప్పడానికి సిగ్గుపడి, చొరవ లేక, అంతర్ముఖులుగానే ఉంటారు.
3. ధృడ స్వభావం **(assertive) :** ఈ తరహా వ్యక్తులు ఇతరులను నొప్పించకుండానే తమ అభిప్రాయాలను స్పష్టంగా తెలియచేసి కావలసిన వాటిని సాధించుకొంటారు. విజేతలు కాదగిన వారికి తగిన స్వభావమిదే!

★ ★ ★

# అధ్యాయం - 10

# ఉపచేతన మనస్సు : మానవ హృదయానికి, విశ్వ హృదయానికి మధ్య వారధి




ఈ విశ్వమంతా పదార్థం మరియు శక్తితో కూడుకొని ఉంది. భూమి, నీరు, అగ్ని, వాయువు మరియు ఆకాశం అనబడే ఐదు మూలకాలతో (పంచ భూతాలతో) మనం సృష్టించబడ్డాము. ఆలోచన అనేది శక్తి యొక్క రూపం. కాబట్టి మనం ఆలోచనాశక్తి అనే పదాన్ని మరియు మనస్సు (మైండ్) అనే పదాన్ని ఒకదానికొకటి పర్యాయ పదాలుగా ఉపయోగించవచ్చును. పదార్థాన్ని శక్తిగానూ, శక్తిని పదార్థంగాను మార్చవచ్చును. ఆహారం, ఇంధనం వంటి పదార్థాలనుండి శక్తిని పొందగల విజ్ఞానాన్ని మానవులు కనుగొన్నారు. అయితే శక్తిని పదార్థంగా మార్చగల విజ్ఞానం మనకు పరిమితంగానే ఉంది. కానీ ఈ విజ్ఞానపు లోతుల్లోకి వెళ్ళినప్పుడు ఆలోచనాశక్తి నుండి విమానం, కంప్యూటర్ వంటి ఆవిష్కరణలు, దేశ స్వాతంత్ర్యం వంటి సంఘటనలు ఎలా సంభవిస్తాయన్నది అర్థం చేసుకోగలము.

మెదడు యొక్క పనులను ముఖ్యంగా క్రింది రెండు విభాగాలు నిర్వర్తిస్తాయి.

**1. చేతన మనస్సు (కాన్షియస్ మైండ్)**

**2. ఉపచేతన మనస్సు (సబ్ – కాన్షియస్ మైండ్)**

**1. చేతన మనస్సు :** 'నేను చూస్తున్నాను', 'నేను వింటున్నాను' అని పంచేంద్రియాల గురించి చెప్పినప్పుడు అలా చెప్పేది చేతన మనస్సు. చూడటం, వినటం, వాసన చూడటం, రుచి చూడటం, స్పర్శ వంటి ఐదు పంచేంద్రియాల ద్వారా చేతన మనస్సు బయటి ప్రపంచంతో సంబంధం ఏర్పరచుకుంటుంది. దీనికి తార్కికంగా ఆలోచించే శక్తి ఉంటుంది. మంచి, చెడుల విచక్షణా జ్ఞానంతో పాటు దీని యొక్క మరొక్క ముఖ్య విధి ఏమంటే ఏదైనా పనిని చేయటానికి లేదా చేయకుండా ఉండటానికి కారణమయ్యే స్వేచ్ఛా చిత్తం (freewill). ఈ స్వేచ్ఛా చిత్తమే మానవులు మంచీ, చెడు కర్మలను చేయటానికి కానీ చేయకుండా ఉండటానికి కూడా కారణమౌతుంది.




మన చేతన మనస్సు పైన పేర్కొన్న ఐదు తన్మాత్రల ద్వారా బాహ్య ప్రపంచంతో సంబంధమేర్పరచుకుంటుంది. తన్ అంటే సూక్ష్మము. మాత్ర అంటే పదార్థము (భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనబడే పంచభూతాలు). ఈ పంచ భూతాలు వినికిడి (చెవి), స్పర్శ (చర్మం), చూపు (కన్ను), రుచి (నాలుక), వాసన (ముక్కు) అనబడే పంచేంద్రియాలతో అనుసంధానమై ఉంటాయి.

పంచభూతాలలోని ప్రతి మూలకమూ పంచేంద్రియాలలోని ఒక ముఖ్యమైన తన్మాత్రతో ప్రధానంగా మిగిలిన తన్మాత్రలతో కొంతమేరకు క్రింది విధంగా అనుసంధానమై ఉంటాయి.

1. ఆకాశం/శూన్యం – శబ్దం తన్మాత్ర (చెవి)
2. వాయువు – శబ్దం (చెవి) మరియు స్పర్శ (చర్మం) తన్మాత్రలు
3. అగ్ని – శబ్దం (చెవి) స్పర్శ (చర్మం) మరియు రూపం (కన్ను) తన్మాత్రలు
4. నీరు – శబ్దం (చెవి) స్పర్శ (చర్మం) రూపం (కన్ను) మరియు రసం (నాలుక) తన్మాత్రలు

5. భూమి - శబ్దం (చెవి) స్పర్శ (చర్మం) రూపం (కన్ను) రసం (నాలుక) మరియు గంధం (ముక్కు) తన్మాత్రలు

**2. ఉపచేతన మనస్సు :** దీనికి తార్కిక జ్ఞానం గానీ స్వేచ్ఛా చిత్తంగానీ ఉండవు. గుండె నిద్రలో కూడా పని చేసే విధంగా ఉపచేతన మనస్సు కూడా ఎప్పుడూ పనిచేస్తూనే ఉంటుంది. ఇది క్రింది మూడు స్థాయిల్లో పనిచేస్తుంది.

1. భౌతిక స్థాయిలో జీవక్రియలైన శ్వాస, జీవించి ఉండాలన్న వాంఛ (ప్రాణంపై తీపి) సంతానోత్పత్తి పై కోరిక, సంతానం పై మమకారం వంటివి.
2. మానసిక స్థాయిలో జ్ఞాపకాలు, అలవాట్లు, భావోద్వేగాలకు నిలయం.
3. ఆధ్యాత్మిక స్థాయిలో ఆదర్శాలకు, ఉన్నత విలువలకు నిలయం.

చేతన మనస్సుకు బాహ్య ప్రపంచంతో సంబంధాలున్నందున బాహ్యప్రపంచ ప్రభావం నుండి ఉపచేతన మనస్సును కాపాడే బాధ్యత కూడా చేతన మనస్సుకు ఉంది. ఆ విధంగా చేతన మనస్సు కాపలాదారు పాత్రను కూడా నిర్వర్తిస్తుంది. మద్యం సేవించటం వంటి సమయాల్లో చేతన మనస్సు యొక్క సంరక్షణ లేకపోవటం వలన ఉపచేతన మనస్సు బాహ్య ప్రపంచపు దుష్ప్రభావాలకు లోనయి తన యజమానిని ప్రమాదాలకు గురి చేస్తుంది.

చేతన మనస్సు సక్రమంగా పనిచేయనప్పుడు ఉప చేతన మనస్సు భయం, కోపం, ద్వేషం, దురాశ వంటి వాటి ప్రభావానికి గురవుతుంది.

మానవుడు తన లక్ష్యాలను సాధించగలడా లేక పరాజితుడిగా మిగిలిపోతాడా అనేది తన చేతన మనస్సును అదుపులో పెట్టడంపై ఆధారపడి ఉంటుంది.

క్రింది రెండు రకాల ప్రపంచాలున్నాయని అనుకుందాము.

**1. బాహ్య ప్రపంచం :** ఇది మనం పంచేంద్రియాల ద్వారా సంబంధం ఏర్పరచుకుని చేతన మనస్సు ద్వారా సంభాషించే వెలుపలి ప్రపంచం.

**2. అంతఃప్రపంచం :** ఇది మనలోని ప్రేమ, భయం, ద్వేషం, కోరికల వంటి వాటితో కూడిన మనో ప్రపంచం. మనం దీనితో ఉప చేతన మనస్సు ద్వారా సంభాషిస్తాము.

బాహ్య ప్రపంచం అంతః ప్రపంచానికి ఒక ప్రతిబింబం లాంటిది. మనం బాహ్య ప్రపంచంలో చూసేవన్నీ అంతః ప్రపంచంలోని ఆలోచనలు,

భావోద్వేగాలు, కోరికల ద్వారా సృష్టించబడ్డవే. మానవులు పక్షులలాగా ఎగరాలన్న కోరిక నుండే విమానాలు తయారు చేయబడ్డాయి. మనో ప్రపంచంలోని కోరికల నుండే పాత సామ్రాజ్యాలు కూలిపోవటం, క్రొత్త రాజ్యాలు ఏర్పడడం జరిగాయి.

పై రెండు ప్రపంచాలను అర్థం చేసుకుంటే వాటి సమన్వయంతో కావలసిన లక్ష్యాలను సాధించవచ్చు. సాధారణంగా మానవులు బాహ్య ప్రపంచంలో కనిపించే ఫలితాలపై దృష్టి నిలిపి వాటిని మారుద్దామనుకుంటారు. కానీ దానికన్నా ముఖ్యమైనది అంతః ప్రపంచంలో ఉండే కారణాలను మార్చటం.

మానవుడు చేతన మనస్సు మీద అదుపు సాధించటం ద్వారా ఉపచేతన మనస్సులో ప్రేమ, విశ్వాసం వంటి వాటిని పెంపొందింప చేసి గాంధీజీ లాగా తనలోని మహాత్ముడిని వెలికి తీసుకురాగలడు. లేదా స్వయం నియంత్రణ కోల్పోయి హిట్లర్ లాగా దుర్మార్గుడు కాగలడు.

మానవుని మనస్సు నుండి వెలువడే ఆలోచనలు ఉప చేతన మనస్సులో నిలువ ఉండి అయస్కాంతం లాగా ఇతరుల పాజిటివ్ లేదా నెగటివ్ ఆలోచనల్ని ఆకర్షిస్తాయి. ఉదాహరణకు నేరస్తుల ఆలోచనలు ఎప్పుడూ నెగటివ్ ఆలోచనలను ఆకర్షిస్తూ ఇతర నేరస్తుల సాంగత్యాన్ని కోరుకుంటాయి. మంచి భావాలను పెంపొందించుకొంటే అవి సజ్జన సాంగత్యాన్ని కోరుకుంటాయి.

ఆలోచనలకన్నా భావోద్వేగాలు బలమైనవి. తార్కికమైన ఆలోచనల కన్నా భావోద్వేగ పూరిత ఆలోచనలు ఉప చేతన మనస్సుపై ఎక్కువ ప్రభావం చూపిస్తాయి. బ్రెడ్‌ను తయారు చేయుటానికి ఉపయోగించే ఈస్టులాగా భావోద్వేగాలు ఆలోచనల మీద పనిచేసి కోరికలు, లక్ష్యాలు నెరవేరేటట్లు చేస్తాయి. ఉప చేతన మనస్సు మీద ప్రభావం చూపే ముఖ్య భావోద్వేగాలు క్రింద ఇవ్వబడ్డాయి.

**పాజిటివ్ భావోద్వేగాలు :**

1. కోరిక
2. విశ్వాసం
3. ప్రేమ
4. ఆశ
5. ఉత్సాహం

**నెగటివ్ భావోద్వేగాలు :**

1. భయం
2. ద్వేషం
3. దురాశ
4. కోపం
5. అసూయ

మనం పాజిటివ్ భావోద్వేగాలను పెంపొందింప చేసుకుంటూ నెగటివ్ భావోద్వేగాల ప్రభావాన్ని తగ్గించుకోవాలి.

ఉప చేతన మనస్సు మానవుని పరిమిత శక్తికి భగవంతుని అనంత శక్తికి మధ్య వారధిలా పనిచేస్తుంది. మానవుడు సృష్టిలోని శక్తులను, వనరులను ఉపయోగించుకుని మహత్కార్యాలను సాధించేందుకు ఉపచేతన మనస్సు తోడ్పడుతుంది.

★ ★ ★

## అధ్యాయం - 11

# విశ్వాసం కలిగించే నిర్భయత్వం



'మీరు ఏ విషయానికి భయపడతారని' ప్రశ్నిస్తే అత్యధిక శాతం మనుష్యులు తాము దేనికీ భయపడమని బదులిస్తారు. తమను ఎన్నో భయాలు ప్రభావితం చేస్తున్నాయన్న వాస్తవాన్ని కొద్దిమంది మాత్రమే గుర్తిస్తారు. మనుష్యులు బాల్యం నుండే ఎన్నో భయాల ప్రభావానికి లోనవుతారు. కానీ ఆ భయాలు ఎంత లోతుగా, సూక్ష్మంగా మనసు పొరల్లో గూడు కట్టుకుని ఉంటాయంటే వాటి ఉనికిని కూడా గుర్తించకుండానే చాలా మంది జీవితాన్ని గడిపేస్తారు. ఆ భయాలను గుర్తించి వాటిని అధిగమించటానికి ఎంతో ప్రయత్నం కావాలి.

భయం అనేది ఒక మానసిక స్థితి కాబట్టి దానిని సరి చేసుకోవచ్చు. సాధారణ మానవులు భయపడే వ్యాధుల గురించి వైద్యులు భయపడరు. ఎందుకంటే ఆ వ్యాధుల గురించి వైద్యులకు బాగా తెలిసి ఉంటుంది కాబట్టి. అలాగే భయ కారణాలను తెలుసుకుంటే మనం కూడా భయాలను అధిగమించవచ్చు.

ముఖ్యంగా మూడు రకాల భయ కారణాలున్నాయి.

1. మరణం
2. అపజయం
3. పేదరికం

**1. మరణం :**

తన ప్రస్తుత ఉనికిని పూర్తిగా పోగొట్టుకుని తనకు తెలియని మరొక క్రొత్త స్థితిలోకి తీసుకు వెళ్ళే మరణం గురించి దాదాపు ప్రతి మనిషి భయపడతాడు. ఈ భయం వలననే మనిషి సమస్యలను ఎదుర్కొనకుండా, సాహసాలు చేయకుండా పరిస్థితులతో రాజీపడి పోతుంటాడు. కానీ జ్ఞానులు తాము దేహము, మనస్సు మాత్రమే కాదని తాము నిత్యము, సర్వవ్యాప్తమైన ఆత్మ స్వరూపులమన్న జ్ఞానం కలిగి ఉంటారు.

> మనిషి ఏ విధంగా పాత బట్టలను విడచి కొత్త బట్టలను ధరించుతాడో
> అదే విధంగా ఆత్మ శిధిలమైన శరీరములను వదలి
> క్రొత్త శరీరములను ధరించుతున్నది. (భగవద్గీత 2:22)

ఆత్మను ఆయుధములు ఛేదింపలేవు.
అగ్ని దహింప లేదు.
నీరు తడుపలేదు.
గాలి ఎండింపలేదు (భగవద్గీత 2:23)

అట్టి ఆత్మ ఎల్లకాలములనుండునది
సర్వమును వ్యాపించినది (భగవద్గీత 2:24)

ఇంద్రియములకు గోచరించనట్టి,
మనస్సుచే చింతింప శక్యము కానట్టి,
ఈ ఆత్మ పుట్టుట, పెరుగుట, చావు లేనట్టిది.
ఇది గ్రహించిన నీవు దుఃఖింప తగదు (భగవద్గీత 2:25)

అయితే భగవద్గీత హత్యాకాండను, హింసాకాండను ప్రోత్సహించదనే విషయం గమనించాలి. ధర్మాచరణ కోసమై మానవుడు ప్రాణత్యాగానికి కూడా సిద్ధపడాలని భగవద్గీత బోధిస్తుంది.

మరణ భయానికి ముఖ్యమైన విరుగుడు ఏమిటంటే ఏదైనా సాధించాలన్న దృఢ సంకల్పం మరియు ఇతరులకు సేవ చేయాలన్న తపన. వాటిలో నిమగ్నుడైన వ్యక్తికి మరణం గురించి ఆలోచించే తీరిక కూడా ఉండదు. నిజానికి మరణం మనకు సమయం యొక్క విలువను తెలియచేసి మనం ప్రతి క్షణం జీవితాన్ని అర్థవంతం చేసుకొనేటట్లు స్ఫూర్తినిస్తుంది.

**2. అపజయం :**

ప్రతి మనిషికి అపజయమన్నా, తద్వారా వచ్చే అవమానం, విమర్శలు వంటి వాటి పట్ల భయం ఉంటుంది. ఈ భయం వలన మనిషి అసలు ఏ ప్రయత్నమూ చేయకుండా నిష్క్రియాపరుడుగా ఉండే ప్రమాదం ఉంది. కానీ ప్రతి అపజయమూ తదుపరి విజయానికి మెట్టు అవుతుంది. అందువలన ప్రతి వ్యక్తి జయాపజయాలను సమదృష్టితో చూసే మెలకువ అలవరచుకోవాలి.

కర్మఫలములను గురించి చింతించకుండా
కర్మలను చేయుటయే నీవంతు
కర్మఫలములను నిర్ణయించు అధికారము నాకే వదలివేయుము
నిష్కామముగా కర్మలను ఆచరించుచూనే ఉండుము. (భగవద్గీత 2:47)

'నేను', 'నాది' అను ఆసక్తిని విడచి
కార్యము ఫలించినను, ఫలించకపోయిననూ
సమత్వ బుద్ధితో కర్మలను చేయుము
అదియే యోగమనబడును (భగవద్గీత 2:48)

పై శ్లోకాలకు అర్థం భావోద్వేగాలు లేని మరమనిషిగా ఉండటం కాదు. బాగా మార్కులు సంపాదించిన విద్యార్థి ఆ విజయ గర్వంతో తదుపరి పరీక్షలను నిర్లక్ష్యం చేసే ప్రమాదం ఉంది. మరొక వైపు అపజయం పాలైన విద్యార్థి తాను ఎన్నటికి ఉత్తీర్ణుడు కాలేనని పూర్తిగా క్రుంగి పోవచ్చును కూడా. అతడు ఆత్మహత్యకు పాల్పడటమో లేదా అడ్డదారిలో ఉత్తీర్ణుడవడమో చేయవచ్చును.

కాబట్టి జయాపజయాలు తన మనస్సును తప్పు దోవ పట్టించకుండా ప్రతి విద్యార్థి జాగ్రత్త పడాలి. అదే విధంగా రాజకీయ, వ్యాపార, క్రీడా, కళారంగాల వంటి వాటిలో ఉన్నవారు విజయంతో గర్వించి తప్పటడుగులు వేయకుండా అపజయంతో క్రుంగిపోయి ప్రయత్నాలను విరమించుకోకుండా జయాపజయాలలో సమదృష్టిని అలవరచుకోవాలి.

**" నీ కర్తవ్యాన్ని నీవు నెరవేర్చు. కాని ఫలితాన్ని నిర్ణయించడాన్ని దేవునికి వదలిపెట్టు. నీ పనియొక్క ఫలితాన్ని గురించే ఆలోచిస్తూ కూర్చుంటే అది నీ ఏకాగ్రతను, శక్తిసామర్థ్యాలను పూర్తిగా ఉపయోగించుకోకుండా చేస్తుంది. ఫలితాన్ని గురించి మాత్రమే ఎదురు చూసే వ్యక్తి లక్ష్యాన్ని కాకుండా అడ్డంకులకు మాత్రమే చూస్తుంటాడు. లాభం, అధికారం, ప్రతిష్ట వంటి ఫలితాల కోసం ఆశించకుండా కేవలం తన కర్తవ్యం మీద మాత్రమే దృష్టి నిలిపే వ్యక్తి ఎన్ని అడ్డంకులు ఎదురైనప్పటికి చలించడు. అతడు అన్ని పరీక్షలను తట్టుకుని నిలబడతాడు. – గాంధీజీ."**

న్యాయవాదిగా వృత్తిని కొనసాగిస్తున్నప్పుడే గాంధీజీ తనలో నిద్రాణంగా ఉన్న మానవాతీతశక్తిని వెలికి తీయగలిగారు. తన కోసం తను కాకుండా ఇతరుల కోసం బతకటం ఎప్పుడు ప్రారంభించారో అప్పుడే ఆయన తన ఆత్మశక్తిని గుర్తించగలిగారు. జయాపజయాల ద్వారా వచ్చే ఆందోళనలు, అలసటలు లేకపోవటం వలన తన ఇరవై ఏళ్ళ వయస్సులో కన్నా అరవై ఏళ్ళ వయసులో ఎక్కువ శక్తివంతుడుగా ఉన్నానని చెప్పుకున్నారు.

ఒక పాశ్చాత్య విలేఖరి అడిగాడు "మిస్టర్ గాంధీ మీరు రోజుకు పదహైదు గంటలపాటు గడచిన యాభై ఏళ్ళుగ నిర్విరామంగా పని చేస్తున్నారు కదా? మీకు విశ్రాంతి తీసుకోవాలనిపించటం లేదా?"

గాంధీజీ "ఎందుకు? నేనెల్లప్పుడు విశ్రాంత స్థితిలోనే ఉన్నాను" అని బదులిచ్చారు.

**3. పేదరికం :** దీనిలాగా మరేదీ మనిషికి బాధనూ, అవమానాన్ని కలిగించదు. అందుకే మనుష్యులు పేదరికపు బాధను తప్పించుకోవటానికి, ధనం సంపాదించటానికి ఎన్నో పాట్లు పడుతుంటారు.

మానవుడు తన జీవితావసరాలైన ఆహారం, వస్త్రాలు, గృహం మొదలైనవి సమకూర్చుకోవటానికి కావలసిన ధనం సంపాదించుకోవాల్సిందే. ధనం అనేది చెడ్డది కాదు. కేవలం ధన సంపాదన కోసమే బ్రతకటమనేది, తప్పుడు మార్గాల్లో సంపాదించడం అనేది చెడ్డ విషయం.

ఆశలేని వాడును,
ఇంద్రియములను మనస్సును
నిగ్రహించిన వాడును,
ఏ వస్తువును పరిగ్రహింపని వాడును అయిన మానవుడు
కర్మలను చేసినను పాపము అంటదు (భగవద్గీత 4:21)

**"భగవద్గీత బోధించిన అపరిగ్రహం నేనెలా అలవరచుకోగలను? నేను, నాది అనేవన్నీ వదిలేసి భగవంతుని అనుసరించాలా? నేను ఇంగ్లీషులో చదువుకున్న న్యాయ విద్య నాకు ఉపకరించింది. నాకు సమాధానం వెంటనే దొరికింది.**

**ఒక ధర్మకర్త (ట్రస్టీ) తన ఆధీనంలో ఎంత ధనం ఉన్నప్పటికీ అది తన స్వంతం కాదనీ, దానిని ఇతరుల మేలుకోసం ఉపయోగించాలని గ్రహిస్తాడు. అలాగే మోక్షగాములు కూడా ఎంత సంపద ఉన్నప్పటికీ దానిని ఇతరుల మేలు కోసం ఉపయోగించే ధర్మకర్తల లాగా ఉండాలి.**

**నీ గురించి నువ్వు చింతించటం మాని నీ యోగక్షేమాలను భగవంతునికి వదలిపెట్టు. ఈ విషయం ఎవరినీ భయపెట్టవలసిన అవసరం లేదు. నాకు తెలిసినంతవరకు అన్ని మతాలు చెప్పేదిదే. ఎవరైతే తమ జీవితం పట్ల నిశ్చింతగా ఉండి సేవా ధృక్పథంతో ఉంటారో, వారే భగవంతుని యందు నిజమైన విశ్వాసం కలిగి ఉంటారు.**

**మానవుడు తనకు అవసరంలేని వాటిని తిరస్కరించినట్లే తనకు అవసరం లేనివాటిని కూడబెట్టకూడదు. ఉదాహరణకు ఒక కుర్చీ అవసరం లేదనుకుంటే అది లేకుండానే గడపాలి. అవసరానికి మించి ఒక మెతుకు కూడా తినకూడదు. ఆ విధంగా క్రమేపీ మనిషి తన జీవితాన్ని వీలైనంత సరళంగా గడపాలి" – గాంధీజీ.**

ఇక్కడ గమనించవలసిన విషయం పేదరికాన్ని కోరి ఆహ్వానించడమో లేక ధనాన్ని సంపాదించకుండా సోమరిగా గడపటం కాదు. తాను సాధింపదలచిన పనులలో నిమగ్నుడైన మానవునికి కావలసిన సహాయం భగవంతుడే అందిస్తాడనే విశ్వాసం ముఖ్యం. గాంధీజీ ఆశ్రమ నిర్వహణకు అవసరమైన ధనం అకస్మాత్తుగా ఊహించని విధంగా ఎందరి ద్వారానో సమకూరేది. స్వాతంత్ర్య పోరాటానికి కావలసిన నిధులకోసం కూడా ఎందరో తమ భూములను, బంగారాన్ని, ధనాన్ని ఇచ్చేసేవారు.

భగవంతుని పై పరిపూర్ణ విశ్వాసం కలవాడికి మరణం పట్ల భయంగానీ, అపజయం పొందుతానన్న భయంగానీ, ధనం లేకపోవటం వలన జీవితం గడవదేమోనన్న భయంకానీ ఉండవు. అతడు నిర్భయంగా లక్ష్య సాధనలో నిమగ్నుడవుతాడు.

★ ★ ★

# అధ్యాయం - 12
# కృషితో నాస్తి దుర్భిక్షం



"నేను చేసిన కృషితో పాటు భగవంతునిపై నేను చూపిన విశ్వాసం కలిగిన మరే ఇతర వ్యక్తి అయినా నాలాగే విజయం సాధించగలరనే విషయంలో నాకు ఏ మాత్రం సందేహం లేదు" – గాంధీజీ.

'కృషితో నాస్తి దుర్భిక్షమ్' అని పెద్దలమాట. కానీ ఎన్నో ఏళ్ళుగా గూడు కట్టుకుని ఉన్న అలవాట్లు అంత త్వరగా తొలగిపోవు. ఎవరైతే తన మనస్సును జయిస్తారో వారికి మనస్సే గొప్ప నేస్తం! ఎవరైతే మనస్సుకి లొంగిపోతారో వారికి మనస్సే గొప్ప శత్రువు.

మనిషి అపజయం చెందటానికి గల కారణాలలో ముఖ్యమైనది ఏమిటంటే చిన్న ఓటమి ఎదురైన వెంటనే తన ప్రయతాన్ని విరమించుకోవటం!

గాంధీజీ కూడా తన ప్రయత్నాలలో ఎన్నోసార్లు అపజయం పొందారు. బ్రహ్మచర్య సాధనలో భాగంగా ఆయన చేసిన ప్రయోగాలు అపార్థాలకు, విమర్శలకు దారి తీశాయి. ఖిలాఫత్ ఉద్యమాన్ని భారత స్వాతంత్ర పోరాటానికి అన్వయించటంలోను, అహింసా పోరాటం చౌరీ చౌరా వంటి చోట్ల హింసాయుతంగా మారటంలోనూ ఉద్యమం దారి తప్పింది. కానీ ఆయన తన వైఫల్యాల నుండి పాఠాలు నేర్చుకుంటూ ముందుకు సాగారు.

కొందరు మనుష్యులకు ఉండే మరో లోపమేమిటంటే ప్రతి విషయాన్ని, సమస్యను, వ్యక్తులనూ తమ తమ పరిమితుల ఆధారంగా కొలవటం! తమ అజ్ఞానం, మూఢనమ్మకాల వంటి వాటి కారణంగా తమ ప్రమాణాలే లోక ప్రమాణాలుగా, తమ పరిమితులే లోకులందరికి పరిమితులను అనుకుంటారు.

అహింసా పోరాటాన్ని నమ్మని ఒకానొక చరిత్రకారుడు గాంధీజీని ఈ విధంగా అడిగాడు "గాంధీజీ! మీకు భగవద్గీత గురించి క్షుణ్ణంగా తెలిసి ఉండవచ్చు. కానీ చరిత్ర గురించి ఏమీ తెలిసినట్లు లేదు. ఇంతవరకూ ఏ దేశమూ హింస లేకుండా స్వాతంత్ర్యం సంపాదించలేదు".

గాంధీజీ చిరునవ్వుతో "చరిత్ర గురించి మీరు మొదట తెలుసుకోవాల్సింది ఏమిటంటే ఇంతకు ముందు జరగనిది ఇకముందు కూడా జరగబోదని అర్థం కాదు" అన్నారు.

గాంధీజీ జీవితంలోని ముఖ్య ఘట్టాలు క్రింద పేర్కొనబడ్డాయి.

1. 1881 – 91 – ఇంగ్లాండులో బారిస్టర్ డిగ్రీ విద్యాభ్యాసం
2. 1893 దక్షిణ ఆఫ్రికాకు పయనం మరియు భారతీయుల సమానత్వ హక్కులకోసం పోరాటం
3. 1915 – భారతదేశంలో స్థిరనివాసం

4. 1919 – అమృతసర్‌లో జనరల్ డయ్యర్ జరిపిన ఊచకోతకు నిరసనగా సహాయ నిరాకరణ పోరాటం ప్రారంభం

5. 1922 – రాజద్రోహ నేరంపై ఆరు సంవత్సరాల కారాగార శిక్ష

6. 1930 – ఉప్పు అమ్మకంపై పన్నుకు నిరసనగా దండి సముద్రతీరంలో ఉప్పు సత్యాగ్రహం

7. 1931 – భారతీయ స్వపరిపాలన కోరుతూ లండన్ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనటం

8. 1942 – క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభం

9. 1947 – ఆగస్టు 15 – భారతదేశ స్వాతంత్రం, దేశ విభజన, మత కల్లోల ప్రాంతాలలో పర్యటన, నిరాహార దీక్ష

10. 1948 – జనవరి 30 గాంధీజీ హత్య

విజయం గురించే ఆలోచించే వారికి విజయం లభిస్తుంది. అపజయం గురించే ఆలోచించే వారికి అపజయం లభిస్తుంది. మన ఉపచేతన మనస్సు మనం మెలకువగా ఉన్నా నిద్రిస్తూ ఉన్నా పనిచేస్తూనే ఉంటుంది. ఈ పుస్తకంలోని సూత్రాలను కేవలం అప్పుడప్పుడు మాత్రమే తలచుకుంటే ఉపయోగం ఉండదు. ఈ సూత్రాలన్నింటిని పాటించడం ఒక జీవన విధానంగా మార్చుకోవాలి.

**కృషి లేకపోవటం యొక్క లక్షణాలు**

1. కుంటి సాకులతో పనిని వాయిదాలు వేయటం
2. అడ్డదారులను, దగ్గర దారులను వెతకటం
3. మనకు ఏది కావాలో తేల్చుకోక పోవటం
4. కావాల్సిన జ్ఞానాన్ని సంపాదించటంలో నిరాసక్తత
5. అపజయం పొందితే ఎవరు విమర్శిస్తారో అన్న భయంతో పనిచేయకుండా ఉండటం

కానీ అధైర్య పడాల్సిన అవసరం లేదు. కృషి చేయటం అనేది ఒక మానసిక స్థితి కాబట్టి దానిని క్రింది పద్ధతుల ద్వారా సులువుగా అలవరచుకోవచ్చు.

1. విశ్వ హృదయం సూత్రం ద్వారా మనతో భావస్వారూప్యం ఉన్న వ్యక్తులతో తరచూ కలవటం.

2. ఒక పనిని సాధించాలనుకుని నిశ్చయించుకుని దానిని వ్రాత పూర్వకంగా ఉంచుకోవటం.

3. ప్రణాళికలను ఆచరణలోకి తీసుకురావటం.

4. ఇతరుల నెగటివ్ ప్రభావాలు లేకుండా మనసును ధృఢ పరచుకోవటం.

5. ప్రతిరోజూ ఆత్మ పరిశీలన చేసుకొంటూ లక్ష్య సాధన వైపు అడుగులు వేస్తున్నామా అని ప్రశ్నించుకోవటం.

★ ★ ★

# రెండవ భాగం

# ఆధ్యాత్మిక విజయం

ఒకానొక బాలునికి జీవితానికి పరమార్థం ఏమిటన్న జిజ్ఞాస కలిగింది. ఆ ప్రశ్నకు సమాధానాన్ని అన్వేషిస్తూ ఎన్నో రోజులు ఎన్నో ప్రాంతాలలో తిరుగాడి చివరకు ఒక పర్వత శిఖరాన్ని చేరుకున్నాడు. ఆ పర్వత శిఖరం పైనున్న రాజప్రాసాదంలో ఉండే వ్యక్తి గొప్ప జ్ఞాని అనీ, అతను బాలుడి ప్రశ్నకు సమాధానమివ్వగలడని మార్గంలో కొందరు సలహా ఇచ్చారు.

ఆ రాజప్రాసాదంలోని మొదటి గదిలోకి అడుగు పెట్టగానే బాలుడికి జుత్తు నెరశిన ఒక కాషాయంబరధారికి బదులుగా అందమైన వస్త్రాలు, ఆభరణాలు, ఆయుధాలు ధరించిన ఒక తేజో రూపుడైన జ్ఞాని కనిపించాడు. ఆ గది వస్తూ పోతూ ఉన్న సందర్శకులతో కళకళలాడుతూ ఉంది. ఒకవైపు చెవులకు ఇంపైన సంగీతం మంద్రస్వరంలో వినిపిస్తుండగా మరొకవైపు బల్లలపై కమ్మని వాసనలతో నోరూరించే తిను బండారాలు ఉన్నాయి. జ్ఞాని సందర్శకులకు ఆతిధ్యం ఇస్తూ, సంభాషిస్తూ తీరిక లేకుండా ఉన్నాడు. బాలుడు తన వంతు వచ్చే వరకు కొన్ని గంటల పాటు వేచి వుండక తప్పలేదు.

కొంత సేపటి తరువాత జ్ఞాని బాలుని సాధరంగా ఆహ్వానించి అతని ప్రశ్నను శ్రద్ధగా విన్నాడు. అయితే ఆ ప్రశ్నకు వెంటనే సమాధానం ఇవ్వటానికి సమయం సరిపోదని ఆలోగా బాలుడు రాజప్రాసాదం మొత్తం సందర్శించి మూడు గంటల్లోగా తిరిగి రావాలని ఆదేశించాడు. "అయితే ఒక ముఖ్యమైన షరతు ఏమిటంటే ఈ దీపం ఆరిపోకుండా చూసుకొమ్మ"ని చెప్పి జ్ఞాని బాలుడి చేతికి ఒక దీపాన్ని ఇచ్చి పంపించాడు.

బాలుడు దీపం ఆరిపోకుండా చేతులను అడ్డం పెట్టుకొని రాజప్రాసాదంలోని ఎన్నో గదులను కలయ తిరుగుతూ మూడు గంటల తరువాత తిరిగి జ్ఞానిని కలిసాడు. జ్ఞాని బాలుని చిరునవ్వుతో చూసి "నా సమాలోచన మందిరంలోని అందమైన విగ్రహాలను చూసినావా? ఉద్యానవనంలోని అరుదైన వృక్షజాతులను, పశు పక్ష్యాదులను చూసినావా?" అని అడిగాడు.

బాలుడు సిగ్గుతో తలవంచుకొని వాటిని ఏమాత్రం గమనించలేదని తన మనస్సు, దృష్టి రెండూ దీపం ఆరిపోకుండా ఉండటంపైనే లగ్నం అయిందని

ఒప్పుకొన్నాడు. "అయితే తిరిగి వెళ్ళి వాటన్నింటిని బాగా గమనించు. ఒక గృహస్థు యొక్క గృహాన్ని, అతని కళాప్రియత్వాన్ని అభినందించటం అతిథి పాటించవలసిన మర్యాద" అని జ్ఞాని చెప్పాడు.

బాలుడు దీపాన్ని తీసుకొని తిరిగి రాజప్రాసాదాన్ని సందర్శించడం ప్రారంభించాడు. గదులలోని గోడలపైన, పై కప్పుల మీద ఉన్న కళాత్మక చిత్రాలను, ఉద్యానవనాలను, తటాకాలను, దాస దాసీ జనాన్ని చూస్తూ ఆనందించాడు.

తిరిగి వచ్చి జ్ఞానిని కలిసిన బాలుడు తన హర్షాతిరేకాలను తెలియచేస్తూ జ్ఞాని యొక్క కళాప్రియత్వాన్ని అభినందించాడు. జ్ఞాని "కానీ నేను ఇచ్చిన దీపం వెలగటంలేదే" మని అడిగాడు. దీపం వైపు చూసిన బాలుడు అందులోని నిప్పు ఆరిపోయి ఉండటం చూసి దిగ్భ్రాంతుడయ్యాడు.

"జీవిత పరమార్థం ఏమిటంటే దీపంలోని వెలుగు ఆరిపోకుండా చూసుకొంటూనే ఈ సృష్టిలోని అందాలను, అద్భుతాలను ఆస్వాదించటమే" అని జ్ఞాని బాలుడికి బోధించాడు.

విషయసౌలభ్యం కోసం మనం జీవిత పరమార్థాన్ని ధర్మ, అర్థ, కామ, మోక్షాలనే నాలుగు విభాగాలుగా విభజించవచ్చును. ధర్మ బద్ధంగా జీవించడం, జీవనానికి అవసరమైన ధనాన్ని సంపాధించడం, ధర్మబద్ధమైన (సంతానేచ్ఛ) వంటి కోరికలను తీర్చుకోవడం, మోక్షాన్ని అన్వేషించడం – ఈ నాలుగు మానవ జీవితంలోని ముఖ్య భాగాలు. వీటిలో అతి ముఖ్యమైనది మోక్షాన్వేషణ.

అయితే ఈ నాలుగు విభాగాలు ఒక వరుసలో కాకుండా ఏ క్రమంలోనైనా ఒకదానిలో ఒకటి అంతర్భాగంగా ఉంటాయి. ఉదాహరణకు మనం ధర్మాన్ని అతిక్రమించకుండా కోరికలను తీర్చుకోవడం వంటివి చేయాలి. అలాగే మోక్షాన్ని పొందిన తరువాత కూడా ధర్మబద్ధంగా ధనాన్ని సంపాదించడం, ధర్మబద్ధమైన కోరికలను తీర్చుకోవటం వంటివి చేయాల్సి ఉంటుంది.

ప్రతి విద్యార్థి తన విద్యాభ్యాస సమయంలో ధర్మ సూక్ష్మాలను గ్రహించి వాటిని జీవితమంతా ఆచరించాలి. ఉదాహరణకు పరీక్షలలో వక్ర మార్గాలలో ఉత్తీర్ణులు కావటం, అడ్డ త్రోవల్లో ఉద్యోగాలను సంపాదించడం, ప్రజలను లంచాల కోసం పీడించడం వంటివి ధర్మ విరుద్ధమైనవి. అలా కాక 'మానవ

సేవయే మాధవ సేవ' అని మనసారా నమ్మి, చేసే ప్రతి పనిలోను పూర్తిగా లీనం కావటం ధర్మబద్ధమైనది.

మోక్షమంటే ఎన్నడో మరణానంతరం సంభవించేది కాదు. దాన్ని ఈ జన్మలోనే, దేహమున్నప్పుడే సాధించాలి. వాస్తవానికి ఆత్మ దృష్ట్యా మనమెన్నడూ భగవంతుని నుండి నేరుగా లేము. అయితే అహం (నేను అన్న భావన) వలన మనం ఈ దేహానికి, మనస్సుకు బందీలమై భగవంతుని నుండి వేరు వ్యక్తులుగా భావించుకొంటున్నాము.

ఈ పుస్తకంలోని మొదటి భాగం భౌతిక విజయానికి అవసరమైన సూత్రాలను తెలియ చేస్తుంది. మానవుడు తన కనీస అవసరాలైన ఆహారం, గృహం, దుస్తులు వంటివి సమకూరినప్పుడే అంతకంటే ముఖ్యమైన వాటి గురించి ఆలోచించగలడు. కాబట్టి భౌతిక విజయం అత్యవసరం. అయితే ఆధ్యాత్మిక ఆలంబన లేని భౌతిక విజయాలు పేక మేడల్లాగా కూలిపోయి మానవుడిని నిరాశా నిస్పృహల్లో కూరుకుని పోయేలా చేస్తాయి. కనుక ఆధ్యాత్మిక ఆలంబనతో కూడిన భౌతిక విజయమే సరియైనది.

కానీ మానవులలో అత్యధికులకు ఆధ్యాత్మిక సాధనలకు తగిన తరుణం ఎన్నడనే సందేహం కలుగుతుంది.

బాల్యమంతా అజ్ఞానంలోనూ, ఆట పాటల్లోనూ గడిచి పోతుంది. యవ్వనమంతా సుఖ లాలసలతోనూ, ధనాన్వేషణతోను గడిచి పోతుంది. వృద్ధాప్యమంతా గతాన్ని తలచుకొని బాధపడటంలోనూ, పిల్లల గురించి ఆందోళనతోను, రోగాలతోను, శారీరక మానసిక శక్తులు ఉడిగి పోవడంతోను గడిచి పోతుంది.

సాధారణంగా మానవులు ముందుగా భౌతిక విజయాలను సాధించి ఆధ్యాత్మిక సాధనలను జీవితపు చివరి దశకు వాయిదా వేయవచ్చునుకొంటారు. అయితే ఆ విధంగా ఆలోచించడంలో మూడు లోపాలు ఉన్నాయి.

1. మనమెంత కాలం జీవిస్తామన్నది మనకు ఖచ్చితంగా తెలియదు. ఏ క్షణమైనా జీవితపు ఆఖరి క్షణం కావచ్చును.


2. చిరకాలం భౌతిక సుఖాలలో నిమగ్నుడైన వ్యక్తికి వాటిని అధిగమించి ఆధ్యాత్మిక జీవితంలోకి అడుగు పెట్టటం చాలా కష్టం.

3. వృద్ధాప్యంలో శరీరం, మనస్సు రెండూ బలహీనపడి ఆధ్యాత్మిక సాధనలకు సహకరించవు.

కనుక ఆధ్యాత్మిక సాధనలకు తగిన తరుణం ఇప్పుడే.

★ ★ ★

# అధ్యాయం - 13
# సృష్టి పరిణామ క్రమం



మనల్ని అధోముఖంవైపు లాగే గత జన్మలకు సంబంధించిన జంతు ప్రవృత్తికి మనల్ని ఊర్ధ్వముఖంవైపు నడిపించే దైవిక స్వభావానికి మధ్య జరిగే సంఘర్షణే జీవితం.

గాంధీజీ లండన్‌లో న్యాయ విద్య ముగించుకుని వచ్చిన తర్వాత మొదట తన అభిప్రాయాలను భార్య కస్తూర్బా మీద ప్రయోగించాలని చూసారు.

అయితే కస్తూర్బా తనదైన వ్యక్తిత్వం కల మనిషి. దాంతో వారిద్దరి మధ్య బేధాభిప్రాయాలు తలెత్తసాగాయి. కొన్నిసార్లు కస్తూర్బా కన్నీళ్ళు పెట్టుకోవటం అది ఆయనకు మరింత కోప కారణమయిన సందర్భాలు కూడా ఉన్నాయి.

ఒకసారి గాంధీజీ విసిగి పోయి "నా ఇంట్లో నువ్విలా చేయటానికి వీల్లేదు" అని అరిచారు

"అయితే మీ ఇంటిని మీరే ఉంచుకుని నన్ను నాదారిన పోనివ్వండి" అని కస్తూర్బా అన్నారు. పట్టరాని కోపంతో గాంధీజీ ఆమెను ఇంటి వెలుపలకు నెట్టి తలుపులు మూసుకున్నారు.

కస్తూర్బా "నేనెక్కడకు వెళ్ళగలను. నాకు వేరే ఇల్లేదీ లేదు. కేవలం మీ భార్యనయినందున మీ దౌర్జన్యాన్ని సహిస్తూ ఉండాలా? దయచేసి తలుపు తీయండి" అని ఏడ్చేశారు.

ఆ సమయంలో భర్తగా తన అభిప్రాయాలను భార్యపై రుద్దే హక్కు తనకుందని గాంధీజీ తలచారు. కాలక్రమేణా తాను భార్యను ఎంత వేదనకు గురి చేస్తున్నదీ ఆయన గుర్తించారు. తన హక్కులను ఇతరుల మీద రుద్దటం కన్నా ముందు తన బాధ్యతల గురించి ఆలోచించాలనుకున్నారు.

ఈ విషయం గుర్తించిన వెంటనే తన అభిప్రాయాలను కస్తూర్బా మీద రుద్దటం మానివేసి తాను నమ్మిన సూత్రాలు, విలువల ఆధారంగా జీవించసాగారు. ఆ విధంగా గాంధీజీ ఆమె కొక ఉదాహరణగా, మార్గదర్శిగా మారసాగారు. అది ఒక కష్టసాధ్యమైన ప్రయోగం. ఆయన తన ఇష్టాయిష్టాలను తన దృక్పధం నుండి కాకుండా భార్య దృక్పధం నుండి చూడసాగారు.

క్రమేపీ గాంధీజీకి అర్ధమైనదేమిటంటే నిజానికి తమ మధ్య ఏమీ ఘర్షణ లేదు, కస్తూర్బా తన ప్రేమతో తనను గెలుస్తూ ఉన్నారని. ఆమె తమ ఆవేశ ద్వేషాలు వైవాహిక జీవితాన్ని దెబ్బతీయకుండా మృదువుగా గాంధీజీకి ఎప్పుడేది అవసరమో అప్పుడది సమకూరుస్తూనే ఉన్నారు.

తన జీవితాన్నే ఒక ప్రయోగశాలగా మార్చుకున్న గాంధీజీ కనుగొన్న గొప్ప సత్యాలలో ఒకటి, ఇతరులను మార్చాలనుకుంటే ముందు మనం మారాలి.

కాలక్రమేణా ఆయన తాను ఏవైతే సిద్ధాంతాలను పుస్తక పఠనం ద్వారా తెలుసుకుంటున్నాడో అవి కస్తూర్బా ఆచరణాత్మకంగా పాటిస్తూ ఉందని గ్రహించారు. ఆనాటి నుండి వారు ఒకరికొకరు గురువులుగా మారారు. గాంధీజీ ఆమె నుండి సహనం, ప్రేమ తదితర సుగుణాలను నేర్చుకుని తన సుగుణాలను ఆమెకు నేర్పసాగారు.

ఈ ప్రయోగాన్ని ఆయన సముద్రాన్ని టీ కప్పుతో ఖాళీ చేయటంగా పోల్చారు. ఈ ప్రయోగంలో వారివురూ తమ అడ్డంకులను క్రమేపీ తొలగించుకొని ఒకరిమీద ఒకరు ప్రేమను పెంచుకోవటంతో పాటు ఇతరులందరి పై ప్రేమ పెంచుకోగలిగారు. గాంధీజీ తన ప్రేమశక్తితో రాజకీయ ప్రత్యర్థులను గెలవటం ప్రారంభించేసరికి కస్తూర్బా కూడా చెరసాలలో ఉండి మహిళలకు నాయకత్వం వహించసాగారు.

మీరు ఈ పుస్తకంలోని సూత్రాలను ఆచరించటం ప్రారంభించినప్పటి నుండి ఇతరులలో మీపట్ల మార్పును గమనించవచ్చును. ముఖ్యంగా ఇంటా, బయటా తోటి వారు మీలోని మార్పును హర్షించలేకపోవచ్చును, ఒకప్పుటి మీరు చాలా చెడ్డవారయినప్పటికీ.

అలా ఎందుకు జరుగుతుందంటే మీ తోటివారు మీతో ఒకే విధంగా వ్యవహరించటానికి అలవాటు పడ్డారు. ఇప్పుడు ఆ అలవాటుకి భిన్నంగా వ్యవహరించవలసి వచ్చేసరికి వారికి ఎంతో ఇబ్బంది కలుగవచ్చును. ఆ విషయం మీ కర్థమైనప్పటికి ఇతరులు మీలో మంచి మార్పులను ప్రతిఘటించటం మీకు బాధనే కలిగించవచ్చును. మరి యొక కారణమేమంటే మీ శ్రేయోభిలాషులు మీ క్షేమాన్ని కోరుకుంటారు. కాబట్టి మీరు 'తెలిసిన" ప్రపంచం నుండి "తెలియని" ప్రపంచంలోకి వెళ్ళటం గురించి సహజంగానే భయపడతారు. మీ మానసిక స్థితిని గురించి ఆందోళన చెందవచ్చును కూడా.

**ముఖ్యమైన కొన్ని మార్పు లక్షణాలు :**

1. అకస్మాత్తుగా జ్ఞానదాహం పెరిగి పుస్తకాలు చదవటం
2. సమయాన్ని పట్టించుకోకుండా పరధ్యానంలో ఉండటం
3. ఉదార స్వభావులుగా మారటం
4. మునుపటి పద్ధతులను, పరిమితులను తిరస్కరించటం

5. పసిపిల్లల వలె ప్రపంచాన్ని చూసి ఆనందించటం

ఈ లక్షణాల కోసం ప్రాకులాడవలసిన అవసరం లేదు. అవి కేవలం మీలో మార్పు సంభవిస్తూ ఉందన్న నిదర్శనం మాత్రమే. ముఖ్యంగా గమనించవలసిన విషయం ఏమిటంటే మీలోని మార్పును అర్థం చేసుకోగల మానసిక పరిణతి అందరికీ ఉండకపోవచ్చు. ఒకవేళ ఈ పుస్తకం మీ బంధు మిత్రులకు ఉపయోగ పడుతుందనుకుంటే వారికి కానుకగా ఇవ్వవచ్చు. వారికి సహాయం చేయటం ద్వారా మీరు నివసించే ఈ సమాజాన్ని మెరుగుపరచి మీకు మీరే సహాయం చేసుకున్న వారవుతారు.

'జంతూనాం నరజన్మ దుర్లభం' అని పెద్దల మాట. ఆలోచనా శక్తితో యుక్తాయుక్త విచక్షణ కలిగి ఉండటమే మానవులను ఇతర జంతువుల నుండి వేరు చేస్తున్నది. జంతువులకు మంచీ-చెడు, పుణ్యము-పాపము, నేరము-శిక్ష వంటి విచక్షణ లేక ప్రకృతి సహజాతాలైన ఆహార, నిద్రా, మైధునాలకు లోబడి ఉంటాయి.

అయితే మానవుడు తన ఆలోచనలను నియంత్రించడం ద్వారా ప్రకృతి సహజాతాలైన ఆహార, నిద్రా, మైధునాలను అదుపులో పెట్టుకోగలడు. ఆ విధంగా జంతువుల కన్నా మెరుగైన జన్మను పొందిన మానవునికి అసలు జీవితం యొక్క పరమార్ధం ఏమిటన్న సందేహం జీవిత కాలంలో ఏదో ఒక నాడు కలగవచ్చును.

మనలో చాలామంది పంచేంద్రియాలకు సంబంధించిన బాహ్య ప్రపంచంలోనే కాలం గడుపుతాము. పంచేంద్రియాలకు అతీతమైన అంతః ప్రపంచం గురించి మనలో చాలా మంది ఏమాత్రమూ ఆలోచించము. మనకు తెలిసిన ప్రపంచం నుండి తెలియని ప్రపంచంలోకి ప్రవేశించడమెందుకనే సందేహం కూడా మనకు రావచ్చును.

అయితే ప్రతి యుగంలోను తమకు తెలియని ప్రపంచాన్ని అన్వేషించే సాహసికులు ఎందరో ఉన్నారు. ఎవరెస్ట్ పర్వతాన్ని గురించి ఒక సాహసికుడు ఇలా వ్యాఖ్యానించాడు. "నేను ఆ పర్వతాన్ని అధిరోహించాల్సిందే, ఎందుకంటే అది ఉంది కాబట్టి!" ఆవిధంగా పర్వతాలను, సముద్రాలను, ఖగోళాన్ని అన్వేషించే వారిలాగే మానవ మష్కిస్తాన్ని అన్వేషించి పరిశోధించే సాహసికులెందరో!

సాధారణ మానవులందరూ ఉరుకుల పరుగుల జీవితంలో తీరిక లేకుండా గడుపుతుంటే ఆ సాహసికులు మాత్రం ఏ అరణ్యాలకో లేక హిమాలయాలకో వెళ్ళిపోతారు.

కాలక్రమంలో వారు మన స్మృతిపథంలో నుండి తొలగిపోతారు. కానీ అద్భుత ద్వీపాలను సందర్శించి ఫోటోలు, వీడియోలు పంపే మిత్రులలాగా ఈ సాహసికులుకూడా అప్పుడప్పుడు తాము దర్శించిన వింతలను మనకు తెలియచేస్తుంటారు. "ఈ ప్రదేశం ఎంత అందంగా ఉందో చూడు! నువ్విక్కడ నాతో పాటు ఉంటే ఎంత బాగుండేది'' వంటి వర్ణనలతో మనను ఉత్తేజపరుస్తుంటారు.

ఆ విధంగా తపోభూమి నుండి మహర్షి వేదవ్యాసులవారు మనకు అందించినదే 'భగవద్గీత'. అది మనకు మనో ప్రపంచంలోనే కాక బాహ్య ప్రపంచంలో కూడా శిఖరాగ్రాలను చేరటానికి ఒక మార్గదర్శిగా ఉపకరిస్తుంది. వివిధ మార్గాల (యోగాల)కు సంబంధించిన వివరాలతో పాటు, ఆ మార్గాలలో వెళితే కలిగే ప్రయోజనాలు, ప్రమాదాలతో పాటు మనం తీసుకొని వెళ్ళవలసిన వస్తు సామగ్రి, విడచిపెట్టవలసిన వస్తు సామగ్రిని గురించి తెలియచేస్తుంది.

మహాభారత ఇతిహాసం ప్రకారం దుర్యోధనాది సోదరులు ద్వేషంతో, అసూయతో తమ దాయాదులైన పాండవుల రాజ్యం అపహరించారు. వారితో పోరాడలేక పాండవులలో ఒకడైన అర్జునుడు అస్త్ర సన్యాసం చేసినప్పుడు భగవద్గీత ద్వారా కృష్ణుడతడికి కర్తవ్య బోధ చేసి యుద్ధోన్ముఖుడిగా చేసినట్లు చెప్పబడుతుంది. భగవద్గీత అనగా భగవంతుని గానం. భగవద్గీతకు "బ్రహ్మవిద్యా ఉపనిషత్" అనే మరో పేరు కూడా ఉంది. 'బ్రహ్మవిద్య' అంటే అత్యున్నత శాస్త్రం. 'ఉపనిషత్' అంటే గురువు వద్ద నేర్చుకునేది.

ప్రతి మానవుని మనస్సులో సుగుణాలకు దుర్గుణాలకు మధ్య జరిగే నిరంతర ఘర్షణకు ప్రతీకగా మహాభారతాన్ని అభివర్ణించవచ్చును. ఆ కోణంలో చూసినప్పుడు భగవద్గీతను కేవలం కృష్ణార్జునుల మధ్య జరిగే బాహ్య సంవాదంగా మాత్రమే పరిగణించలేము. నిజానికది ధర్మసందేహాల గురించి మన బుద్ధికి, మన హృదయంలో అంతర్యామిగా, అంతర్వాణిగా ఉన్న భగవంతునికి మధ్య జరిగే దివ్య సంవాదమే!


కనుక భగవద్గీతను సరిగా అర్థం చేసుకోవాలంటే అర్జునుడిని మన ego (అహం)కు ప్రతినిధిగాను, కృష్ణుడిని కేవలం మానవరూపునిగా కాక మన హృదయంలో అంతర్యామిగా ఉన్న భగవంతునిగాను అన్వయించుకోవాలి. "నేను", "నన్ను", "నా" వంటి పదాలను మన హృదయంలో అంతర్యామియైన భగవంతునికి పర్యాయపదాలుగా అన్వయించుకోవాలి.

ఉదాహరణకు కృష్ణుడు “నన్నే స్మరించు, ప్రేమించు, సేవించు” అన్నప్పుడు మనం మన ego (అహం)కు లోబడక మనలో చైతన్యశక్తిగా, సత్యరూపంగా వెలుగొందుతున్న అంతరాత్మ ప్రబోధానికి కట్టుబడాలని గ్రహించాలి. కృష్ణుడు “అన్ని ధర్మాలను త్యజించి నన్నే శరణాగతి కోరు” అన్నప్పుడు మనలో అంతర్యామిగా ఉన్న సత్యంను మించిన దైవంగానీ, మతం గానీ, మార్గం గానీ లేదని గ్రహించాలి.

భగవద్గీతను అర్థం చేసుకోవడానికి మరొక ఆధారం ఏమిటంటే ఇది దేవునికి మానవునికి మధ్య జరిగిన సంస్కృత సంభాషణ కాక అర్జునుడి హృదయాంతరాళంలో ఇంద్రియాతీతమైన స్థితిలో కలిగిన జ్ఞానోదయంగా గ్రహించాలి.

★ ★ ★

# అధ్యాయం - 14
# మాయ, భగవంతుని దివ్య లీల



ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే
(ఓం, అది పూర్ణం ఇది పూర్ణం, పూర్ణం నుండి పూర్ణం ఉద్భవిస్తుంది)
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే
(పూర్ణము నుండి పూర్ణమును తీసివేస్తే పూర్ణమే మిగులుతుంది)
ఓం శాంతిః శాంతిః శాంతిః
ఓం శూన్యమదః శూన్యమిదం శూన్యాత్ శూన్యముదచ్యతే
(ఓం, అది శూన్యం ఇది శూన్యం, శూన్యం నుండి శూన్యం ఉద్భవిస్తుంది)
శూన్యస్య శూన్యమాదాయ శూన్యమేవావశిష్యతే
(శూన్యము నుండి శూన్యమును తీసివేస్తే శూన్యమే మిగులుతుంది)
ఓం శాంతిః శాంతిః శాంతిః

**“ నేను సాధించదలచుకున్నదీ, గత ముప్పై సంవత్సరాలుగా నేను తపిస్తున్నదీ దేని కోసమంటే – మోక్షం కోసం, ఆత్మ సాక్షాత్కారం కోసం, భగవంతుని సందర్శించడం కోసం! ఆ లక్ష్య సాధనలో ఎంతటి త్యాగమైనా, ఎంతటి కఠోర శ్రమయైనా నాదృష్టిలో అత్యల్పమైనది. నా జీవితంలోని కార్య కలాపాలన్నీ – రాజకీయాలు కానీ, సంఘ సేవ కానీ, నియమ నిష్ఠలు కానీ – అన్నీ ఆ లక్ష్య సాధన కోసం సాగుతున్నవే” – గాంధీజీ.**

జీవితమనే కాల పరీక్షలో నెగ్గటానికి ధర్మ, అర్థ, కామ, మోక్షాలనే నాలుగు లక్ష్యాలు వివరించబడ్డాయి. అయినప్పటికీ వాటిని సాధించటంలో అత్యధికులు పరాజితులుగానే మిగిలి పోతున్నారెందుకు?

ఋషులు ఈ సృష్టినంతటినీ భగవంతుని మాయగా వర్ణించారు. భగవంతుడు తన ఆధీనంలోని మాయ ద్వారా ఈ విశ్వాన్నంతటినీ తననుండే ఉద్భవింపచేస్తాడు. భగవంతుడు సర్వాంతర్యామి కావటంచేత భగవంతుడు విశ్వానికి వెలుపల నిలబడి సృష్టించాడనటం తర్క బద్ధంగా అనిపించదు. భగవంతుడే సృష్టికర్త మరియు సృష్టియైన విశ్వం కూడా అనడం తర్కబద్ధంగా అనిపిస్తుంది.

ఈ విశ్వమూ, అందులోని వస్తువులూ కాలంలోని మార్పులకు లోనవుతూ నశించిపోయే స్వభావం కలిగినట్టివి. అందువలన వాటిని ఋషులు అసత్యము,

అశాశ్వతము, మాయ (నిజముగా లేనట్టిది) అని పేర్కొన్నారు. ఈ విశ్వానికి ఆధారమైన భగవంతుడు మాత్రం సత్యము, శాశ్వతము, కాలాతీతుడు అని వర్ణించబడ్డాడు. ఉదాహరణకు సినిమా హాలులోని ప్రాజెక్టర్ ద్వారా ప్రదర్శించబడుతున్న వర్ణాలు అసత్యంగానూ, మాయగానూ, వాటికి ఆధారమైన తెల్లని తెరను సత్యం గానూ పేర్కొనవచ్చును.

భగవంతుడి (సత్యం లేదా చైతన్య శక్తి)తో మన సంబంధాన్ని వివరించడానికి ఋషులు ఆత్మ (అంతరాత్మ) మరియు పరమాత్మ (బ్రహ్మం) అనే రెండు పదాలను ఉపయోగించారు.

ధ్యానస్థితిలో ఋషులు స్థల కాలాలకు అతీతమైన చైతన్యపు ఉనికిని కనుగొన్నారు. ఒక వ్యక్తి యొక్క శరీరం మరియు మనస్సు రెండూ బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం వంటి దశలకు లోనవుతున్నప్పటికీ ఆ మార్పులను సాక్షీభూతంగా గమనిస్తూ కాలాతీతంగా ఉన్న ఒక చైతన్యపు ఉనికిని కనుగొని దానిని ఆత్మ అని సంభోదించారు. ఈ ఆత్మ శరీరంలోని ఒక అవయవానికి లేదా అంగానికి పరిమితమైనది కాదు. ఆ విధంగా ఆత్మ స్థల (దేశ) కాలాలకు అతీతమైనది.

మరింత ప్రగాఢమైన ధ్యానస్థితిలో ఋషులు ఈ విశ్వమంతటిలోను ఒక అవిభాజ్యమైన చైతన్య శక్తి వ్యాపించి ఉన్నట్లు కనుగొన్నారు. ఆ శక్తిని వారు 'పరమాత్మ' లేదా 'బ్రహ్మం' అని సంభోదించారు. ఆ బ్రహ్మమే సృష్టి, స్థితి, లయలకు కారణమైన భగవంతుడు. అయితే నిజానికి ఆత్మ బ్రహ్మం నుండి వేరైనది కాదు. బ్రహ్మమును ఒక మహా సముద్రంతో పోలిస్తే ఆత్మను ఒక నీటి బిందువుగా భావించవచ్చును.

మరొక విధంగా చెప్పాలంటే భగవంతుడు మనలో ఆత్మరూపంలోనూ, ఈ విశ్వమంతటా బ్రహ్మంగానూ వ్యక్తమౌతున్నాడు. ఋషులు సత్యాన్ని 'అణోర ణీయాన్ మహతో మహీయాన్' అని వర్ణించారు. అంటే సత్యం అత్యంత సూక్ష్మమైన అణువు కన్నా సూక్ష్మమైనది మరియు అత్యంత బలోపేతమైన దానికన్నా బలమైనది. నాస్తికులు భగవంతుని ఎక్కడా కనుగొనలేరు, కానీ ఆస్తికులు భగవంతుని విశ్వమంతటా దర్శించగలరు.

ఒకవేళ మనం దుష్టచింతన కలిగిన వారమైతే సత్యం నుండి తప్పించుకొని

దాగుకొనే ప్రదేశం మన శరీరంలోపల కానీ వెలుపల కానీ ఈ విశ్వంలో ఎక్కడా లేదు. అలాగే విశ్వ వ్యాప్తమైన సత్యాన్ని అతిక్రమించడం కానీ ఓడించడం కానీ చేయలేము. మన జాతీయ చిహ్నంలోని నాలుగు సింహాలు సూచించినట్లుగా 'సత్యమేవ జయతే' అంటే సత్యమే జయిస్తుంది.

ఆత్మ రూపంగానూ, బ్రహ్మంగానూ వ్యక్తమయ్యే సత్యాన్ని వివరించడానికి ఈ అధ్యాయంలోని చిత్రంలో వృత్తాకారం ఉపయోగించబడింది. అయితే మనస్సుకు పంచేంద్రియాలకు అగోచరమైన సత్యాన్ని వృత్తం, చతురస్రం వంటి ఏ మానవ పరిమితులతోనూ సంపూర్ణంగా వివరించలేము. సత్యస్వరూపాన్ని ధ్యాన స్థితిలో స్వయంగా అనుభవపూర్వకంగా తెలుసుకొనవలసిందే.

సత్యస్వరూపమైన భగవంతుని ఆకారాలతోను, పేర్లతోను వర్ణించలేము. అయితే నిరాకారమైన, నామ రహితమైన భగవంతుని మీద ధ్యాస నిలపటం సామాన్య మానవులకు కష్ట సాధ్యం. ఒకే వ్యక్తి ఇతరులకు తండ్రిగానో, గురువుగానో, స్నేహితునిగానో లేక శత్రువు గానో కనిపిస్తాడు. అదే విధంగా భక్తులు కూడా తమ పరిణతి మేరకు, అభిరుచుల మేరకు భగవంతునికి వివిధ ఆకారాలను, పేర్లను ఆపాదించి ఆరాధిస్తారు.

ఉదాహరణకు భగవంతుని యొక్క సృష్టికర్త అంశను 'బ్రహ్మ' అని వ్యవహరిస్తారు. సృష్టి రచనకు జ్ఞానం, ఊహా శక్తి అవసరం కాబట్టి బ్రహ్మ యొక్క స్త్రీత్వపు అంశను 'సరస్వతి' అని వ్యవహరిస్తారు. లయకారుడైన భగవంతుని ఈశ్వరునిగానూ, వినాశానికి కావలసిన శక్తి అంశను పార్వతి అని వ్యవహరిస్తారు. విశ్వాన్ని పోషించే భగవంతుని స్థితికారక అంశను విష్ణువుగాను, పోషణకు అవసరమైన స్త్రీత్వపు అంశను లక్ష్మిగానూ వ్యవహరిస్తారు. అలాగే ప్రకృతి శక్తులను ఆరాధించడానికి అగ్ని, వాయువు, వరుణుడు మొదలైన దేవతలు పేర్కొనబడ్డారు. ఇంద్రియాలకు అధిపతి ఇంద్రుడు. అతని అంశతో జన్మించి ఇంద్రియాలను జయించిన వాడు అర్జునుడు.

భగవంతుని నిరాకార రూపంలో ఆకాశ లింగం (శూన్యం) గానూ, సాకార రూపంలో వాయు లింగం (వాయువు), జల లింగం (నీరు), అగ్ని లింగం (నిప్పు) మరియు పృధ్వీ లింగం (భూమి) గానూ ఆరాధించవచ్చును. ఈ సృష్టి అంతా లింగమునుండి ఆవిర్భవించి అంతిమంగా తిరిగి లింగముయందే

లయమౌతుందని స్కాంధ పురాణం తెలియచేస్తుంది.

మనమందరమూ భగవంతుని అంశతో జన్మించిన వారమే. మనం సృష్టించుకొన్న కర్మఫలాల ద్వారా జనన మరణ చక్రంలో పరిభ్రమిస్తూ తిరిగి మన నిజ స్థావరానికి చేరుకొనవలసిన వారమే. “నేనెంత సుదీర్ఘ ప్రయాణం చేసినప్పటికీ చివరికి నేను చేరుకొన్నది నా స్వగృహమే” అన్న గాంధీజీ మాటలు మనకు మోక్ష సాధనా మార్గంలో ఉత్తేజం చేకూర్చాలి.

సృష్టిలో చీకటి లేకుండా వెలుగు, లోతు లేకుండా ఎత్తూ, దుఖం లేకుండా సుఖమూ, చెడు లేకుండా మంచి ఉండటం సాధ్యం కాదు. సత్యం ఒక్కటే అయినప్పటికీ సృష్టి కొనసాగటానికి పైన చెప్పబడిన ద్వందత్వాలు, భిన్నత్వాలు ప్రకృతిలో ఉండక తప్పదు. అయితే ‘భిన్నత్వంలో ఏకత్వం’ అన్నది ఈ విశ్వాన్ని, ధర్మాన్ని నడుపుతున్న మూల సూత్రం.

‘ఉప చేతన మనస్సు’ అధ్యాయంలో వివరించబడినట్లు ఈ విశ్వమంతా శక్తి మరియు పదార్థాల సమ్మేళనం. ఈ రెండింటిని ఒక దాని నుండి మరియొక దానిలోకి మార్పు చేయవచ్చును. ప్రతి ఆలోచనా శక్తి (మనస్సు) మరియు పదార్థం తమస్సు, రజస్సు, సత్త్వ గుణాలనే మూడింటి కలయికతో ఏర్పడతాయి. తమో గుణం యొక్క లక్షణాలు అజ్ఞానం, అంధకారం, నిస్తేజం, నిష్క్రియాపరత్వం వంటివి. రజోగుణ లక్షణాలు వీరత్వం, ఉత్తేజం, మంచి లేదా చెడు పనులు చేయటంలో ఉండే ఉత్సాహం వంటివి. సత్త్వగుణ లక్షణాలు శాంతం, సమత్వం, స్వచ్ఛత, వెలుగు వంటివి.

పరిణామక్రమం దృష్ట్యా సత్త్వ గుణం ఉత్తమమైనది కాగా తమో గుణం అధమమైనది. రజో గుణం మధ్యమమైనది. రజో గుణం మనకు కావలసిన ఉత్తేజాన్ని, ప్రేరణను ఇచ్చి కార్యోన్ముఖులుగా చేస్తుంది. అయితే క్రోధం, ద్వేషం, అసూయ వంటి దుర్గుణాలు మానవునిలో బలంగా ఉన్నప్పుడు రజోగుణం అతనిని దుష్కార్యాలకు ప్రేరేపించే ప్రమాదం ఉంది.

పై మూడు గుణాలను ఒక పదార్థం యొక్క ఘన, ద్రవ, వాయు స్థితులతో పోల్చవచ్చును. మంచుగడ్డలో నీటి అణువులన్ని దగ్గరగా బంధించబడినప్పుడు శక్తి అంతా జడత్వ రూపంలో నిరుపయోగంగా ఉంటుంది. దానిని తమోగుణంతో పోల్చవచ్చును. మంచు కరిగి వరదలాగా నీరు ప్రవహించినప్పుడు ఆ నీటి శక్తిని రజోగుణంతో పోల్చవచ్చును. ఆ నీటిని ఆవిరిగా మార్చి యంత్రాలను

నడిపించగలిగినప్పుడు ఆ నీటి శక్తిని సత్త్వ గుణంతో పోల్చవచ్చును.

ఈ మూడు గుణాలను విశ్వం యొక్క ఏకత్వాన్ని భిన్నత్వంగా ప్రతిబింబింప చేసే మాయాపట్టకం (prism of illusion) అని వివరించవచ్చును. తమస్సు ఈ విశ్వం యొక్క ఏకత్వాన్ని అడ్డగించే అంధకారం వంటిది. రజస్సు మానవుని జ్ఞానాన్ని విభిన్న కోణాలుగా చెదరగొట్టి విశ్వమంతా వేరు వేరుగా కనిపించేటట్లు చేస్తుంది. ఈ మూడు గుణాలు మనస్సు నుండి పుట్టినవే. ధ్యానం ద్వారా ఆలోచనలను నియంత్రించి త్రిగుణాతీత స్థితికి చేరినప్పుడు మనం ఈ విశ్వం యొక్క నిజరూపాన్ని దర్శించగలము.

ఈ మూడు గుణాలను చైతన్యంలోని మూడు స్థాయిలుగా కూడా పరిగణించవచ్చును. తమోగుణం ప్రబలంగా ఉన్నప్పుడు యుక్తాయుక్త వివేచన లేక శారీరక అవసరాలు తీర్చుకోవడమే జీవిత ధ్యేయం అనిపిస్తుంది. రజోగుణం ప్రబలంగా ఉన్నప్పుడు కార్యదీక్ష, పోటీతత్వం వంటి ఎడతెగని ఆలోచన స్రవంతులతో మనస్సు ఉత్తేజంగా ఉంటుంది. సత్వగుణం ప్రబలంగా ఉన్నప్పుడు మనస్సు ప్రశాంతంగా, సమత్వం కలిగి ఉంటుంది.

తమోగుణం కలిగిన వ్యక్తి నిస్తేజంగా నిష్క్రియాపరుడై ఉంటే రజోగుణం కల వ్యక్తి చైతన్యంతో ఉత్తేజితుడిగా ఉంటాడు. సత్త్వగుణం కలిగిన వ్యక్తి ప్రేమ, కరుణ వంటి సుగుణాలతో నిస్వార్థంగా ఉంటాడు. ఒకే వ్యక్తిలో ఈ మూడు గుణాలు వివిధ సమయాల్లో వివిధ స్థాయిల్లో హెచ్చు తగ్గులుగా ఉంటాయి. కనుకనే మానవుల ప్రవృత్తిలోనూ ప్రకృతిలోనూ ఎంతో వైవిధ్యం కనిసిస్తుంది.

రజోగుణం మానవుని కర్మలు చేసే విధంగా ప్రేరేపించి కర్తృత్వ భావనను కలిగిస్తుంది. ప్రాపంచిక సుఖాలు, వస్తువులు, మనుష్యుల పట్ల ఆకర్షణలను రేకెత్తిస్తుంది. ఈ ఆకర్షణకు అవరోధం ఎదురైనప్పుడు ఆగ్రహం కలుగుతుంది. ఆగ్రహం వలన మానవునికి భావోద్వేగాలపై అదుపు కోల్పోయి యుక్తాయుక్త విచక్షణ నశిస్తుంది. ఏది మంచి ఏది చెడు అన్న వివేచన నశించి తప్పుడు నిర్ణయాలు తీసుకొని పతనమౌతాడు.

మానవుని పంచేంద్రియాలు, మనస్సుతో పాటు ప్రకృతిలోని పదార్థాలన్ని కూడా ఈ మూడు గుణాల కలయికచే ఏర్పడినవే. కనుక ఈ మూడు గుణాలకు అతీతుడైన మానవుడు ప్రకృతి శక్తులను జయించి భగవంతునిలో ఐక్యమై జనన

మరణ చక్రం నుండి విముక్తుడవుతాడు.

సత్త్వ, రజో, తమో గుణాలకు అతీతమై భగవంతుని యోగమాయను అధిగమించాలంటే మనం జ్ఞాన, ధ్యాన, భక్తి మరియు కర్మ యోగాలను ఆచరించాలి.

జ్ఞానయోగం ద్వారా తమోగుణ లక్షణమైన అజ్ఞానాన్ని పోగొట్టుకొని ధర్మబద్ధమైన కర్మలను ఆచరించవచ్చును. కర్మయోగాన్ని ఆచరించడం ద్వారా సాత్విక లక్షణాలచే గర్వితులం కాకుండా జాగరూకులం కావచ్చును. కర్మ యోగాన్ని ఆచరించేటప్పుడు ఎదురు కాగల అలజడులు, స్వార్థం వంటి వాటిచే బంధితులం కాకుండా ధ్యాన, భక్తి యోగాలు ఉపకరిస్తాయి.

అయితే మనం ఈ మూడు గుణాల ప్రభావానికి లోబడి ఉన్నంత కాలం ఆత్మ కూడా వాటి ప్రభావానికి లోబడి ఉంటుంది. ఆత్మ సాక్షాత్కారం పొందాలంటే తమోగుణం నుండి రజోగుణంకు, రజోగుణం నుండి సత్త్వ గుణంకు పరిణతి చెంది సత్త్వ గుణాన్ని కూడా అధిగమించాలి.

ప్రకృతి వలన పుట్టిన సత్త్వ, రజో మరియు
తమో గుణములు మూడును
నాశరహితుడైన ఆత్మను జీవుని యొక్క దేహమునకు బంధించుచున్నవి.
(భగవద్గీత 14-5)

సత్త్వ గుణం నిర్మలమైనది కావటం వలన ప్రకాశము,
శాంతము కలిగించునదైనప్పటికిన్నీ
జీవునికి ఇంద్రియసుఖములయందు, జ్ఞానముయందు ఆసక్తిని కలిగించి
బంధన హేతువు అగుచున్నది. (భగవద్గీత 14-6)

రజోగుణం దృశ్యవిషయాలలో ఆసక్తిని కోరికను కలిగించి

జీవుని కర్మలయందు బంధించుచున్నది. (భగవద్గీత 14-7)
అజ్ఞానం వలన కలుగు తమోగుణం
జీవుని సోమరితనం, నిద్ర, నిర్లిప్తత వంటి
వానియందు బంధించుచున్నది. (భగవద్గీత 14-8)

నన్ను అచంచలమైన భక్తియోగంచేత సేవించు జీవుడు
ఈ మూడు గుణాలను అధిగమించి
జీవన్ముక్తుడగుటకు సమర్థుడగుచున్నాడు. (భగవద్గీత 14-26)

సత్త్వ గుణం ఆధ్యాత్మిక ఉన్నతికి ఎంతగానో ఉపకరిస్తుంది. అయితే సత్త్వ గుణ లక్షణమైన జ్ఞానం వలన గర్వితులమై పోయే ప్రమాదం కూడా ఉంది. ఏ బంధాలనైనా – బంగారు సంకెలలతో చేయబడినవైనా – తొలగించుకోవలసిందే. లేకుంటే అవి ఆత్మను ఈ భౌతిక ప్రపంచపు సుఖ దుఖాలకు బంధించివేస్తాయి.

భగవంతుడు సర్వాంతర్యామి! అయితే సూర్యరశ్మి పరిశుద్ధమైన నీటిలోనే కానీ బురద నీటిలో ప్రతిబింబించని విధంగా భగవంతుడు కూడా పరిశుద్ధుడైన మానవునిలోనే ఎక్కువగా వ్యక్తమౌతాడు. అదే విధంగా మహా సముద్రంలోని ప్రతి నీటి అణువు ఆ మహాసముద్రపు లక్ష్యణాన్ని కలిగిఉంటుంది. కనుక ఆధ్యాత్మిక సాధన అంటే మన అంతరంగాన్ని ప్రక్షాళన చేసుకోవటంతోపాటు సర్వ జీవరాశిని ప్రేమించి సేవించడమే. సర్వప్రాణి సేవయే మాధవ సేవ!

భగవద్గీత వింటున్న అర్జునుడికి కలిగిన ఒక సందేహం మనలోకూడా చాలా మందికి కలగవచ్చును. 'సాధారణంగా ప్రతి మానవునికి ధర్మం గురించి, కర్మ గురించి, ఏది మంచో ఏది చెడో తెలిసే ఉంటుంది. అయినప్పటికి వారు మంచి పనులనే చేయదలిచి కూడా చెడు పనులను చేసే విధంగా ఎలా ప్రేరేపితులవుతారు?'

అందుకు సమాధానంగా కృష్ణుడు అర్జునుడికి రజోగుణంలో పొంచి ఉండే ప్రమాదాల గురించి వివరించాడు. రజోగుణంలో క్రింది రెండు విభాగాలు ఉన్నాయి.

1. ఆకర్షణలకు, ఆసక్తులకు, యిష్టాలకు కారణమయ్యే కామం
2. వికర్షణలకు, ద్వేషాలకు, కోపానికి కారణమయ్యే క్రోధం

గాజు దీపంలోని నిప్పును పొగ ఆవరించినట్లు జ్ఞానం కూడా కోరికలనబడే పొగచే ఆవరించబడి ఉంటుంది. గాజు దీపంలోని పొగ ఎక్కువైనప్పుడు ఆక్సిజన్ లేక దీపం ఆరిపోయినట్లుగానే మనలో స్వార్థపూరితమైన కోరికలు ఎక్కువ అయినప్పుడు జ్ఞాన దీపం ఆరిపోతుంది. ఆధ్యాత్మిక పతనం సంభవిస్తుంది.


ఎప్పుడైతే మానవుడు తన కామ క్రోధాలపై అదుపు కోల్పోయి వాటి అదుపులోకి వెళ్ళిపోతాడో అప్పుడతడు దుర్గుణాలకు లోబడి దుష్కర్మలకు పాల్పడతాడు.

అందువలన మనం కోరికలను అదుపులో పెట్టుకొని రాగ ద్వేషాలు, కామ క్రోధాలు మన విచక్షణను నశింపచేయకుండా చూసుకోవాలి.

★ ★ ★

# అధ్యాయం - 15

# ధ్యాన యోగం




**"ఎప్పుడైతే మానవుడు తన ego (అహంకారాన్ని) తగ్గించుకొని శూన్యస్థితికి చేరుకొంటాడో అప్పుడతడి శక్తులు, చర్యలు గొప్ప ప్రభావాన్ని చూపిస్తాయి"**

**– గాంధీజీ**

మనలో కొద్ది మంది మాత్రమే ఈ ప్రపంచాన్ని ఉన్నది ఉన్నట్లు చూడగలము. మనలో అత్యధికులం మన ఇష్టాయిష్టాలు, భయాల వంటి వాటి ద్వారా ఈ ప్రపంచాన్ని చూస్తాము. అందువలన ఈ ప్రపంచం కూడా మన అభిరుచులకు తగ్గట్టు కనిపిస్తుంది. నిజానికి ఈ ఇష్టాయిష్టాల వంటివి మనం ధరించిన ఒక ముసుగు (మాస్క్) మాత్రమే. ఈ ముసుగు వెనుక నిర్భీతితో, నిష్కల్మష ప్రేమతో, ఎల్లలు లేని ఆనందంతో కూడిన మన నిజ స్వరూపం ఎల్లప్పుడూ ఉండనే ఉంది. ఎప్పుడు గాంధీజీ, తన కోసం తను కాకుండా ఇతరుల కోసం జీవిస్తూ వచ్చారో అప్పుడాయన తన నిజ స్వరూపాన్ని దర్శించగలిగారు.

మానవుడు ఎల్లప్పుడూ గాఢ నిద్రలోనో, స్వప్నావస్థలోనో, జాగ్రదావస్థలోనో ఉంటాడు. జాగ్రదావస్థలో మానవుడు తన శరీరం గురించి, మనస్సును గురించిన స్పృహ కలిగి వుంటాడు. స్వప్నావస్థలో మానవునికి శరీర స్పృహ ఉండదు కానీ మనస్సు గురించిన స్పృహ ఉంటుంది. గాఢ నిద్రలో మానవుడికి శరీరం గురించిన స్పృహ కానీ మనస్సును గురించిన స్పృహ కానీ ఉండదు.

గాఢ నిద్రలో మానవునికి గొప్పా, చిన్నా, స్త్రీ, పురుష, జాతి, మత బేధాల వంటివేమీ లేక కేవలం ఆత్మ స్వరూపుడుగా ఉంటాడు. కానీ ఆ స్థితిని గురించిన స్వస్వరూప జ్ఞానం మానవునికి గాఢ నిద్రలో ఉండదు. ఆ ఆత్మ స్వరూపం గురించిన జ్ఞానం మానవునికి ధ్యానంలో కలుగుతుంది. కాబట్టి మానవుడు ధ్యానం చేయటం అవసరం. దానికి ఈ క్రింది విధానాలను పాటించాలి.

ధ్యానానికి పదహైదు లేదా ముప్ఫై నిమిషాలు సమయం కేటాయించాలి. ధ్యానానికి ముందు మరీ ఆకలిగా గానీ కడుపునిండా ఆహారం తీసుకుని గానీ ఉంటే ధ్యానం సరిగా కుదరదు కనుక మితాహారం మంచిది. ఇతరుల నుండి ధ్యానానికి భంగము కలుగకుండా ప్రశాంతమైన ప్రదేశాన్ని ఎన్నుకోవాలి. కుర్చీలో కానీ, గోడకు ఆనుకుని గానీ నిటారుగా కూర్చోవాలి.

పలకటానికి వీలుగా, చిన్నగా ఉండే ఒక పదాన్ని ఎన్నుకోండి. 'ఓం' అని కానీ, 'రామ్' అనికానీ, 'అల్లాహ్' అని కానీ, 'జీసస్' అని కానీ మీ కిష్టమైన పదాన్ని ఎన్నుకోండి. ధ్యానం అనేది మతాతీతమైన ఒక ప్రక్రియ.

కళ్ళు మూసుకుని మీ ఆలోచనలను గమనిస్తూ ఉండండి. సాధారణంగా మీ ఆలోచనలు మూడు స్థితులలో ఉంటుంది.

1. ఒక క్రొత్త ఆలోచన ప్రారంభమయ్యే స్థితి.
2. ఆ ఆలోచన కొనసాగుతూ ఉండే స్థితి.
3. ఆ ఆలోచన అంతమయ్యే స్థితి.

పదహైదు సెకనుల కొకసారి మీరు ఎన్నుకున్న పదాన్ని మనస్సులోనే తలచుకోండి. మీ మనస్సులోని ఆలోచనలను ఆపేయటానికి ప్రయత్నించవద్దు. క్రొత్త ఆలోచనలను ప్రారంభించటానికి కానీ వాటిని కొనసాగించటానికి కూడా ప్రయత్నించవద్దు. మీ మనస్సులోని ఆలోచలను కేవలం సాక్షిలాగ గమనిస్తూ ఉండండి.

ధ్యానంలోని ప్రగాఢ స్థితిలో 'నేను' అనే భావన తొలగిపోయినప్పుడు

మానవుడు నిద్రావస్థకు, జాగ్రదావస్థకు, స్వప్నావస్థకు అతీతమైన స్థితిని అనుభవిస్తాడు. దీనినే తురీయావస్థ లేక త్రిగుణాతీత స్థితిగా పేర్కొంటారు. ఆ స్థితిలో మానవుడు తనలోని ఆత్మ స్వరూపాన్ని దర్శిస్తాడు.

అటువంటి ప్రగాఢ ధ్యాన స్థితిలో అర్జునుడు విశ్వరూప సందర్శనం ద్వారా తాను శ్రీకృష్ణుడి నుండి భిన్నమైన వ్యక్తిని కానని విశ్వమంతటా వ్యాపించి ఉన్న శ్రీకృష్ణుడు తనలోనూ అంతర్యామిగా ఉన్నాడని గ్రహించాడు.

కానీ మానవుడు ఎల్లప్పుడూ ధ్యానస్థితిలోనే ఉండలేడు. తిరిగి దృశ్య ప్రపంచంలోకి వచ్చి తనను ప్రపంచం నుండి వేరు చేసే దృశ్య విషయాలతో సంబంధం కొనసాగించాల్సిందే. ఈ దృశ్య ప్రపంచాన్ని ఋషులు ప్రకృతిమాయగా వర్ణించారు. ఈ ప్రకృతి మాయను దాటడానికి ధ్యాన, జ్ఞాన, భక్తి, కర్మ యోగాలను సాధన చేయాలి.

సాధారణంగా ప్రజలు హఠయోగాన్నే నిజమైన యోగంగా పొరబడతారు. అయితే యోగం అనే పదానికి అసలైన అర్థం 'సమ్మేళనం' లేదా 'ఐక్యం'. భగవంతునిలో ఐక్యం కావటమే యోగానికి నిజమైన అర్థం, ప్రయోజనం !

మానవుని ఆధ్యాత్మిక శక్తి అంతా మూలాధార చక్రం వద్ద ఒక సర్పం చుట్ట చుట్టుకుని పడుకొన్నట్లు ఉంటుంది. ఈ శక్తి మేల్కొని సహస్రారాన్ని చేరటాన్నే 'కుండలినీ జాగరణ' అంటారు. కఠినమైన యోగ సాధనలు చేసినప్పుడు సాధకులకు అష్ట సిద్ధుల వంటివి కూడా లభించవచ్చును. అయితే సాధకులు వాటికోసం ఆశించకుండా తమ ప్రధాన లక్ష్యమైన మోక్షం పైనే దృష్టిని నిలపాలి. అందువల్లనే ధ్యాన యోగంతో పాటు జ్ఞాన, భక్తి, కర్మ యోగాలకు కూడా సమాన ప్రాధాన్యతను ఇవ్వాలి.

జ్ఞాన యోగం 'ధర్మం', 'కర్మ' వంటి ఆధ్యాత్మిక రహస్యాల గురించి తెలియ చేస్తుంది. వీటి గురించి ఐదవ అధ్యాయంలో వివరించబడింది. భక్తి యోగం గురించి, కర్మ యోగం గురించి తదుపరి అధ్యాయాలలో వివరించబడుతుంది.

పతంజలి మహర్షి యోగాన్ని 'యోగః చిత్త వృత్తి నిరోధః' అంటే మనో నిగ్రహాన్ని సాధించటమే యోగం అని వ్యాఖ్యానించారు. ఆయన యోగానికి క్రింది ఎనిమిది అంగాలు ఉన్నట్లు వివరించారు.

1. యమ
2 నియమ
3. ఆసన
4. ప్రాణాయామ
5. ప్రత్యాహార
6. ధారణ
7. ధ్యాన
8. సమాధి

1. యమ : ఇవి ఐదు ముఖ్యమైన నైతిక విలువలు.

ఏ) అహింస : మనసా, వాచా, కర్మణా ఇతరులను హింసించకుండా ఉండటం

బి) సత్య సంధత

సి) అస్తేయం : దొంగతనం చేయకుండా ఉండటం

డి) బ్రహ్మచర్యం : శీల సంపద మరియు ఇంద్రియ నిగ్రహం. శ్రీ కృష్ణుడు, అర్జునుడు ఇరువురూ వివాహితులై సంతానం పొందినట్లు మహా భారతంలో చెప్పబడినందున బ్రహ్మచర్యానికి నిజమైన అర్థం అవివాహితులుగా ఉండటం కాదు. బ్రహ్మజ్ఞానం కలిగి ఉండి నిరంతరం బ్రహ్మము యందు చరించుటే బ్రహ్మచర్యం.

ఈ) అపరిగ్రహం: సంపదలను కూడబెట్టకుండా నిరాడంబరంగా జీవించటం

2. నియమ : సత్ప్రవర్తన మరియు మంచి అలవాట్లు.

ఏ) శౌచం : మానసికంగా మరియు శారీరకంగా పరిశుభ్రతను పాటించడం

బి) సంతోషం : భగవంతుడు ప్రసాదించిన వాటితో తృప్తి చెందటం

సి) తపస్సు

డి) స్వాధ్యాయం : ధర్మ శాస్త్రాలను అధ్యయనం చేస్తూ వాటిని ఆచరించే విధంగా ఆత్మ పరిశీలన చేసుకోవటం

ఈ) ఈశ్వర ప్రాణిధానం : భగవంతుని స్మరించడం

3. అసనాలు : ఆసనం అంటే ఎక్కువ సేపు శ్రమ లేకుండా స్థిరంగా ఉండగల ఒక భంగిమ. పతంజలి మహర్షి ఎటువంటి ఆసనం పేరును ప్రస్తావించకుండా 'స్థిర సుఖాసనం' అని మాత్రమే పేర్కొన్నారు. నొప్పిని, శ్రమను కలిగించేది

నిజమైన యోగాసనం కాదు. పతంజలి మహర్షి తదుపరి కాలంలో హఠ యోగ సాధకులు పద్మాసనం, శవాసనం, వజ్రాసనం, భుజంగాసనం వంటివాటిని మనకు అందించారు. హఠయోగ ప్రదీపిక ఎనుబది నాలుగు ఆసనాలను వివరించినప్పటికీ పద్మాసనం, భద్రాసనం, సింహాసనం, సిద్ధాసనం అనే నాలుగింటిని ప్రముఖంగా పేర్కొంది. ఆసనాలు శరీర దారుఢ్యానికి ఉపకరిస్తాయి.

4. ప్రాణాయామం : ఇది ప్రాణ (శ్వాస) మరియు అయమ (నియంత్రణ) అనే రెండు సంస్కృత పదాల కలయికతో ఏర్పడింది. ఈ ప్రక్రియలో భాగంగా గాఢంగా శ్వాస పీల్చుకోవడం (పూరకం), కొంతసేపు గాలిని బిగబట్టడం (కుంభకం), పూర్తిగా శ్వాసను వదలివేయటం (రేచకం), శ్వాసించకుండా బిగబట్టటం (శూన్యకం) వంటి నాలుగు దశలు ఉంటాయి. వీటి ద్వారా శరీరంలోని అన్ని అవయవాలకు ఆక్సిజన్ సరఫరా సరిగ్గా జరిగి ఆరోగ్యం చేకూరుతుంది.

5. ప్రత్యాహారం : ఈ పదం ప్రతి (తన వైపు) మరియు అహార (మళ్ళించడం) అనే రెండు సంస్కృత పదాల కలయికతో ఏర్పడింది. ఇందులో భాగంగా ఆలోచనలను బాహ్య ప్రపంచం నుండి, వ్యక్తులనుండి, అంతర్ముఖంగా మళ్ళించడం జరుగుతుంది.

6. ధారణ : ధారణ ద్వారా ఆలోచనా స్రవంతిని నియంత్రించి మంత్రం లేదా దేవతా ప్రతిమ లేదా లక్ష్యం వంటి ధ్యాన వస్తువుపై మనస్సును లగ్నం చేయడం జరుగుతుంది.


7. ధ్యానం : ధ్యానానికి అర్థం 'తలచటం'. ధారణలోని ధ్యాన వస్తువును తలచడమే ధ్యానం. ధారణ మనస్సు యొక్క "స్థితి' ఐతే ధ్యానం మనస్సు 'ఆలోచించే విధానం'. ధారణకు ధ్యానానికి మధ్య అవినాభావ సంబంధం ఉంది. ఆది శంకరుల ఉదాహరణ ప్రకారం ఒక యోగి ఉదయించే సూర్యుని ధ్యానవస్తువుగా భావిస్తే ధారణలో ఆ సూర్యుని రంగు, తీక్షణత, వెలుగు వంటి అంశాలమీద ఆలోచనలు ఉంటాయి. ధ్యానంలో కేవలం సూర్యుని గమనం మీదే ఆలోచన ఉంటుంది.

8. సమాధి : దీనికి అర్థం ధ్యానం లోని వస్తువుతో ఐక్యం కావటం. ఈ స్థితిలో ధ్యానికి, ధ్యానానికి, ధ్యానవస్తువుకు మధ్య ఎటువంటి బేధమూ ఉండదు. ఈ స్థితిలో మనస్సుకు ఒక ప్రత్యేక ఆస్తిత్వం అంటూ ఉండదు. సమాధి స్థితి క్రింది రెండు రకాలుగా ఉంటుంది.

ఎ) సవికల్ప లేదా సంప్రజ్ఞాత సమాధి : ఇందులో మంత్రం లేదా దేవతా ప్రతిమ లేదా నాసికాగ్రం వంటి ధ్యానవస్తువుపై మనస్సు లగ్నం అయిఉంటుంది.
బి) నిర్వికల్ప లేదా అసంప్రజ్ఞాత సమాధి : ఇందులో మంత్రం లేదా దేవతా ప్రతిమ వంటి ధ్యానవస్తువుతో నిమిత్తం లేకుండా కేవలం చైతన్యంతో ఏకం కావటం ఉంటుంది.

★ ★ ★

# అధ్యాయం - 16
# భక్తి యోగం



గాంధీజీ మానవ పరిణామక్రమాన్ని క్రింది విధంగా వివరించారు.

**" చరిత్రలో నమోదు చేయబడిన కాలం నుండి నేటి వరకు మానవ పరిణామక్రమాన్ని చూస్తే మానవుడు కాలక్రమంలో హింసా మార్గం నుండి అహింస వైపు పరిణతి చెందుతూ ఉండటం గమనిస్తాము. మన పూర్వీకులైన ఆదిమమానవులు తొలినాళ్ళలో నరమాంస భక్షకులుగా జీవించి తదుపరి కాలంలో ఇతర ప్రాణులను వేటాడటం వృత్తిగా జీవించారు. తదుపరి తరాలలో వ్యవసాయం నేర్చుకొని జీవహింసను తగ్గిస్తూ భూమాత అందించే ఫలసాయంపై ఆధారపడనారంభించారు. సంచార జీవిగా ఉన్న రోజులనుండి క్రమంగా స్థిరనివాసానికి అలవాటుపడి గ్రామాలను, నగరాలను ఏర్పరచసాగారు. వ్యవసాయానికి, రవాణాకు పశువుల, గుర్రాల వాడకం తగ్గిస్తూ యంత్రాలను వాడసాగారు.**

**ఒకవేళ మానవజాతి పరిణామం మరింత హింసాత్మక జీవన విధానం వైపు సాగిఉంటే రాక్షస బల్లుల వంటి ఎన్నో జంతు జాతులు అంతరించి పోయినట్లే మానవ జాతి కూడా ఏనాడో అంతరించిపోయేది. ఒక జంతువుగా మానవుడు హింసావాదే కానీ ఒక ఆత్మస్వరూపుడిగా మానవుడు అహింసాపరుడు".**

భక్తి అంటే భగవంతుని పైన ఉండే గాఢమైన ప్రేమ. భక్తి యోగమనేది భగవంతుని చేరడానికి సహజమైన సులభమైన మార్గం. అయితే ఈ యోగంలోని ప్రమాదం ఏమిటంటే ఈ మార్గాన్ని అవలంబించే వారు సులభంగా అంధవిశ్వాసాలకు, ఇతరులను కానీ తమను తాము కానీ హింసించుకునే ఆచారాలకు పాల్పడతారు. అంతేకాక వారు తమ మార్గాన్ని ఎంత ప్రేమిస్తారో ఇతర మార్గాలను, మార్గావలంబకులను అంతగా ద్వేషించే అవకాశం ఉంది కాబట్టి ఈ విషయాలలో అత్యుత్సాహాలకు పాల్పడకుండా జాగ్రత్త వహించాల్సిన అవసరం ఉంది.

భక్తియోగాన్ని క్రింది విధానాల ద్వారా ఆచరించవచ్చును.

1. మనసా, వాచా, కర్మణా ఇతరులను నొప్పించే మాటలకు, పనులకు స్వస్తి పలికే విధంగా ద్వేషభావాన్ని విడనాడటం.

**" మనను ప్రేమించిన వారిని మాత్రమే తిరిగి ప్రేమిస్తే అది నిజమైన ప్రేమ కాదు. మనలను ద్వేషించే వారిని కూడా ప్రేమిస్తేనే అది నిజమైన ప్రేమ. ఇది ఎంత కష్టసాధ్యమైన విషయమో నాకు తెలుసు. కానీ మనము సాధించాలనుకుంటే దైవ కృపవలన ఇది సాధ్యమే " – గాంధీజీ.**

కానీ ప్రేమను ఎలా పెంపొందించుకోగలం అని మనకు సందేహం రావచ్చు. 'మనల్ని ఎప్పుడూ విమర్శిస్తుండే తోటివారిని కానీ, ప్రత్యర్థులను కాని ఎలా ప్రేమించగలము?' అంటే ప్రేమ యొక్క పరిధిని పెంచుకోవటం ద్వారా మాత్రమే ఇది సాధ్యం.

గాంధీజీ స్వయంగా తన ప్రయోగాలలో ఎన్నోసార్లు ఓటమి పాలయ్యారు. అందువలన తన దగ్గరికి మార్గదర్శకత్వం కోసం వచ్చిన వారి నుండి రాత్రికి రాత్రే మార్పును ఎదురుచూడలేదు.

గాంధీజీ ఇలా చెప్పేవారు "మీరు ప్రస్తుతం ఉన్నస్థితి నుంచే సాధన మొదలు పెట్టండి. ఒకవేళ ప్రధాన మంత్రిని ప్రేమించ లేకపోతే మీ జీవిత భాగస్వామితో

కానీ, పిల్లలతో గానీ మొదలు పెట్టండి. ప్రతీ క్షణం మీ బాగోగుల కంటే వారి బాగోగులకు ప్రాధాన్యమిస్తూ ఆ విధంగా మీ ప్రేమ పరిధిని పెంచుకోండి. ఆ మార్గంలో ప్రయత్నిస్తూనే ఉండండి".

భగవంతుడు అందరిలోను ఆత్మరూపంలో ఉన్నాడు. తండ్రిగా, తల్లిగా, స్నేహితునిగా, జీవిత భాగస్వామిగా, వినియోగదారునిగా, గురువుగా, చిన్నారి శిశువుగా (బాలకృష్ణునిగా) ఇలా ఎన్నో విధాల భగవంతుని దర్శించవచ్చును.

సర్వప్రాణులయందు ద్వేషం లేనివాడును
మైత్రి, క్షమ మరియు కరుణ కలవాడును
అహంకారం లేని వాడును
సుఖ దుఖాలలో సమభావం కలవాడును
నాకు ఇష్టుడు (భగవద్గీత 12–14)

ఎల్లప్పుడు సంతృప్తితో ఉండేవాడును
మనస్సును స్వాధీన పరచుకొనిన వాడును
మనోబుద్ధులను నాకు సమర్పించినవాడు
నాకు ఇష్టుడు (భగవద్గీత 12–16)

2. 'పనియే ఆరాధన' (వర్క్ ఈజ్ వర్షిప్) అన్న భావన కలిగి ఉండటం. పనిచేయటం అన్నది ప్రతిఫలాన్ని ఆశించో లేక అహాన్ని తృప్తి పరచుకోవడానికో కాక "మానవ సేవయే మాధవ సేవ" అన్న భావనతో ఉండాలి. గాంధీజీ "దరిద్ర నారాయణుడి సేవ" (అణగారిన, నిమ్న, బడుగు ప్రజల సేవ) గురించి ప్రత్యేకంగా ప్రస్తావించేవారు.

**" సాధారణంగా ధనవంతులు భోగలాలసలో పడి భగవంతుని పూర్తిగా మరచిపోవటమో లేక విద్యాగర్వంతో ఆయన ఉనికినే సందేహిస్తూ తర్కించడమో చేస్తారు. అందుకు భిన్నంగా బీదవారు పూర్తిగా భగవంతుడినే తమ రక్షకుడిగా, సర్వస్వంగా కొలుస్తుంటారు. అందువలన అటువంటివారిని సేవించడమే భగవంతునికి ఎంతో ప్రీతికరమైన విషయం. ఈనాడు రాజకీయాలు ప్రతి ఒక్కరినీ చుట్ట చుట్టి పెనవేసుకొని నలిపివేస్తున్న కొండ చిలువల్లా మారాయి. వాటి బారినుండి ప్రజలకు విముక్తి కలిగించడానికే నేను రాజకీయాల్లోకి ప్రవేశించాను"**

**– గాంధీజీ.**

3. ప్రేమ మరియు తోటి మానవుల దౌర్భాగ్యాన్ని పట్టించుకోనటువంటి స్వార్థం–ఈ రెండూ పరస్పర వ్యతిరేకమైనవి (paradoxical) అని గ్రహించడం. భగవంతుడు విశ్వానికి ప్రభువు కనుక విశ్వంలోని సంపదలన్నీ భగవంతునివే అన్న ఉదాత్త భావన నుండి అస్తేయం (పరుల సొత్తును దొంగిలించకుండా ఉండటం) మరియు అపరిగ్రహం (సంపదలను కూడబెట్టకుండా నిరాడంబరంగా జీవించడం) అనే రెండు అంశాలు పుట్టినవి. మానవాళి అంతా భగవంతుని అంశతో పుట్టిన వారే కనుక ఈ సంపదలపై అందరికి సమాన భాగస్వామ్యం ఉంది. ఏ మానవుడైనా తనకు అవసరమైన దానికన్నా ఎక్కువ తీసుకొంటే మరియొకరి వంతును దొంగిలిస్తున్నట్లే. ఒక వ్యక్తి దైవ భక్తుడినని చెబుతూనే దేవుని సంపదను దోచుకోవటం సత్య దూరమైన విషయం.

ఐచ్ఛికంగా అవసరాలను తగ్గించుకొని నిరాడంబరంగా జీవించడమన్నది బీదరికం వల్లనో గాక తోటివారిపై ప్రేమ వల్ల సంభవిస్తుంది. ఈ మార్గాన్ని అనుసరించే వారు తమ శక్తిసామర్థ్యాలను, నైపుణ్యాలను అత్యున్నత స్థాయిలో వినియోగించుకొని సమిష్టి సంపదలను అతి తక్కువ స్థాయిలో వినియోగించుకొంటారు. తమ అధీనంలో మిగులు సంపద ఉంటే ఒక ధర్మకర్త (ట్రస్టీ) వలే దానిని ఇతరులకోసమే వినియోగిస్తారు.

4. పోరాటం కూడా అహింసాయుతంగా చేయడం. ప్రేమ మార్గం అంటే ఎవరితోనూ పోరాడక, ఆత్మ రక్షణ కూడా చేసుకోలేని ఒక దౌర్బల్య స్థితి అని అర్థం కాదు. గాంధీజీ "నేను ఒక సర్పాన్ని ప్రేమించినప్పటికీ అది నిన్ను కాటు వేయబోతే నేను దానిని చంపవలసిందే" అన్నారు. కనుక భక్తియోగంలో వివరింపబడిన సర్వ ప్రాణి ప్రేమకు కర్మయోగం ద్వారా అర్జునుడు చేసిన యుద్ధానికి మధ్య వైరుధ్యం ఏదీ లేదు. అర్జునుడు దుర్మార్గులపై ద్వేషంతోనో క్రోధంతోనో కాక సైనికుడి బాధ్యతగా తన ధర్మాన్ని నిర్వర్తిస్తే కర్మబంధం ఉండదని శ్రీ కృష్ణుడు బోధించాడు. అయితే నేటి ప్రజాస్వామ్య యుగంలో నిరాయుధులై చేసే అహింసా పోరాటమే సరియైనది.

అహింసా పోరాటం యొక్క అత్యున్నత రూపం సత్యాగ్రహం. అదే గాంధీజీ యొక్క బ్రహ్మాస్త్రం. 'సత్యం' అంటే నిజం అని కాక ఎల్లప్పుడూ ఉండే బ్రహ్మం, భగవంతుడు అని గ్రహించాలి. 'అగ్రహం' అంటే క్రోధం అని కాక 'స్థిరంగా

ఉండటం' అని గ్రహించాలి. బ్రహ్మభావనలో స్థిరంగా ఉండటమే సత్యాగ్రహం. అదే ఆత్మశక్తి.

సత్యాగ్రహి మరణానికి కూడా భయపడకుండా సహనంతో బాధలను, కష్టాలను భరిస్తూ దుర్మార్గులను సన్మార్గంలోకి మార్చడానికి కృషి చేస్తాడు. దుర్మార్గుడిని శత్రువుగా కాక తనలోని ఒక భాగంగానే చూడటం జరుగుతుంది. దుర్మార్గుడిని శారీరకంగా హింసించడం, లేదా మానసికంగా అవమానించడం వంటి ఆలోచనలు సత్యాగ్రహికి ఉండవు. దుర్మార్గుడిని తన దారికి తెచ్చుకోవటం కాక అతనిలోని సత్యం (Truth) ను మేలుకొలపటమే సత్యాగ్రహి లక్ష్యంగా ఉంటుంది.

ఆ విధంగా సత్యాగ్రహం సత్యాగ్రహికి మరియు దుర్మార్గుడికి ఇద్దరికి ఆధ్యాత్మిక పురోగతి కలిగించేదిగా ఉంటుంది. సత్యాగ్రహాన్ని వ్యక్తి స్థాయిలో ప్రయోగించి ఇతరులలో కానీ కుటుంబంలో కానీ మార్పు సాధించవచ్చును. ఒక బృందంగా ప్రయోగించి సమాజంలో లేదా ప్రపంచంలో కూడా మార్పు సాధించవచ్చును.

మన ప్రార్ధనలను భగవంతునికి చేర్చడంలో విశ్వాసంతో పాటు ప్రేమ యొక్క పాత్ర అతి ముఖ్యమైనది. విశ్వాసం మరియు ప్రేమ రెండూ కలిసినప్పుడు అవి ఉపచేతన మనస్సులో ప్రవేశించి మన సంకల్పాలు నెరవేరేటట్లు చేస్తాయి.

★ ★ ★

# అధ్యాయం - 17
# కర్మ యోగం



ఓ భరతా! జ్ఞానఖడ్గంతో నీ హృదయంలోని సంశయాలను ఛేదించి (కర్మ) యోగాన్ని అధిష్టించుటకు లెమ్ము (భగవద్గీత 4:42)

కృష్ణుడు అర్జునుని 'భరతా' అని సంభోదించాడు. సంస్కృతంలో 'భ' అంటే వెలుగు మరియు జ్ఞానము. 'రత' అంటే ఉండటం. నిరంతరం జ్ఞానమనే వెలుగులో ఉండే వాడు భరతుడు. ఋషులు జ్ఞానులందరినీ 'భరతా' అని సంభోదిస్తుండటం చేత వారు నివసించిన ఈ దేశానికి భరత వర్షమని పేరు వచ్చింది. భరత వర్షానికి ఎల్లలు లేవు. భరతమాత తన జ్ఞాన జ్యోతిని ప్రపంచ మంతటా ప్రసరింప చేస్తుంది. చిరకాలం నుండి భారతదేశాన్ని నిర్వచించిన అంశం ఒక మతంకానీ, ఒక దేవుని యందు విశ్వాసంకానీ కావు. అనాదిగా

భారతదేశం సత్యాన్వేషకులకు పుట్టినిల్లు. భగవద్గీత అర్జునునికి మాత్రమే కాదు, మనందరికి చెప్పబడింది.

స్వామి వివేకానంద 1893లో చికాగోలో సర్వమత సమ్మేళనంలో పాల్గొన్నప్పుడు ఆయన ఉపన్యాసాలు విని విదేశీయులు ఆశ్చర్యపడేవారు. "స్వామీ మీ దేశస్థులకు ఇంతటి జ్ఞాన సంపద ఉంది. మరి ఎందుకు మీ దేశం ఇంతటి పేదరికాన్ని అనుభవిస్తుంది?" అని అడిగేవారు. దానికాయన "అందుకు కారణమేమిటంటే మా దేశస్థులు కేవలం ఇతరులకు ఆదర్శాలను బోధిస్తారు. మీరు నిత్య జీవితంలో స్వయంగా ఆచరిస్తారు" అని సమాధాన మిచ్చాడు.

అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాలలో ప్రార్థనా మందిరాలలో కంటే సంఘ సేవా కార్యక్రమాలలో ఎక్కువమంది ప్రజలు కనిపిస్తారు. ఎంతో అధికారం గల రాజకీయ నాయకులు, ప్రభుత్వోద్యోగులు లంచాలు ఆశించకుండా పనిచేస్తారు. 'వర్క్ ఈజ్ వర్షిప్' అన్న సూక్తికి అనుగుణంగా ప్రతి ఒక్కరు తమ పనిని ప్రేమించి హృదయపూర్వకంగా నిర్వర్తిస్తారు. బహిరంగ ప్రదేశాలలో వ్యర్థ పదార్థాలు వదిలితే తోటి మానవులకు ఇబ్బంది కలుగుతుందని ఆలోచిస్తారు. ఇటువంటి సుగుణాలను అలవరచుకొని మరింత మెరుగైన జీవన విధానాన్ని గడపటం మన భారతీయులకు అసాధ్యమయిన విషయం ఏమీ కాదు.

**సర్వాంతర్యామియైన భగవంతుని దర్శించాలంటే మనం సృష్టిలోని అత్యల్పమైన దాన్ని కూడా ప్రేమించగలగాలి. అలాంటప్పుడు మనం ఏ రంగం నుండి దూరంగా ఉండలేము. భగవంతుని కోసం నా అన్వేషణ నన్ను రాజకీయ రంగంలో ప్రజాసేవకు పురిగొల్పింది – గాంధీజీ**

భారతదేశం స్వాతంత్ర్యం పొందుతున్న సమయంలోనే దేశం మత కలహాలలో చిక్కుకుంది. మానవులలోని జంతు ప్రవృత్తి మేల్కొని హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు, గృహ దహనాల వంటివి జరిగాయి. అటువంటి దుష్కర్మలకు పాల్పడకుండా మనిషి మనిషిగానే జీవించడమో లేక మరణించడమో మేలని గాంధీజీ ప్రజలకు బోధించేవారు. కల్లోలిత ప్రాంతాలలో పర్యటిస్తూ ప్రజలను శాంతపరుస్తూ 78 ఏళ్ళ వయస్సులోనూ మతసామరస్యం కోసం నిర్విరామంగా కృషి చేసేవారు. క్రొత్తగా ఏర్పడిన మంత్రి వర్గానికి మార్గనిర్దేశం చేస్తూ ఉత్తర ప్రత్యుత్తరాలు, సభలు, సమావేశాలతో అవిశ్రాంతంగా గడిపేవారు.

భగవద్గీతా సారాంశాన్ని గాంధీజీ ఒక్క వ్యాఖ్యలో 'నిష్కామ కర్మయోగం'గా వర్ణించారు. నిష్కామం అనగా స్వార్థ పూరితమైన కోరికలు లేకుండటం. ఇక్కడ గమనించవలసిన విషయమేమిటంటే మనకు, ఇతరులకు మేలు చేకూర్చే కోరికలుండటం మంచిదే. అలాకాకుండా ఇతరులకు కీడు, మనకు మాత్రం మేలు చేకూర్చే కోరికలే స్వార్థ పూరిత కోరికలు. కోరికలు పూర్తిగా లేకుండా జీవితమే ఉండదు. ఎందుకంటే మోక్షం కావాలనుకోవడం కూడా ఒక కోరికయే.

ఫలాపేక్ష లేకుండా
చేయదగిన కర్మలను
చేయువారు మోక్షమును పొందుచున్నారు (భగవద్గీత - 3:19)

జనక మహారాజు మొదలైన వారు
నిష్కామ కర్మల చేతనే మోక్షము పొందారు.
ప్రజలను సన్మార్గమున నడుపుటకు నీవును కర్మలను
చేయుటకే సమర్థుడివై వున్నావు. (భగవద్గీత - 3:20)

గొప్పవాడే కర్మలను చేస్తాడో
వాటినే అందరూ చేస్తారు.
అతని ప్రమాణాలనే
అందరూ అనుసరిస్తారు. (భగవద్గీత - 3:21)

కాబట్టే నేను చేయదగిన కార్యమేదీ లేకపోయినా,
నాకు లేనిది, నేను పొందదగినది
ఏదియూ లేనప్పటికి
నేను కర్మలను చేయుచునే ఉన్నాను. (భగవద్గీత - 3:22)

అజ్ఞానులు ఫలాపేక్షలతో కర్మలను చేస్తారు.
జ్ఞానులు ఫలాపేక్ష వదలి
లోకహితం కోసం కర్మలను చేయాలి. (భగవద్గీత - 3:25)

జ్ఞాని కర్మఫలాసక్తులైన అజ్ఞానులను అడ్డగించకూడదు
అయితే తన ఆచరణను ఇతరులు ఉదాహరణగా తీసుకొనేటట్లు
కర్మలను ఆచరించాలి. (భగవద్గీత – 3:26)

మానవుడు సంఘ జీవి కావటం వలన సంఘ శ్రేయస్సులోనే వ్యక్తి శ్రేయస్సు ముడిపడి ఉంది. సంఘం సక్రమంగా నడవాలంటే మార్గనిర్ధేశం చేసే గురువులు, అంతఃశత్రువుల నుండి బాహ్య శత్రువుల నుండి కాపాడే నాయకులు, ఆహారోత్పత్తి, వస్త్రోత్పత్తి వంటి సంపదలను పెంచే కర్షకులు, వర్తకులు మరియు ప్రజలందరికీ సేవ చేసే వృత్తికారులు, కార్మికులు, ఉద్యోగులు వంటి వారు అవసరం.

**1. గురువులు :** గురువులంటే కేవలం శాస్త్రాలను బోధించే ఆచార్యులని అర్థం కాదు. 'గురు సాక్షాత్ పరబ్రహ్మ' అని పెద్దల మాట. తాను బ్రహ్మము అన్న జ్ఞానం కలిగి ఆ జ్ఞానాన్ని పొందటానికి ఇతరులకు మార్గనిర్ధేశం చేసేవాడే నిజమైన గురువు. గురుత్వం అనేది ఒక బాధ్యతే కాని పదవి కాదు . ఈ పుస్తకంలోని సూత్రాలను నిత్యజీవితంలో ఉపయోగించి వాటి సత్యాన్ని తెలుసుకున్న తర్వాత ఇతరులతో పంచుకోవాలి.

**"ఒక గురువు తన జీవన విధానం ద్వారా ఎన్నో మైళ్ళ దూరంలోని శిష్యులను కూడా ప్రభావితం చేయవచ్చు. పిరికి వాడుగా ఉండే గురువు తన శిష్యులను ధైర్యవంతులను చేయలేడు. నేనొక అబద్ధాల కోరయి ఉండి ఇతరులకు అబద్ధమాడరాదని బోధిస్తే నేను నా సమయాన్నంతా వృధా చేసుకుంటున్నట్లే. కాబట్టే నా జీవన విధానాన్ని మార్చుకోవటం ద్వారా నేను నా శిష్యులకు ఒక ఉదాహరణగా మారాను". – గాంధీజీ**

ఒక వ్యక్తి నాయకునిగానో, వ్యాపారిగానో, వృత్తికారునిగానో ఉంటూ కూడా తన ధర్మాచరణ ద్వారా ఇతరులకు ధర్మాన్ని బోధించవచ్చును.

**2. నాయకులు :** రాజకీయాల్లో క్రొత్త తరహా నాయకులు రావలసిన అత్యవసర పరిస్థితి ఎంతగానో ఉంది. అత్యధిక శాతం రాజకీయ నాయకులు అవినీతి, అక్రమాలలో కూరుకునిపోయి అవినీతిపరులైన అధికారులకు తోడ్పడే వారుగా, ప్రజలను మభ్యపెట్టే వారుగా తయారయ్యారు. నాయకత్వం అనేది ఒక బాధ్యతే కాని పదవి కాదు.

నాయకుడు పై నుండి అధికారం చెలాయించేవాడు కాకుండా క్రింద

నుండి ఎదిగేవాడు కావాలి. నిజమైన నాయకుడు ఇతరుల కోసం తన క్షేమాన్ని కూడా ఫణంగా పెట్టాలి. భావ స్వారూప్యం ఉన్న వ్యక్తులతో ఒక సంఘంగా ఏర్పడి ప్రజల సమస్యలు తెలుసుకోవాలి. సమాచార హక్కు చట్టం, ప్రజా ప్రయోజన వ్యాజ్యం, సత్యాగ్రహం వంటి సాధనాల ద్వారా ప్రజలకు సహాయపడాలి.

**3. వర్తకులు :** పారిశ్రామిక వేత్తలు, వ్యాపార వేత్తలు వస్తూత్పత్తిని, విదేశీ వర్తక వాణిజ్యాలను పెంపొందింపచేసి సంఘానికి ఉపయోగపడాలి. తగు మాత్రం లాభాలతో వస్తువులను వినియోగదారులకు అందించటం, శ్రమకు తగిన వేతనాలను సేవకులకు చెల్లించటం, ప్రభుత్వానికి సక్రమంగా పన్నులు చెల్లించటం వంటివి వారి ధర్మాలు.

తనలోని ఆత్మయే ఇతరులలో కూడా ఉందన్న జ్ఞానం కలిగిన వర్తకులు తమ వినియోగదారులను, ప్రజలను, ప్రభుత్వాన్ని మోసం చేయలేరు. వారు వ్యాపారాన్ని ధర్మకర్తలలాగా నడిపి అందరికీ ప్రయోజనం చేకూరేటట్లు నడుచుకోవాలి.

**4. సేవారంగం :** ఏ వృత్తి లేదా ఉద్యోగంలో ఉన్నా దానిని గాంధీజీ తన న్యాయవాద వృత్తిని నిర్వర్తించినట్లు నిర్వర్తించవచ్చు.

**“ నేనెప్పుడూ నా వృత్తిలో అసత్యానికి పాల్పడలేదని చెప్పగలను. నా వృత్తిలో చాలావరకు ప్రజా ప్రయోజనాల కోసమే, అది కూడా కోర్టు ఖర్చులు మాత్రం తీసుకునే వాడిని. కొన్నిసార్లు ఆ ఖర్చులు కూడా నేనే భరించే వాడిని.**

**విద్యార్థిగా ఉన్నప్పుడు 'న్యాయవాద వృత్తి అసత్యవాది వృత్తి' అని ఇతరులు చెపుతుండగా విన్నాను. కానీ ఆ మాటలు నన్ను ప్రభావితం చేయలేదు. ఎందుకంటే నా వృత్తి ద్వారా నేను ధనాన్ని, పదవులను ఆశించలేదు.**

**నేను నమ్మిన సత్యాలు ఎన్నోసార్లు నా వృత్తిలో పరీక్షకు నిలబడ్డాయి. ఎన్నోసార్లు నా ప్రత్యర్థి న్యాయవాదులు తమ సాక్షులకు అబద్ధపు సాక్ష్యాలు ఇచ్చేట్లు శిక్షణ ఇవ్వటం నాకు తెలుసు. నేను కూడా అదే పని చేస్తే వ్యాజ్యం గెలుస్తాననిపించినా అటువంటి ఆలోచనలను త్రుంచేసే వాడిని. నా కక్షిదారు వైపు సత్యం ఉంటేనే అతను వ్యాజ్యం గెలవాలని హృదయంలో కోరుకునే వాడిని.**

**నా దగ్గరికి వచ్చే కక్షిదారులందరికీ నేను తప్పుడు వ్యాజ్యాలను**

**అంగీకరించనని, సాక్షులచేత అబద్ధాలు చెప్పించనని స్పష్టం చేసే వాడిని. క్రమేపీ నా దగ్గరకొచ్చే కక్షిదారులు కూడా సత్యవంతమైన వ్యాజ్యాలను నాకు ఇచ్చి ఇతర రకాలైన వ్యాజ్యాలను వేరే న్యాయవాదుల దగ్గరకు తీసుకువెళ్ళేవారు."**

**– గాంధీజీ**

ప్రజలు చిన్న వయస్సునుండి సంఘానికి ఉపయోగకరమైన కార్యక్రమాలలో పాల్గొనటం మంచిది. విద్యార్థి దశలోనే ఎన్.ఎస్.ఎస్. (జాతీయ సేవా పథకం) ఎన్.సి.సి., రక్తదాన శిబిరాలు, ప్రకృతి వైపరీత్య సహాయ శిబిరాల వంటి స్వచ్ఛంద సేవా కార్యక్రమాలలో పాల్గొనటం ద్వారా నాయకత్వ లక్షణాలను, భావ వ్యక్తీకరణ (కమ్యూనికేషన్ స్కిల్స్)ను పెంపొందింపచేసుకొని వ్యక్తిత్వ వికాసం పొందవచ్చును.

కర్మ సిద్ధాంతం ప్రకారం మనిషి తాను ఏ విత్తనాలను నాటుతాడో వాటికి సంబంధించిన ఫలాలను మాత్రమే పొందుతాడు. అలాగే అతడు సత్త్వ, రజో, తమో గుణ ప్రభావితుడై కర్మలను చేసినప్పుడు వాటిచే బంధించబడి మోక్షమునకు దూరమవుతున్నాడు.


ఉదాహరణకు ఒక మానవుడు రజోగుణ ప్రభావితుడై అమితంగా సంపదలను చేకూర్చుకుంటే వాటిపై మమకారం తీరేవరకు జనన, మరణ చక్రంలో పరిభ్రమించాల్సిందే. తమో గుణమైన అజ్ఞానం వలన తప్పులను చేస్తే వాటికి తగిన శిక్షను ఈ జన్మలోనైనా లేక రాబోయే జన్మలలోనైనా అనుభవించాల్సిందే. ఈ జన్మలో లేదా రాబోయే జన్మలలో అనుభవించేవే స్వర్గ నరకాలు. స్వర్గ నరకాలు ఆకాశంలో ఉండేవి కావు. మంచి కాలం లేదా మంచి పరిస్థితులే స్వర్గం. చెడుకాలం లేదా చెడు పరిస్థితులే నరకం.

కర్మ బంధం నుండి తప్పించుకోవటానికి కొందరు సన్యాసాన్ని ఆశ్రయిస్తారు. కానీ ఏ మానవుడూ కర్మలను చేయకుండా ఉండలేడు. ఎందుకంటే తినటం, నడవడం, మాట్లాడటం వంటి పనులు కూడా కర్మలే. కనుకనే మోక్షాన్ని పొందగోరే వారు కర్మలను త్యజించటానికి బదులు వాటి ఫలాలపై ఆసక్తిని వదిలి కర్మలను ఆచరించుతూ తమ యోగ క్షేమాలను భగవంతునికి వదలి వేయాలి.

భగవంతుడు సర్వాంతర్యామి. అయితే మలినాలతో కూడుకున్న నీటిలో కంటే నిర్మలంగా, పరిశుభ్రంగా ఉన్న నీటిలో సూర్య కాంతి బాగా కనిపిస్తుంది. అదే విధంగా ఆధ్యాత్మిక సాధన అనేది మన అంతరంగ ప్రక్షాళనతో పాటు ఇతరులను సేవించటమే. మానవ సేవయే మాధవ సేవ.

★ ★ ★

# అధ్యాయం - 18
# మృత్యువు నుండి అమరత్వానికి పయనం !



ఇతర జీవులను ఆహారం కోసం చంపేది మృగం
ఇతర జీవులను వినోదం కోసం చంపేవాడు దానవుడు
ఇతరులను బ్రతకనిస్తూ తాను బ్రతికేవాడు మానవుడు
ఇతరుల కోసమే జీవించేవాడు దేవుడు

గాంధీజీ మరియు ఇతర స్వాతంత్ర్య సమరయోధులు దశాబ్దాలుగా చేస్తున్న పోరాటం ఫలించింది. 1947 ఆగస్టు 15 నాటికి దేశాన్ని మతప్రాతిపదిక మీద విభజిస్తూ స్వాతంత్ర్యం ఇవ్వటానికి బ్రిటిషువారు అంగీకరించారు. గాంధీజీ గత్యంతరం లేని పరిస్థితుల్లో దేశవిభజనకు అంగీకరించడం, అల్ప సంఖ్యాకులపై దాడులను వ్యతిరేకించడం మతోన్మాదులకు కోపకారణమైంది. ఆయన అల్ప సంఖ్యాకుల పక్షపాతి అని అధిక సంఖ్యాకులకు ద్రోహం చేస్తున్నారని నిందిస్తూ హత్యాప్రయత్నాలు జరిగాయి. అయినప్పటికి గాంధీజీ రెండు మతాల ప్రజల మధ్య సయోధ్య కొరకై కృషి చేస్తూనే ఉన్నారు.

1948 జనవరి 30 వ తేది సాయంత్రం 5.10 గంటలకు గాంధీజీ తన మకామైన బిర్లా హౌస్ నుండి ప్రార్థన మందిరానికి బయలుదేరారు. సుమారు ఐదు వందల మంది ప్రజలు ఆయనను దర్శించాలని, కలసి ప్రార్థన చేయడానికి వేచి ఉన్నారు. నిర్విరామ పర్యటనలతో, నిరాహారదీక్షలతో అలసి ఉన్న గాంధీజీ తన మనుమరాళ్ళ ఆసరాతో నడవ సాగారు. కొంత మంది సందర్శకులు ఆయన పాదాలపై పడి ఆశీర్వాదాలు కోరసాగారు. గాంధీజీ ఆగి తనదైన శైలిలో చిరునవ్వుతో వారికి ప్రతి నమస్కారం చేశారు.

గుంపులో నుండి ఒక వ్యక్తి ముందుకు చొచ్చుకొని వచ్చి గాంధీజీకి నమస్కారం చేస్తూనే పిస్తోలు బయటికి తీసి మూడుసార్లు కాల్చాడు. ఛాతీలోకి, కడుపులోకి తూటాలు దూసుకొని పోగా 'హే రామ్' అంటూ గాంధీజీ నేలకొరిగారు. పది లక్షల మంది హాజరైన ఆయన అంతిమ యాత్రకు విచ్చేసిన దేశవిదేశీ అధినేతలు, ప్రముఖులు గాంధీజీకి ఘనంగా నివాళులు అర్పించారు.

The art of dying is a corollary to the art of living.

**" ఆత్మ యొక్క అమరత్వం గురించి నాకు ప్రగాడ విశ్వాసం ఉంది. ఇందుకు సముద్రం ఒక ఉదాహరణ. సముద్రమంతా ఎన్నో నీటిబొట్లతో నిండిఉంది. ప్రతి నీటిబొట్టు సముద్రంలో భాగమైనప్పటికి దానిని ఒక ప్రత్యేక అస్తిత్వం కలిగిన బిందువుగా చూడగలము. మనమంతా సముద్రంలోని నీటి బిందువులవంటివారం. మనం అన్ని ప్రాణులతోనూ తాదాత్మ్యం చెందినప్పుడు భగవంతుని సన్నిధిని ఆస్వాదించగలము. ఈ మొత్తం జీవితమంతా దైవమే.**

**మహాత్ములుగా ప్రసిద్ధులైనవారి మరణం గురించి మనం దుఖించ నక్కరలేదు. వాస్తవానికి వారి ప్రభావం, వారి కార్యకలాపాలు వారి మరణానంతరమే మొదలవుతాయి. అటువంటి మహాత్ముల అడుగుజాడలలో నడవటం మనందరి కర్తవ్యం" – గాంధీజీ**

ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టైన్ గాంధీజీ గురించి "ఇటువంటి ఒక అద్భుతమైన వ్యక్తి సజీవంగా భూమిపై నడయాడారన్న విషయం భావితరాలకు నమ్మశక్యం కాదు" అని ప్రశంసించారు. గాంధీజీ సాధించిన విజయాలు ఎన్నెన్నో! ప్రపంచంపై వాటి ప్రభావాన్ని పరిగణలోకి తీసుకొంటే ఆయన కీర్తి ప్రతిష్టలు ప్రపంచమంతటా శాశ్వతంగా నిలిచిపోతాయి.

ప్రపంచమానవాళిలో ఐదవవంతు జనబాహుళ్యానికి గాంధీజీ స్వాతంత్ర్యం సంపాదించారు. ఆ పోరాటస్ఫూర్తితో ఆసియా, ఆఫ్రికా ఖండాలలోని మరెన్నో దేశాలు కూడా స్వాతంత్ర్యాన్ని పొందాయి. నెల్సన్ మండేలా (దక్షిణ ఆఫ్రికా), అంగ్ సాన్ సూకీ (మయన్మార్), జూనియర్ మార్టిన్ లూథర్ కింగ్ (అమెరికా) వంటి ఎందరో సమరయోధులు గాంధీజీ నుండి స్ఫూర్తిని పొందారు.

భారతదేశంలో కూడా తరతరాలుగా అగ్రవర్ణాల అణచివేతకు గురవుతూ అంటరానితనాన్ని అనుభవిస్తున్న నిమ్న వర్గాల అభ్యున్నతికోసం గాంధీజీ పోరాడారు. అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా సమానత్వాన్ని పొందిననాడే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం లభించినట్లవుతుందని ఆయన చెప్పేవారు. గాంధీజీ ఆత్మార్పణ కూడా మతోన్మాదంతో, విద్వేషంతో చెలరేగుతున్న అల్లరిమూకలు అదుపులోకి వచ్చి దేశం పరమత సహనం, లౌకిక రాజ్యం వంటి మానవత్వపు విలువల పునాదిపై నిలిచేటట్లు తోడ్పడింది.

పురాణాలలో దేవతలకు దానవులకు మధ్య జరిగే యుద్ధాల గురించిన వర్ణన ఉంటుంది. అయితే ఆ కథలను పుక్కిటి పురాణాలుగా కొట్టివేయకుండా వాటిలోని సారాంశాన్ని గ్రహించాలి.

మానవజాతికి దైవత్వం అసురత్వం అనే రెండు గమ్యాలు ఉన్నాయని భగవద్గీత బోధిస్తుంది. దైవత్వం మూర్తీభవించే గుణాలను పెంపొందింప చేసుకోవటం ద్వారా అసుర గుణాలను నిర్మూలించవచ్చును. దైవత్వానికి తోడ్పడే గుణాలు – ప్రేమ, దయ, క్షమ, సత్యసంధత, నిర్భయత్వం, అణకువ, స్థితప్రజ్ఞత, స్వీయనియంత్రణ వంటివి. అసురత్వానికి కారణమయ్యే గుణాలు – ద్వేషం, అసూయ, అహంకారం, క్రోధం, లోభత్వం, కుటిలత్వం వంటివి.

అసురీగుణం కలవారు ధర్మశాస్త్రాలన్నీ బూటకాలని, ఈ ప్రపంచంలో పైకి రావాలంటే నైతిక విలువలను, నియమాలను పట్టించుకోకూడదని వాదిస్తారు. తమ లక్ష్యాలను సాధించడానికి అడ్డదారులను చెడు దారులను ఆశ్రయిస్తారు. తమ సుఖసంతోషాలకోసం ఇతరులను బాధిస్తారు. వారు తాము కోరుకున్నవన్నీ సాధించినప్పటికీ తమ దుష్కార్యాలకు ఫలితాన్ని ఈ జన్మలోనే అనుభవిస్తారు. అయితే భగవంతుడు వారిలో కూడా అంతర్యామిగా వ్యక్తమై ఉన్నందున వారు సన్మార్గానికి మరలి ముక్తిని పొందే అవకాశం ఎల్లప్పుడూ ఉంది.

గీతాబోధనను వింటున్న అర్జునుడికి ఒక సందేహం కలిగింది. “కృష్ణా ! ఆధ్యాత్మిక సాధనలతో కృషి చేస్తున్న వ్యక్తి మోక్షాన్ని పొందకుండానే మరణిస్తే అతని గతి ఏమిటి? ప్రాపంచిక భోగాలకు దూరం కావటంతో పాటు మోక్షాన్ని కూడా పొందకుండా అతడు ఉభయభ్రష్టుడు కాడా?”

అర్జునుడి ఆందోళనను అర్థం చేసుకొన్న కృష్ణుడు “ఆధ్యాత్మిక మార్గంలో సాధకుడి ఏ ప్రయత్నమూ వృథా కాదు. అతడు రాబోయే జన్మలో ఆధ్యాత్మిక సాధనలకు అనుకూలించే కుటుంబంలో జన్మించి తన సాధనలను చిన్న వయస్సు నుండే కొనసాగిస్తాడు” అని తెలియచేశాడు.

దైవమార్గం మోక్షానికి, అసురీమార్గం బంధానికి దారితీస్తుంది. దుష్కార్యాలకు ఫలం క్రూరమృగంగా అజ్ఞానాంధకారంలో అలమటించడం. సత్కార్యాలకు ఫలం ఉన్నత కుటుంబంలో జన్మించి భోగభాగ్యాలను అనుభవించడం. అయితే జ్ఞానులు సుఖ సంపదలు కూడా ప్రకృతి మాయలో భాగం కనుక అవి అశాశ్వతాలని, మోక్షాన్ని పొంది పరమాత్మలో లీనం కావటమే అంతిమలక్ష్యంగా ఉండాలని బోధిస్తారు.

భగవంతుని కొంతవరకైనా తెలుసుకోవాలంటే మనకు విజ్ఞానం, జ్ఞానం రెండూ అవసరం. మనం విజ్ఞానాన్ని పంచేంద్రియాల ద్వారా, మనస్సు ద్వారా గ్రహిస్తాము. వాటి సహాయంతో భగవంతుని విభూతులను (మహిమలను) గురించి చదివి లేదా విని తెలుసుకోవచ్చును. జ్ఞానం ద్వారా మనం భగవంతుని అనుభవపూర్వకంగా ప్రత్యక్షంగా తెలుసుకోవచ్చును. అట్టి జ్ఞాని ప్రతి క్షణమూ భగవంతుని ఎరుకతో ఉంటాడు. ఆత్మ సాక్షాత్కారం పొందిన మహాత్ములు భగవంతుని సేవకే తమ జీవితాన్ని అర్పించుకొంటారు. తమ వేలాది జన్మల పరిణామక్రమాన్ని పూర్తి చేసుకొని స్వగృహాన్ని చేరుకొంటారు.

భగవంతునికి కాలుడు (టైమ్) అనే పేరు కూడా ఉంది. భగవంతుడే మృత్యువు మరియు అమరత్వం కూడా !

ఎవడైతే మరియొక చింతన లేక నన్నే నిరంతరం స్మరిస్తుంటాడో
అట్టివాడే నిజమైన యోగి
అట్టివాడు నన్ను సులభంగా చేరగలడు. (భగవద్గీత 8:14)

నాలో ఐక్యమైన మహాత్ములు
జనన మరణ చక్రం నుండి
విముక్తులై మోక్షాన్ని పొందుతారు. (భగవద్గీత 8:15)

నాలో ఐక్యమైన వారు తప్ప
మిగిలిన జీవరాశి అంతా
జనన మరణ చక్రంలో పరిభ్రమించవలసిందే! (భగవద్గీత 8:16)

విశ్వ రహస్యాలు తెలిసిన జ్ఞానులు బ్రహ్మ యొక్క
పగలు వేయి యుగములు గానూ
బ్రహ్మ యొక్క రాత్రి మరియొక
వేయి యుగములు గానూ గ్రహిస్తారు. (భగవద్గీత 8:17)

బ్రహ్మ యొక్క పగలు ప్రారంభమైనప్పుడు
అవ్యక్తం నుండి సమస్త చరాచర పదార్థములు ఉద్భవించి
బ్రహ్మ యొక్క రాత్రి ప్రారంభమైనప్పుడు
తిరిగి అవ్యక్తంలోనే లయమవుచున్నవి. (భగవద్గీత 8:18)

సమస్త జీవరాశులన్ని బ్రహ్మయొక్క పగటియందు
మరల మరల ఉద్భవించి
రాత్రియందు లయమవుచున్నవి. (భగవద్గీత 8:19)

బ్రహ్మ యొక్క పగలు మన్వంతరం గానూ, రాత్రి ప్రళయంగానూ వ్యవహరింపబడుతుంది.

ఎన్నో మన్వంతరాలు, ప్రళయాల పిమ్మట
విశ్వం పూర్తిగా శూన్యంలో
లయించి పోయిన తదుపరి కూడా
శాశ్వతంగా ఉండే పరతత్వమే నేను! (భగవద్గీత 8:20)

వేలాది మందిలో కేవలం ఒక్కరు మాత్రమే భగవంతుని నిజంగా అన్వేషిస్తారు. అలా అన్వేషించే వేలాది మందిలో ఒక్కరు మాత్రమే భగవంతునిలో ఐక్యమవుతారు. ఆధ్యాత్మిక మార్గంలో విజయం సాధించటానికి సంభావ్యత (Probability) ఇంత తక్కువగా ఉన్నప్పటికీ భగవంతుని ప్రణాళిక ప్రకారం ప్రతి ఒక్కరు క్రమంగా పరిణతి చెంది భగవంతునిలో ఐక్యం కావలసిందే. భక్తులు ఏ దేవతలను, విగ్రహాలను ఆరాధిస్తున్నప్పటికి వారందరూ పరమాత్మ వైపు పయనిస్తున్నట్లే.

నా యొక్క మూలాన్ని దేవతలు,
మహర్షులు కూడా తెలుసుకోలేరు.
ఎందుకంటే వారు కూడా
నానుండే ఆవిర్భవిస్తున్నారు కనుక! (భగవద్గీత 10:2)

ఎవరైతే నన్ను పుట్టక లేనివానిగను,
అనాదిరూపునిగాను, సమస్త విశ్వానికి
ప్రభువుగాను తెలుసుకొంటారో
అట్టి వారు అజ్ఞానం నుండి,
సర్వ పాపములనుండి విముక్తులవుతారు. (భగవద్గీత 10:3)

గాంధీజీ బోధనలను ప్రచారం చేయటానికై సహచరులు ఒక సంస్థను ప్రారంభించినప్పుడు ఆయన వారిని వారించారు.

**"గాంధేయవాదం, గాంధీమార్గం, గాంధీయిజం వంటి ఇజాలకు నేను బద్ధవ్యతిరేకిని. నేను కొత్తగా కనుగొన్నది, కొత్తగా ప్రపంచానికి బోధించగలిగినది ఏదీ లేదు. ధర్మం, సత్యం, అహింస అనేవి అనాదికాలం నుండి ఉంటున్నవే. నేను కేవలం వాటిని నా నిత్య జీవితంలో ఆచరించి చూస్తున్నాను. నా ప్రయోగాలలో లోటుపాట్లు ఉన్నప్పుడు వాటిని సరిదిద్దుకొంటున్నాను.**

**నా జీవితానుభవాన్ని బట్టి సత్యమే దైవమని గ్రహించాను. ఆ సత్యాన్ని చేరుకోవటానికి అహింస ఒక్కటే మార్గమన్నదే నా ఆత్మకథలోని సారాంశం.**

సర్వాంతర్యామి అయిన భగవంతుని సందర్శించాలంటే ఈ సృష్టిలోని అత్యల్ప ప్రాణిని కూడా ప్రేమించగలగాలి. అలా ప్రేమించగలిగిన వ్యక్తి తోటి ప్రాణులను, ప్రజలను సేవించడానికి ఏ కార్యక్షేత్రంలో ప్రవేశించటానికీ వెనుకాడడు. ఆ కారణం వల్లనే నేను రాజకీయాలను నా కార్యక్షేత్రంగా ఎన్నుకొన్నాను. మతమూ రాజకీయమూ విడివిడిగా ఉండాలని నేటి తరంవారు భావిస్తారు. అయితే అలా భావించేవారికి మతానికి అసలైన అర్థం తెలియదనే నేను వినమ్రంగా చెబుతాను.

సర్వప్రాణులతో తాదాత్మ్యం చెంది వాటిని ప్రేమించగలగడం ఆత్మశుద్ధి ఉన్నప్పుడే సంభవిస్తుంది. హృదయం పరిశుద్ధంగా లేనివారు భగవంతుని ఎన్నటికి కనుగొనలేరు.

కనుక ఆత్మశుద్ధిని కలిగి ఉండటం అంటే మనం చేసే అన్ని పనులలోనూ ధర్మబద్ధంగా ఉండటమే! పరుసవేది దేనినైనా స్వర్ణంగా మార్చివేస్తుందంటారు. అదే విధంగా ఒక వ్యక్తి ఆత్మశుద్ధి కలిగిఉంటే తన చుట్టుప్రక్కల ఉన్నవారందరినీ ఆత్మశుద్ధి కలవారుగా మార్చివేస్తాడు.

అయితే ఆత్మశుద్ధిని సాధించే మార్గం అతి కఠినమైనది. అందుకు మనం మనసా, వాచా, కర్మణా పరిశుద్ధులు కావాలి. త్రికరణశుద్ధి అంటే మనసులో తలచినదే చెప్పటం, చెప్పినదే చేయడం. నిరంతర కృషి తర్వాత కూడా నేనింకా ఆ త్రికరణశుద్ధిని సాధించలేదు. అందుకే ప్రపంచమంతా నన్ను మహాత్ముడని పొగిడితే నేను ఆనందించడానికి బదులు నా లోపాలను తలచుకొని కించపడతాను.

ఆయుధాలు ధరించి ప్రపంచాన్ని జయించడం కన్నా మనస్సును లొంగదీసుకోవటం చాలా కష్టం. దక్షిణ ఆఫ్రికా నుండి తిరిగి వచ్చినప్పటినుండి నాలోని వికారాలు ఇంకా అదుపులోకి రాలేదు. అయితే ఆ వాస్తవం నన్ను పరాజితుడిగా కాక వినమ్రుడైన నిరంతర సాధకుడిగా మార్చింది. నా ప్రయోగాలు, అనుభవాలు నాకెంతో ఆనందాన్ని కలిగిస్తున్నాయి. అయితే నేను ఆధ్యాత్మికంగా సాధించాల్సింది ఇంకా ఎంతో ఉంది. నా అహంకారాన్ని పూర్తిగా తొలగించుకోవాలి. అహింస ద్వారా మానవుడు సమస్త జీవరాశిని ప్రేమించి సేవించగలిగినప్పుడే మోక్షానికి అర్హత లభిస్తుంది." – గాంధీజీ.

'మనయేవ మనుష్యానాం బంధ మోక్షయ' అన్న సూక్తి ప్రకారం మనస్సే మన బంధాలకు మోక్షానికి కూడా కారణం. 'ఆత్మనో మోక్షార్ధం జగత్ హితాయచ' అన్న సూక్తి ప్రకారం సంఘసేవ ద్వారా భగవంతుని సేవించడంతో పాటు ఆత్మ సాక్షాత్కారాన్ని పొందవచ్చును.

అయితే జీవిత సమస్యలతో బాధపడేవారికి మోక్షం గురించి, సంఘసేవను గురించి వివరించడం క్రూర పరిహాసమవుతుంది. కాబట్టి ఈ పుస్తకం యొక్క ప్రథమ ధ్యేయం జీవిత సమస్యలకు పరిష్కారం వివరించడమైనప్పటికి అంతిమ ఉద్దేశ్యం మాత్రం పాఠకులకు మోక్ష సాధనలో తోడ్పడి మరింత మెరుగైన సమాజం కోసం పాటుపడటమే. లౌకిక జీవితంలోని విజయం కన్నా ఆధ్యాత్మిక జీవితంలోని విజయం మరింత ముఖ్యం. ఉపోద్ఘాతంలో చెప్పినట్లు ఈ పుస్తకాన్ని కేవలం చదివి ప్రక్కన పెట్టేయకుండా నిత్య జీవితంలో మార్గదర్శిగా ఉపయోగిస్తేనే అత్యధిక ఫలితం ఉంటుంది.

మానవులలో ఎన్నో ఏళ్ళుగా పాతుకుపోయిన బాధ్యతా రాహిత్యం, స్వార్థం, ద్వేషం, కుటిలత్వం, అసూయ వంటి దుర్గుణాలు అంత సులభంగా తొలగిపోవు. వాటిని ఇతరులలో తొలగించాలనుకునే ముందు మనలో ఆ దుర్గుణాలను నిర్మూలించుకుంటూ ఇతరులకు ఒక ఉదాహరణగా నిలవాలి. తోటి మానవులపై ప్రేమ, నిర్భయత్వం, భగవంతుని యందు విశ్వాసం, అపరిగ్రహం వంటి సుగుణాలను పెంపొందింప చేసుకోవాలి. ఆ ప్రయత్నంలో గాంధీజీ లాగా ఆత్మశోధన చేసుకుంటూ లోపాలను సరిచేసుకుంటూ పరిణతి చెందటానికి మన జీవితాన్నే ఒక ప్రయోగశాలగా మార్చుకోవాలి.

ఎక్కడ సత్యము, ధర్మము మూర్తీభవించిన
యోగేశ్వరుడైన కృష్ణుడు
మరియు మనోనిగ్రహం, శస్త్ర ప్రావీణ్యం కలిగిన
అర్జునుడు ఉంటారో,
అక్కడ విజయం, ఐశ్వర్యం, ఆనందం
నెలకొంటాయి. (భగవద్గీత 18:78)

★ ★ ★

# సారాంశం

**ఒకటవ భాగం : భౌతిక విజయం**

1. జీవితం ఒక యుద్ధరంగం : ప్రతి మానవుడి జీవితంలోనూ ఏదో ఒక సమయంలో తీవ్రమైన అలజడి చెలరేగవచ్చు. తనమీద తనకు అదుపు లేకనో, లేదా తన శత్రువులు బలవంతులు కావటం వల్లనో మనిషి నిరాశా నిస్పృహల్లో కూరుకొని తన సమస్యలను ఎలా ఎదుర్కోవాలో తెలియని పరిస్థితిలో ఉంటారు. అటువంటి సమయాల్లోనే భగవద్గీతయొక్క మార్గదర్శకత్వం ఎంతో అవసరం. శ్రీ కృష్ణుడు భగవద్గీతను బోధించడానికి అరణ్యవాసంలోని ఆశ్రమాన్నో లేక దేవాలయాన్నో కాకుండా యుద్ధభూమిని తగిన ప్రదేశంగా ఎన్నుకొన్నాడు. కనుకనే భగవద్గీత అంటే పూజగదిలో భద్రపరిచి వృద్ధాప్యంలో చదువుకొనే కాలక్షేపపు గ్రంథం కాదు. భగవద్గీత జీవితపు సమస్యల నుండి పారిపోయి సన్యాసం స్వీకరించమని బోధించదు. అది మానవుడు ఎలా సమస్యల్లోకి చొచ్చుకుని వెళ్ళి విజయుడై తిరిగి రాగలడో తెలియ చేస్తుంది. అది మన నిత్యజీవితంలో మార్గదర్శిగా ఉపయోగపడుతుంది.

2. ఆలోచనే బీజం : మానవవేతర జీవరాశులన్నీ ప్రకృతి నియమబద్ధంగా తమ జీవితాలను గడుపుతాయి. కేవలం మానవుడు మాత్రమే ఆలోచించి ఏది ధర్మమో ఏది అధర్మమో అనే విచక్షణతో ప్రవర్తించగలడు. పాజిటివ్ ఆలోచనలు విజయాన్ని, ఆనందాన్ని కలగచేస్తే నెగటివ్ ఆలోచనలు అపజయానికి, పతనానికి దారి తీస్తాయి. కాబట్టి మన మనస్సును నెగటివ్ వ్యక్తుల, ఆలోచనలు ప్రభావం నుండి కాపాడుకోవాలి.

3. సంకల్ప బలం : మానవులను తార్కికమైన ఆలోచనలకన్నా కోరిక, ప్రేమ, విశ్వాసం వంటి భావాలతో కూడుకోన్న భావోద్వేగాలు ఎక్కువగా స్పందింపచేసి విజయంవైపు నడిపిస్తాయి. కోరికలు ఇతరులకు నష్టం కలిగించి ఒక్కరికి స్వప్రయోజనం చేకూర్చేది కాకుండా అందరి ప్రయోజనాలను కాపాడేదిగా ఉండాలి.

4. విశ్వాసం కొండల్ని కూడా కదిలించగలదు : విజ్ఞాన శాస్త్రం వివరించలేని అన్ని అద్భుతాలకు, అతీంద్రియ శక్తులకు విశ్వాసమే మూలం. భగవంతునిపై విశ్వాసాన్ని ఆలంబనగా చేసుకొని తొలి అడుగు వేస్తే మిగిలిన అడుగులన్ని విజయంవైపు దారితీస్తాయి.

5. జ్ఞానయోగం – విజ్ఞానాన్ని సరియైన రీతిలో ఉపయోగించడం : విజ్ఞానం కేవలం సాంఘికశాస్త్రం, సామాన్యశాస్త్రం వంటి వాటి గురించి వివరిస్తే జ్ఞానం మన సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలి, ఎలా జీవితాన్ని మెరుగుపరుచుకోవాలి అన్న తెలివిని ప్రసాదిస్తుంది. ధర్మం గురించి స్థూలంగా చెప్పాలంటే వేడిని, వెలుగును ఇవ్వటం నిప్పు యొక్క ధర్మం. అలాగే మానవునిలోని నిష్కల్మషమైన ప్రేమ, దయ, మంచితనంతో కూడిన మానవత్వం అతని ధర్మం. సూక్ష్మంగా చెప్పాలంటే ఈ విశ్వాన్ని, ప్రకృతిని ఒక క్రమ పద్ధతిలో నడిపేదే ధర్మం. ధర్మాన్ని అనుసరించి విశ్వాన్ని నడిపించడానికి ఏర్పడిన న్యాయసూత్రమే కర్మసిద్ధాంతం. మానవుడు చెడు చేస్తే దానియొక్క ఫలితాలు ఈ జన్మలోగానీ, వచ్చే జన్మలోగానీ అనుభవించే విధంగా, తద్వారా మానవుడు ధర్మబద్ధంగా జీవించడానికే కర్మ సిద్ధాంతం ఉద్దేశింపబడింది.

6. జ్ఞానం కన్నా బలీయమైనది ఊహా శక్తి : జ్ఞానం మనకు తెలిసిన ప్రపంచానికి పరిమితమైతే ఊహ అనేది మనకు తెలియని ప్రపంచానికి, విషయాలకు సంబంధించినది. మానవుని పరిణామక్రమంలోని గొప్ప ఆవిష్కరణలైన చెకుముకి రాయి, చక్రం, టెలిఫోన్, అంతర్జాలం వంటివి ఊహాశక్తి ద్వారా రూపు దిద్దుకున్నవే. ఉదాహరణకు గాంధీజీ ఉప్పు సత్యాగ్రహం ద్వారా చేసిన పోరాటం.

7. ప్రణాళికల ద్వారా కార్యాచరణను రూపొందించడం : ఏవైనా సమస్యలను పరిష్కరించాలనుకున్నా లేదా సంకల్పాన్ని సాధించుకోవాలన్నా మన సమయాన్ని, ధనాన్ని, మానవ వనరులను కాల పట్టిక (టైం టేబుల్) ద్వారా సక్రమంగా ఉపయోగించాలి. విజేతలైన వారు సరియైన నిర్ణయాలను తక్షణమే తీసుకొని, తర్వాత అవసరాన్ని బట్టి నిర్ణయాన్ని మార్చటం గానీ, రద్దు చేయటం గానీ నిదానంగా చేస్తారు. తరచు అపజయాలు పొందేవారు పైదానికి వ్యతిరేకంగా ఒక నిర్ణయం తీసుకోవడానికి చాలా జాప్యం చేసి, దానిని తరచు మార్చివేయటం చేస్తుంటారు.

8. విశ్వహృదయం, 1+1=>2: ఏదైనా సాధించాలనుకున్నప్పుడు ఒక వ్యక్తి బలం చాలనప్పుడు ఎక్కువమంది సహాయం తీసుకోవాల్సి వస్తుంది. విశ్వహృదయం సూత్రం ప్రకారం ఇద్దరు వ్యక్తులు కలిసినపుడు మూడవ హృదయం వంటి ఒక అగోచరమైన శక్తి వారికి తోడవుతుంది. ఆ విధంగా ఇద్దరు వ్యక్తుల శక్తుల మొత్తం కన్నా బృందం యొక్క శక్తి మరింత ఎక్కువగా ఉంటుంది.

9. నాయకత్వం, సహచరులను లక్ష్యంవైపు నడిపించడం : ఒక వ్యక్తి బలం సరిపోక ఎక్కువమంది సహాయం అవసరమైనప్పుడు నాయకత్వ పాత్ర పోషించాల్సి ఉంటుంది. నాయకుని విజయానికి కానీ, అపజయానికి కానీ దారి తీసే లక్షణాలు ఈ అధ్యాయంలో వివరించబడ్డాయి.

10. ఉపచేతన మనస్సు, మానవహృదయానికి విశ్వహృదయానికి మధ్య వారధి: మనం చేతన మనస్సుని ఉపయోగించి పంచేంద్రియాల ద్వారా బాహ్య ప్రపంచంతో వ్యవహరిస్తాము. ఉపచేతన మనస్సు మీద కోరిక, విశ్వాసం, ప్రేమ, ఆశ, ఉత్సాహం వంటి పాజిటివ్ భావోద్వేగాలు మరియు భయం, ద్వేషం, దురాశ, కోపం, అసూయ వంటి నెగటివ్ భావోద్వేగాలు ప్రభావం చూపుతుంటాయి. పాజిటివ్ భావోద్వేగాలను పెంపొందించుకుంటూ, నెగటివ్ భావోద్వేగాలను తగ్గించుకొంటూ అదే సమయంలో చేతన మనస్సుపై అదుపు కలిగి ఉండటం ద్వారా మనం అంతఃప్రపంచం మరియు బాహ్య ప్రపంచాలపై సమన్వయం సాదించవచ్చును.

11. విశ్వాసం కలిగించే నిర్భయత్వం : మరణభయం మరియు అపజయభయం మానవుని జీవిత యుద్ధరంగం నుండి పారిపోయేవిధంగా ప్రేరేపిస్తాయి. పేదరికం పట్ల భయం మానవుని అడ్డ దారుల్లో ధనం సంపాదించే విధంగా ప్రేరేపిస్తుంది. ఈ భయాలకు విరుగుడు ఏమిటంటే జయాపజయాలను భగవంతుని నిర్ణయానికి వదిలివేయాలి. భవిష్యత్తు కోసం అనవసరమైన వస్తువులను కూడబెట్టడం మాని మనకు కావలసిన వాటిని భగవంతుడే సమకూరుస్తాడన్న విశ్వాసంతో జీవించాలి.

12. కృషితో నాస్తి దుర్భిక్షం : కొన్ని సందర్భాలలో మనం మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించలేక పోవచ్చును. కానీ అధైర్య పడకుండా తరచూ విశ్వహృదయం బృందంతో కలవడం, ఇతరుల నెగటివ్ ఆలోచనలనుండి దూరంగా ఉండటం, ప్రణాళికలను సమీక్షిస్తుండటం వంటి వాటి ద్వారా పట్టుదలగా విజయం వైపు అడుగులు వేయాలి.

**రెండవ భాగం : ఆధ్యాత్మిక విజయం**

13. సృష్టి పరిణామక్రమం : ఎన్నో తరాలుగా మనలో వస్తున్న జంతు ప్రవృత్తిని తొలగించుకొంటూ దివ్య లక్షణాలను పెంపొందించుకోవడమే సృష్టి పరిణామక్రమం. మీరు ఈ పుస్తకంలోని సూత్రాలను పాటించటం మొదలు

పెట్టినప్పటినుండి ఇతరులు మీతో ప్రవర్తించే విధానంలో మార్పు గమనించగలరు. ఈ పుస్తకాన్ని మరింత మందితో పంచుకోవటం ద్వారా మీరు వారికి మేలు చేయటంతో పాటు మీకు మీరు మేలు చేసుకొన్నవారవుతారు.

14. మాయ, భగవంతుని దివ్య లీల : ఈ విశ్వమంతా భగవంతుని నుండి ఉద్భవించి తిరిగి భగవంతునిలో లయమౌతుంది. మన జీవిత లక్ష్యం మోక్షాన్ని పొందటమే. అందుకు మార్గం జ్ఞాన, ధ్యాన, భక్తి, కర్మ యోగాలను అవలంబించి సత్త్వ, రజో, తమో గుణాలను అధిగమించడమే.

15. ధ్యాన యోగం : ego (అహం) అనేది మనం ధరించిన తర్వాత తీసివేయడం మరిచి పోయిన ఒక ముసుగు మాత్రమే. ఈ ముసుగు వెనుక నిష్కల్మషమైన ప్రేమ, అవధులు లేని ఆనందంతో నిండిన మన నిజస్వరూపం ఎల్లప్పుడూ ఉండనే ఉంది. ధ్యానం ద్వారా మన నిజ స్వరూపాన్ని, భగవంతునితో సంబంధాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకోగలుగుతాము.

16. భక్తి యోగం (ప్రేమ మార్గం) : భగవంతుడు సర్వాంతర్యామి కనుక భగవంతుని తల్లి, తండ్రి, శిశువు, గురువు, స్నేహితుడు, వినియోగదారుడు, నిరుపేద మొదలైన అందరిలోనూ దర్శించగలము. భక్తి యోగం ద్వారా మన ప్రేమ పరిధిని వ్యక్తిస్థాయి నుండి కుటుంబ స్థాయికి, సామూహిక స్థాయికి, విశ్వ స్థాయికి విస్తరించాలి.

17. కర్మ యోగం : సృష్టి నియమాలను అనుసరించి మనమందరమూ కర్మలను చెయ్యవలసిందే. సత్త్వ, రజో, తమో గుణాలతో ప్రేరేపితులై కర్మలను చేస్తే మోక్షానికి దూరం కావలసి వస్తుంది. కర్మ బంధాలలో చిక్కుకోకుండా ఉండాలంటే ఫలాపేక్ష లేకుండా 'మానవ సేవయే మాధవ సేవ' అన్న భావనతో గురువులుగా, నాయకులుగా, వ్యాపారవేత్తలుగా, ఉద్యోగులుగా పని చేయాలి.

18. మృత్యువు నుండి అమరత్వానికి పయనం : ప్రతి మానవుడు మృత్యువు గురించి భయపడుతూ మృత్యురాహిత్యాన్ని కోరుకుంటాడు. భౌతిక శరీరం నశించక తప్పదు. అయితే మనం అసత్యం నుండి సత్యంకు, అజ్ఞానం నుండి జ్ఞానోదయంకు, మృత్యువు నుండి అమరత్వానికి పయనించాలి.

ఆత్మ సాక్షాత్కారం పొందిన వ్యక్తికి కూడా కర్మ శేషం ఉండవచ్చు. కర్మ ఫలాలను కుమ్మరి తయారు చేసే మట్టి కుండలతో పోల్చవచ్చు. కుమ్మరి చక్రం తిరుగుతున్నంతసేపు మట్టి కుండ తయారవుతూనే ఉంటుంది. చక్రం ఆగిపోవటంతో బాటే కుండ తయారీ కూడా ఆగిపోతుంది. ఆత్మసాక్షాత్కారం పొందిన వ్యక్తి కూడా తన కర్మ శేషం పూర్తిగా క్షయమయ్యేవరకు జీవించివుండి మరణానంతరం భగవంతునిలో లీనమై జన్మరాహిత్యాన్ని పొందుతాడు.

★ ★ ★

# ఉపసంహారం

మన సమాజంలోని ఏడు దుర్మార్గాలను గాంధీజీ క్రింది విధంగా వర్గీకరించారు.

1. వ్యక్తిత్వం లేని విద్య : పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు విద్యార్థులను రేంకుల కోసం, బంగారు పతకాలకోసం పోటీ పడేటట్లు చేస్తున్నాయి. కానీ వారిలో మానవత్వపు విలువలను తీర్చిదిద్ది సమాజానికి ఉపయోగపడేటట్లు చేయడం లేదు.

2. మానవత్వంలేని శాస్త్రాలు : సాంఘిక శాస్త్రం, విజ్ఞాన శాస్త్రం వంటివి కేవలం బాహ్య ప్రపంచం గురించే బోధిస్తున్నాయి. కానీ దాన్ని ఏవిధంగా మానవుని అంతఃప్రపంచంతో సమన్వయం చేసుకోవాలో తెలియచేయటం లేదు.

3. విలువలు లేని వాణిజ్యం : వర్తకులు ఖాతాదారులు ఇచ్చిన ధనానికి తగిన విలువను వస్తు రూపంలోగానీ, సేవల రూపంలోగానీ అందించకపోవటం, సరకులకు కృత్రిమ కొఱతను సృష్టించి నల్ల బజారులో అమ్మటం వంటివి.

4. శ్రమించకుండా సంపాదించడం : షేర్ మార్కెట్లు, గొలుసుకట్టు స్కాములు, లాటరీలు, జూదం వంటివి.

5. తాత్వికత లేని రాజకీయాలు : నాయకులు ప్రజలందరి సమిష్టి ప్రయోజనాలకోసం వారికి మార్గదర్శకత్వం వహించే బదులు వారిని కులాలు, మతాల వారీగా విభజించి ఒకరిపైకి ఒకరిని ఉసికొల్పటం.

6. చిత్తశుద్ధి లేని, హృదయం లేని ఆరాధన : భక్తులు తమ తోటి ప్రజల కష్టాలను పట్టించుకోకుండా దేవతా విగ్రహాలకు బంగారం, వజ్రాలను అలంకరించడం.

7. ఆధ్యాత్మిక ఆలంబన లేని భౌతిక విజయాలకై ఆరాటం :

చాలా మంది మానవుల్లో 'భౌతిక వాదం' కు అర్థం కేవలం ధనం, ప్రాపంచిక సుఖాల పట్ల ఆసక్తి మాత్రమే. కానీ దానికి నిజమైన అర్థం ఏమిటంటే 'ఈ సృష్టిలో భౌతిక సుఖాలు, సంపదయే సత్యం! అంతరాత్మ, పరమాత్మ వంటివన్ని మూఢ నమ్మకాలు మరియు అజ్ఞానుల భ్రాంతి!' అనే భావన.

భౌతిక వాదానికి వ్యతిరేకమైనది 'ఆధ్యాత్మిక వాదం' దురదృష్టవశాత్తూ ఈ పదం భౌతిక వాదం కన్నా ఎక్కువ అపార్థాలకు, తప్పుడు తాత్పర్యాలకు గురయింది. సగటు మానవునికి ఆధ్యాత్మికవేత్త అంటే కాషాయంబరధారులై

భిక్షాటన చేసే సన్యాసులు లేదా గొప్ప భవంతుల్లో నివసిస్తూ గారడీలు చేసే స్వాములు గుర్తొస్తారు.

ఆధ్యాత్మికతకు నిజమైన అర్థం ఏమిటంటే 'సత్యం అనేది భౌతికమైనది కానీ ప్రాపంచికమైనది కానీ కాదు. అది భౌతిక, ప్రాపంచిక వస్తువులకు మూలమైనది, గమ్యమైనది. దానికి అర్థం మనం భౌతిక, ప్రాపంచిక వస్తువులను తిరస్కరించి సన్యసిస్తామని కాదు. మనం ఈ భౌతిక, ప్రాపంచిక వస్తువులు అసత్యం, అశాశ్వతం అన్న జ్ఞానం కలిగి ఉండి వాటిని కేవలం పరికరాలుగా ఉపయోగించి వాటిద్వారా సచ్చిదానంద స్వరూపమైన సత్యాన్ని చేరుకోవాలి.

మహాభారతంలో ఒకవేళ అర్జునుడు యుద్ధం చేయకుండా సన్యసించివుంటే కాషాయంబరధారి అయిన కుహానా ఆధ్యాత్మికవేత్తగా పరిగణింపబడేవాడు. అలా జరిగివుంటే ఒక సైనికునిగా దుర్మార్గులతో పోరాడి సన్మార్గులను కాపాడటమనే ధర్మాన్ని త్యజించి సృష్టి పాలనలో తన వంతు పాత్రను పోషించడానికి నిరాకరించినట్లే. ఒకవేళ అర్జునుడు భగవద్గీతను వినకుండా యుద్ధం చేసి ఉంటే అతడు కేవలం భౌతికవాది గానే పరిగణింపబడేవాడు.

భగవద్గీత యొక్క ప్రయోజనమేమిటంటే అర్జునుడు యుద్ధ పర్యవసానమైన కర్మబంధాలలో చిక్కుకోకుండా సైనికుడిగా తన ధర్మాన్ని నిర్వర్తించాడు. భగవద్గీతను మార్గదర్శకంగా తీసుకొన్న గాంధీజీ తన పేరు ప్రతిష్టలను, ప్రజాభిమానాన్ని స్వార్థానికి ఉపయోగించకుండా తన దృష్టినంతా స్వాతంత్ర పోరాటంపైనే కేంద్రీకరించగలిగారు.

ఎన్నో ఏళ్ళుగా సత్త్వ గుణం చేత గర్వితులైన పండితులు రజోగుణం ఉన్నవారిని చులకనగా చూశారు. కోరికలు లేనట్టి స్థితియే గొప్ప స్థితియని శాస్త్రాలకు విపరీతార్థాలు అన్వయించారు. సైన్య సముపార్జనను, సముద్ర ప్రయాణాలను, విదేశీ వాణిజ్యాలను అడ్డుకొన్నారు. క్రమంగా సంఘం తామసిక అజ్ఞానంలోను, సోమరితనంలోను, నిర్వీర్యతలోను, బానిసత్వంలోను కూరుకొనిపోయింది. ఆ బానిసత్వం నుండి విముక్తి పొందటానికి ఎన్నో శతాబ్దాల పోరాటం అనివార్యం అయింది.

కోరిక (సంకల్పం) నిప్పు లేదా ఇంధనం వంటిది. ఆ సంకల్పబలంతో స్వాతంత్రం సంపాదించడం, శాస్త్రవేత్తగా ప్రాణాంతక వ్యాధులకు ఔషధులు కనుగొనటం, వ్యాపారవేత్తగా ఎందరికో జీవనోపాధి కలిగించడం వంటి నిర్మాణాత్మక కార్యక్రమాలను చేపట్టవచ్చు. లేదా స్వార్థానికో, అహాన్ని తృప్తి పరుచుకోవడానికో విధ్వంసక కార్యక్రమాలు చేపట్టవచ్చు. ఐతే విధ్వంసక కార్యక్రమాల ద్వారా సాధించే విజయం తాత్కాలికమైనదే, ఎందుకంటే 'సత్యమేవ జయతే' అన్న సూక్తి ప్రకారం అంతిమ విజయం ధర్మానిదే!

'శరీరమాధ్యం ఖలు ధర్మ సాధనం' అన్న సూక్తి ప్రకారం ఈ శరీరం అనే పరికరం ద్వారా ధర్మాన్ని పాటిస్తూ, అర్థాన్ని సంపాదిస్తూ, ధర్మబద్ధమైన కోరికలను నెరవేరుస్తూ మోక్షాన్ని పొందాలి. కనుక మనకు ఆధ్యాత్మిక పునాదితో కూడిన భౌతిక విజయం ఎంతో ఆవశ్యకం.

★ ★ ★

# నిత్య జీవితంలో ధర్మాచరణ



"ఇతరులలో చూడాలనుకొనే మార్పు ముందు మీతోనే ప్రారంభమవ్వాలి (be the change you want to see in others)" అని గాంధీజీ చెప్పేవారు. "మనం ఏమి చేసినా సముద్రంలో నీటి బిందువు వంటిదే" అని ఇతరులు అనవచ్చును. కానీ సముద్రం అంటే నీటి బిందువుల సముదాయమే కదా ! సంఘ శ్రేయస్సులోనే నా శ్రేయస్సు ముడిపడి ఉన్నందున నేను క్రింది నియమాలను నిరంతరం పాటిస్తూ ప్రతి రాత్రీ సమీక్షించుకొంటాను.

1. నా ప్రేమను వ్యక్తి స్థాయినుండి సమాజ స్థాయికి, విశ్వస్థాయికి పెంచుకొంటాను. అవినీతి, అక్రమాలు, అత్యాచారాలు, వివక్ష వంటి వాటిమీద సత్యాగ్రహం ద్వారా పోరాడుతాను.
2. ఇతరులు నాతో ఏ విధంగా ప్రవర్తించాలని కోరుకొంటానో, నేను కూడా వారితో ఆ విధంగానే (Golden rule of reciprocity) ప్రవర్తిస్తాను. ఇతరులతో వ్యవహారాలలో ఇరు పక్షాలకు ప్రయోజనం (Win - Win) కలిగే విధంగా వ్యవహరిస్తాను.

3. జ్ఞానాన్ని పంచే గురువుగా లేదా సురాజ్యాన్ని అందించే నాయకునిగా లేదా దేశ సంపద పెంపొందించే వ్యాపారవేత్తగా లేదా వృత్తికారునిగా, ఉద్యోగిగా సేవాభావంతో నేను చేసే ప్రతి పనిలోను లీనమై 100% భాగస్వామ్యం వహిస్తాను.
4. బహిరంగ ప్రదేశాలలో మల మూత్ర విసర్జన, ఉమ్మి వేయటం, చెత్త వేయటం వంటివి చేసి తోటి వారిని ఇబ్బంది పెట్టడం, అంటు వ్యాధులకు తోడ్పటం చేయను. పెట్రోల్, ప్లాస్టిక్ వంటి కాలుష్యకారకాల వాడకాన్ని తగ్గించి, చెట్లను పెంచి, కాపాడి పర్యావరణాన్ని కాపాడతాను.
5. రహదారి భద్రతా నియమాలు, డ్రైవింగ్ లైసెన్స్ నియమాలు, **Q** (వరుస పద్ధతి) వంటిని పాటిస్తాను.
6. పరీక్షలలో ఉత్తీర్ణత పొందటానికి, ఉద్యోగం పొందటానికి కాపీయింగ్, లంచాలు, సిఫారసులు వంటి అడ్డు తోవలను ఆశ్రయించను.
7. ప్రభుత్వ అధికారుల నుండి త్వరిత గతిన సేవలను పొందటానికి లేదా అర్హత లేని సేవలను పొందటానికి అడ్డు తోవలను ఆశ్రయించను. చట్టబద్ధమైన సేవలనే కోరుతాను.
8. నా కనీస అవసరాలను వీలైనంత తగ్గించి నిరాడంబరంగా జీవిస్తాను.
9. నల్ల ధనాన్ని, ఉగ్రవాదుల నకిలీ కరెన్సీని అరికట్టే నగదురహిత సమాజం కోసం కృషి చేస్తాను. నగదు కొనుగోళ్ళు తగ్గించి పారదర్శకంగా ఉండే విధంగా చెక్కులు, డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డులు వంటి మార్గాలను ఉపయోగిస్తాను. కొనుగోలు బిల్లును తప్పక అడిగి తీసుకొంటాను.
10. నా ఆదాయాన్ని స్వచ్ఛందంగా వెల్లడించి చట్టబద్ధంగా పన్ను చెల్లిస్తాను. ఇతరులకు సేవలు లేదా సరకులు అందించినప్పుడు రశీదును తప్పక ఇస్తాను నగదు అమ్మకాలు తగ్గించి పారదర్శకంగా ఉండే విధంగా చెక్కులు, డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డులు వంటి మార్గాలను ఉపయోగిస్తాను.

★ ★ ★



# హృదయపూర్వక విన్నపం !



ప్రియమైన చదువరీ,

ఈ పుస్తకం మీకు ఉపయోగకరంగా ఉందా? మీ బంధుమిత్రుల అభివృద్ధికి తోడ్పడి మరింత మెరుగైన సమాజం ఏర్పడగలదా? అలా భావిస్తే దయచేసి ఈ పుస్తకం ఎక్కువమందికి అందేలా తోడ్పడండి.

భగవద్గీత "ధర్మక్షేత్రే కురుక్షేత్రే..." అనే శ్లోకంతో ప్రారంభమౌతుంది. ప్రజలు తమ వ్యక్తిగత సమస్యలపై మరియు సామాజిక సమస్యలపై పోరాడటానికి ఒక సంఘాన్ని చిత్తూరులో ఏర్పాటు చేశాము. ఈ పుస్తకపు జ్ఞానాన్ని అందరికి అందించడం, అవినీతి, మౌలిక వసతుల సమస్యలపై పోరాటం, ఇతరులకు సహాయం చెయ్యటం, ప్రకృతిని సంరక్షించటం వంటివి ముఖ్య లక్ష్యాలు. ఇటువంటి సంఘాలను ఇతర ప్రాంతాలలో ప్రారంభించి సేవా కార్యక్రమాలు చేయవలసినదిగా ఔత్సాహికులకు విజ్ఞప్తిచేస్తున్నాము.

**<u>ధర్మక్షేత్ర</u>**

3-122,
రాజీవ్ గాంధి రోడ్, గిరింపేట,
చిత్తూరు (ఆం.ప్ర.) - 517002.
సెల్ : 88974 59173
ఈ మెయిల్ : siva.dharmakshetra@gmail.com
వెబ్‌సైట్ : www.dharmakshetra.info

